


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



03 సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం

సంపుటి 09, సంచిక: 227 | శుక్రవారం | 17-07-2026 | మహబూబ్‌నగర్

Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00





అమ్మవారికి పట్టువస్త్రాలు

## గోల్కొండలో

# బోనాలు షురూ


తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించిన పోతురాజుల విన్యాసాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ

గోల్కొండ కోటలో ఆషాడ బోనాలు గురువారం అంగ రంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ల తొలి బోనం సమర్పనతో జగదాంబిక అమ్మవారి బోనాలు కన్నుల పండుగగా మొదలయ్యాయి. ప్రభుత్వం బోనాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పోలీసులు గట్టి నిఘా ఏర్పాట్లు చేశారు. మంత్రులిద్దరూ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభానికి వచ్చిన మంత్రులకు అర్చకులు వేద మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి కొండా సురేఖ ఈరగోల ధరించి అందరినీ ఉత్సాహ పరిచారు. ఆషాఢ బోనాల బుక్‌లెట్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదాంబ ఆలయకమిటీకి రూ.11లక్షల చెక్కును మంత్రులు ఆలయకమిటీకి అందచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తొలి బోనం ఎత్తుకుని పట్టు వస్త్రాలతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొని బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అమ్మవారి ఆశీర్వాదం తెలంగాణ రాష్ట్రంపై ఉందన్నారు. జగదాంబిక అమ్మవారి దయతో ఎల్‌నినో ప్రభావం తగ్గి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆమె ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దని అధికారులకు ఆమె సూచించారు. చివరి భక్తుడి వరకూ అమ్మవారి దర్శనం కలిగేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వందల ఏళ్ల నుంచి జంటనగరాల్లో వైభవోపేతంగా బోనాల సాంప్రదాయం జరుగుతోందన్నారు. గోల్కొండ జగదాంబ అమ్మవారు తరువాయి 8లో

## ఎల్‌నినో ప్రభావం కరువు పరిస్థితులు

నేడు కేబినెట్ సమావేశంలో చర్చ



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ప్రస్తుత కరువు పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, నీటి మట్టాలు, సాగు, తాగు నీటి సమస్యలు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ మొదటి దశ, మెట్రో విస్తరణ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించే అవకాశం ఉంది. ఎల్ నినో వల్ల ఏర్పడిన కరువు పరిస్థితిని, నిరంతరం తగ్గుతున్న భూగర్భ జలమట్టాలను సమీక్షించడంపై ఈసారి మంత్రివర్గ సమావేశం ప్రధానంగా దృష్టి సారించనుంది. గ్రామీణ ప్రాంతాలలో పేదలకు పని కల్పించేందుకు విబిజిరాంజీ పథకం అమలుపై చర్చించే అవకాశం ఉంది. అలాగే ప్రస్తుత కరువు పరిస్థితులను తట్టుకునేందుకు ప్రత్యామ్నాయ పంటలు పండించేలా రైతులను ఎలా ప్రోత్సహించాలనే దానిపై సమావేశంలో వివరంగా చర్చించనుంది. అలాగే రానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న పలు బిల్లులపై కూడా మంత్రివర్గం చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగుల హెల్త్ స్కీమ్, ఇతర సమస్యలు, ఆదాయ వనరుల సమీకరణ, జిహెచ్‌ఎంసి, సిఎంసి, తరువాయి 8లో

# ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- రామాలయ విరాళాలు.. విద్యా వ్యవస్థ సమస్యలు.. రాజ్యాంగ సవరణలపై కాంగ్రెస్ స్పష్టీకరణ
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని నిర్ణయం



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థ క్షీణత, పెరుగుతున్న ధరలు, అవినీతి, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అలాగే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మంత్రులు, ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను, ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో పాటు పలువురు సీనియర్ నాయకులు సమావేశమై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కాంగ్రెస్ ప్రధాన విప్ జైరాం రమేశ్, తరువాయి 8లో

## కేరళ ప్రతిపక్ష ఉపనేత పదవి సిపిఐకి సంపూర్ణ అర్హత

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**న్యూఢిల్లీ/తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనాయకుడి పదవి పొందడానికి భారత కమ్యూనిస్టుపార్టీకి సంపూర్ణ అర్హత ఉందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. ప్రస్తుత కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాలో ఉన్న వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్)లో కీలక భాగస్వామిగా ఉన్న సిపిఐ మరింత సమర్థవంతంగా ప్రతిపక్షపాత్రలో ప్రజాసమస్యలను అసెంబ్లీ ముందుకు తీసుకు రావడానికి ఈ హోదాకు పూర్తి అర్హతలు ఉన్నాయని అన్నారు. ఐతే ఈ పదవి తరువాయి 8లో

# దీక్షను విరమించాలని అడగొద్దు...

సోనం వాంగ్‌చుక్

- 20న 'పార్లమెంట్ మార్చ్'లో వేలాదిగా పాల్గొనాలని పిలుపు
- 19 రోజులకు చేరిన దీక్ష – క్షీణించిన ఆరోగ్యం
- వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా పలు నగరాల్లో ర్యాలీలు
- దీక్షా శిబిరాన్ని సందర్శించిన అరవింద్ కేజ్రీవాల్, సిపిఐ ఎంపి సందోష్‌కుమార్



**న్యూఢిల్లీ :** రాజకీయ నాయకులు, మద్దతుదారులు విజ్ఞప్తి చేసినప్పటికీ తన నిరవధిక నిరాహార దీక్షను విరమించబోనని ఉద్యమకారుడు,హక్కుల కార్యకర్త సోనం వాంగ్‌చుక్ గురువారం స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకుండా దీక్షను విరమించడం తప్పుడు సంకేతాన్ని పంపుతుందని ఆయన అన్నారు. 'ఒకవేళ నేను తింటే ఏ సందేశం వెళుతుంది? .జవాబుదారీ తనం అవసరం లేదనే సందేశం ప్రభుత్వానికి వెళుతుంది. నిరసనకారులు కూర్చుని వెళ్లిపోతారు. తాను నిరాహారదీక్ష విరమిస్తే ఏమి తరువాయి 8లో

హైదరాబాద్‌లో పౌర సమాజం సంఘీభావ ప్రదర్శన






## సైబర్ మోసాలతో ఆర్థికంగా కుదేలవుతున్న కుటుంబాలు

- నియంత్రించకపోతే ఇబ్బందులు తప్పవు : డిజిపి సివి. ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ మోసాలతో ఆర్థికంగా అనేక కుటుంబాలు కుదేలవుతున్నాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు రాష్ట్రానికి అతిపెద్ద సవాలుగా మారాయని, వీటిని ఇప్పుడే సమర్థంగా నియంత్రించకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ తరువాయి 8లో

సురక్షిత, కాలుష్యరహిత రవాణాకు కొత్త అధ్యాయం

## భారత్‌లో తొలి హైడ్రోజన్ రైలు


నేడు హర్యానాలో ప్రారంభించనున్న ప్రధాని



**న్యూఢిల్లీ:** భారతీయ రైల్వేలు పర్యావరణహిత రవాణా దిశగా మరో కీలక ముందడుగు వేస్తున్నాయి. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ప్రయాణికుల రైలును హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ రైలు జింద్–సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో సేవలు అందించనుంది. సాంప్రదాయ విద్యుత్ రైళ్లు ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లపై ఆధారపడితే, ఈ హైడ్రోజన్ రైలు తనకు అవసరమైన విద్యుత్‌ను రైలులోనే ఉత్పత్తి చేసుకుంటుంది. ఇందుకోసం 'ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ (పిఇఎం) ఫ్యూయల్ సెల్' సాంకేతికతను ఉపయోగించారు. రైలులో నిల్వ చేసిన హైడ్రోజన్ వాయువు, గాలిలోని ఆక్సిజన్‌తో రసాయనిక చర్య జరిపి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి, స్వల్ప ఉష్ణం మాత్రమే వెలువడతాయి. కార్బన్ ఉద్గారాలు, పొగ లేదా ఇంధన దహనం ఉండవు. అందువల్ల ఇది అత్యంత పర్యావరణహిత రవాణా వ్యవస్థగా భావిస్తున్నారు. ఈ రైలులో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. హైడ్రోజన్ లీకేజీ, అధిక ఉష్ణోగ్రత, మంటలు, పొగ వంటి ప్రమాదాలను వెంటనే గుర్తించే బహుస్థాయి భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఏవైనా తరువాయి 12లో

## షాంఘైలో నేటి నుండి ప్రపంచ ఎఐ సదస్సు

**బీజింగ్ :** కృత్రిమ మేధ అపూర్వమైన వేగంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో చైనా ప్రధాన నగరం షాంఘైలో ప్రపంచ ఎఐ సదస్సు (డబ్ల్యుఎఐసి) శుక్రవారం నుండి ప్రారంభమవుతోంది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై తరువాయి 12లో





# సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష కేంద్రానికి పట్టదా?

సోనమ్ వాంగ్‌చుక్ భారతదేశం గర్వించదగిన వ్యక్తుల్లో ఒకరు. జమ్మూ కశ్మీర్‌లోని లద్ధాఖ్ ప్రాంతంలో సింధు నది తీరంలోని ఆల్చి అనే మారుమూల గ్రామంలో జన్మించాడు. తొమ్మిదేళ్ళ వరకు బడి ముఖం చూసి ఎరగడు. అప్పటి వరకు అమ్మే గురువై ప్రాథమిక బోధన చేసింది. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తండ్రి తనతో పాటు కుటుంబాన్ని శ్రీనగర్‌కు తీసుకెళ్ళారు. అక్కడ తొమ్మిదవ ఏట మొదటి సారిగా పాఠశాల ముఖం చూశాడు సోనమ్ వాంగ్ చుక్. అప్పటి వరకు అమ్మ, ప్రకృతి ఒడిలలో లోకజ్ఞానం నేర్చుకున్న ఆయనకు తొమ్మిదవ ఏట కొత్త బడిలో, కొత్త భాషలో విద్యా బోధన అంతా అయోమయంగా అనిపించింది. టీచర్‌లు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోవడంతో సోనమ్‌పై చదువురాదనే ముద్ర పడింది. అక్కడి నుంచి ఢిల్లీకి వెళ్ళిపోయి కేంద్రీయ విద్యాలయంలో చేరిన తరువాత జీవితంలో కొంత మార్పు వచ్చింది. తరువాత శ్రీనగర్‌లోని ఆర్ఇసిలో మెకానిక్ ఇంజనీర్‌గా పట్టభద్రుడయ్యారు. ఎర్తెన్ ఆర్కిటెక్చర్ (మట్టితో కట్టడాలు) అంశంలో ఉన్నత విద్యాభ్యాసానికి ఫ్రాన్స్‌కు వెళ్ళాడు. పాఠశాల విద్యలో తనకు కలిగిన చేదు అనుభవం దృష్టిలో పెట్టుకొని తిరిగి వచ్చాక సోనమ్ వాంగ్‌చుక్ ప్రత్యామ్నాయ విద్యా బోధనకు లేహ్‌లో శ్రీకారం చుట్టారు. సాధారణ, తక్కువ వ్యయంతో సంప్రదాయ పద్ధతులలో విద్యార్థులకు ప్రకృతిలోనే బోధించే పద్ధతికి శ్రీకారం చుట్టారు. దీనికి స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లద్ధాఖ్(సెక్మోల్) అనే పేరు పెట్టారు. ఈ ప్రత్యామ్నాయ విద్యా విధానంతో వచ్చిన సత్ఫలితాలు అంతర్జాతీయ గుర్తింపు, ప్రశంసలు పొందాయి. అత్యంత ప్రజాదరణ పొందిన 'త్రీ ఇడియెట్స్' హిందీ సినిమాలో అందరినీ ఆకట్టుకున్న ప్రముఖ నటుడు అమిర్ ఖాన్ పాత్రకు ఆయనే స్ఫూర్తి.

అటువంటి సోనమ్ వాంగ్‌చుక్ వైద్య విద్య జాతీయ ప్రవేశ పరీక్షా పత్రం లీక్ అవడం, పలువురు ఆత్మహత్య చేసుకోవడంపై కలత చెంది చేపట్టిన నిరవధిక దీక్ష గురువారానికి 19వ రోజుకు చేరుకుంది. అనేకమార్లు పేపర్‌లు లీకైనప్పటికీ, ఇటీవల సిబిఎస్ఇ పరీక్షా ఫలితాలలో గందరగోళం, ఒకరి మార్క్ షీటుకు బదులు మరొకరి షీటు ఆధారంగా మార్కులు వేయడం, వెంటనే నీట్ పరీక్షా పత్రం లీక్ అవడం వంటివి దేశావ్యాప్తంగా భావి తరాలను తీవ్ర నిస్పృహలోకి నెట్టేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మిశ్రా నిరుద్యోగ యువతను కాక్రోచ్ (బొద్దింక)లతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర చర్చ జరిగి, అభిజీత్ దిప్కే అనే యువకుడు వ్యంగ్యంగా కాక్రోచ్ పార్టీ ఆఫ్ ఇండియా (సిజెపి) అనే పేరుతో సోషల్ మీడియాలో అకౌంట్ తెరిచారు. అంతే, కేంద్ర ప్రభుత్వ విధానాలపై లోలోన రగులుతున్న యువత ఆగ్రహం కట్టలు తెగించుకుంది. రెండు రోజుల్లోనే సిజెపి సోషల్ మీడియాకు 2 కోట్ల మందికి పైగా ఫాలోయర్లు చేరారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద సిజెపి మొదటి ప్రత్యర్థి ఉద్యమంగా జూన్ 6న చేసిన ధర్నాకు అనేక ఆంక్షలు దాటుకుని భారీగా యువత తరలి వచ్చారు. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదు. బాధ్యత స్వీకరించేందుకు ధర్మేంద్ర ప్రధాన్ ముందుకు రాకుండా, నిస్సిగుగా పదవిలో కొనసాగుతున్నారు. పైగా వారు వైరస్ లాంటి వాళ్ళని, వారి వెనుక విదేశీ శక్తులు ఉన్నాయని, తుక్డే తుక్డే గ్యాంగ్ అని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిని నబీన్ ఉద్యమకారులపై తీవ్ర ఆరోపణలే చేశారు.

నిజానికి సిజెపి ఉద్యమంలో మెజారిటీ నిరసనకారులకు ఉద్యమాలు కొత్తే. ముఖ్యంగా పెద్ద ఎత్తున పాల్గొంటున్న జెన్ జీ తరానికి ఇలాంటి ఉద్యమం జీవితంలోనే మొదటిసారి. ఇది మింగుడు పడని కేంద్ర ప్రభుత్వం సిజెపి ఉద్యమాన్ని అణిచివేసేందుకు అనేక కుటిల ప్రయత్నాలు చేసినా ఉద్యమం ఆగలేదు. వారు అర్బన్ నక్సలైట్‌లు అని, వారు ఉగ్రవాదులు అని, జాతి వ్యతిరేకులు అని, కమ్యూనిస్టులు అని సంఘ్ పరివారం, వారి వందిమాగధ సోషల్ మీడియా సేనలు ఆడిపోసుకున్నాయి. గతంలో ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాది పాటు నిరసన తెలిపిన రైతులను ఎన్ని మాటలు అన్నారో అన్నిటినీ సిజెపి ఉద్యమాకారులను అన్నారు. అనేక నగరాలలో సైతం సిజెపి నిరసనలు విజయవంతమెయ్యాయి. సిజెపి ఉద్యమానికి కొనసాగింపుగా సోనమ్ వాంగ్ చుక్ జూన్ 25 నుంచి తలపెట్టిన నిరవధిక దిశ మరో మలుపు. తాము ఏ పార్టీకి అనుబంధమో, సభ్యులమో కాదని సిజెపి నిర్వాహకులు చేసిన ప్రకటనలను గౌరవిస్తూ విపక్ష పార్టీలు సంఘీభావాన్ని తెలియజేస్తూ వస్తున్నాయి. ఎఐఎస్ఎఫ్, ఐసా, ఎస్ఎఫ్ఐ తదితర వామపక్ష విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద రాత్రింబవళ్లు ఉంటున్న ఉద్యమకారులకు అండగా ఉంటున్నారే తప్ప ప్రత్యక్ష భాగస్వాములుగా లేరు. ఉద్యమంలో పాల్గొనే వారి సౌలభ్యం కోసం ఎఐఎస్ఎఫ్ ఏర్పాటు చేసిన మినీ 'లైబ్రరీ' స్టాల్‌ను తొలగించేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయినప్పటికీ, ఎదుర్కొని దానిని కొనసాగిస్తున్నారు. అయితే, వాంగ్‌చుక్ దీక్ష చేపట్టి 20 రోజులు కావొస్తోంది. ఆయన సుమారు 10 కిలోల బరువు తగ్గి, బలహీనమయ్యారు. ఇవేమి పట్టించుకోకుండా సోనమ్ వాంగ్ చుక్ తదేక దీక్షతో దీక్షను కొనసాగిస్తున్నారు. క్రమక్రమంగా ఆయనను కలుస్తున్న సామాన్యులు, విపక్ష నాయకుల సంఖ్య పెరుగుతోంది. అయినా, కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ఒక ప్రముఖ వ్యక్తి దేశ రాజధాని నడిబొడ్డున దాదాపు మూడు వారాలుగా నిరవధిక దీక్ష చేస్తుంటే, స్పందించని ప్రభుత్వాన్ని ఏమనాలి?

ప్రభుత్వ నిరంకుశ తీరుకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసం, మానవత్వం ఉన్న ప్రతి పౌరుడిలో కదలిక తీసుకువస్తోంది. వాంగ్‌చుక్‌కు అంతకంతకూ మద్దతు పుంజుకుంటోంది. ప్రధాని మోదీని తొలినాళ్ళలో రాజకీయాలలో ప్రోత్సహించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి శంకర్ సిన్హ్ వాఘేలా సైతం జంతర్ మంతర్‌కు వచ్చి సంఘీభావాన్ని ప్రకటించారు. వామపక్ష నేతలు డి.రాజా, ఎం.ఎ.బేబీ, దీపాంకర్ భట్టాచార్య, టిఎంసి, ఆర్‌జెడి, ఎస్‌పి ముఖ్యనేతలు కూడా సోనమ్‌కు మద్దతు పలికారు. తాజాగా ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ గురువారం జంతర్ మంతర్‌కు వచ్చి సంఘీభావం ప్రకటించి, సోనమ్ వాంగ్‌చుక్‌ను కేంద్ర విద్యా మంత్రిని చేయాలనే డిమాండ్ తెరమీదకు తీసుకువచ్చారు. వినూత్న విద్యా బోధన ద్వారా మారుమూల ప్రాంతంలో అద్భుతాలు సృష్టించిన సోనమ్‌వాంగ్ చుక్ అందుకు అర్హుడే. ఆయన పట్టుదల, చిత్తశుద్ధి చూసిన సామాన్యుల నుంచి మాన్యుల వరకు సిజెపి పిలుపునిచ్చిన జులై 26న 'చలో పార్లమెంట్'కు మద్దతు పలుకుతుండటం ప్రజాస్వామ్యంపై ప్రజల్లో సడలని విశ్వాసాన్ని సూచిస్తోంది. ●



## దీక్షను విరమించేది లేదు

నేను నిరవధిక నిరాహార దీక్షను విరమించాలని వేలాది మంది సందేశాలు పంపుతున్నారు. పలువురు సీనియర్ రాజకీయ నాయకులు ప్రేమతో, ఆప్యాయతతో నన్ను కలిసి దీక్ష విరమించాలని కోరారు. కొందరు నన్ను బలవంతంగా ఆహారం తీసుకునేలా చేయాలని కోర్టును కూడా ఆశ్రయించారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకుండానే నేను దీక్షను విరమిస్తే, అది ప్రభుత్వానికి జవాబుదారీతనం అవసరం లేదనే తప్పుడు సంకేతాన్ని పంపినట్టవుతుంది. అందుకే నా దీక్షను విరమించే ఉద్దేశం లేదు. నా ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఎలాంటి తక్షణ ప్రమాద సూచనలు కనిపించలేదు.

– సోనమ్ వాంగ్‌చుక్

# మాయమవుతున్న మనిషి.. రక్తసిక్తమవుతున్న బంధాలు...

'మనిషి సామాజిక జీవి' అని మనం చిన్నప్పటి నుంచి చదువుకుంటూ వస్తున్నాం. ప్రేమ, ఆప్యాయత, అనురాగం, క్షమ, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలే మనిషిని ఇతర జీవుల కంటే గొప్పవాడిగా నిలబెట్టాయి. కానీ నేడు అదే మనిషి తన చేతులతో తన బంధాలను తెంచుకుంటున్నాడు. కోపం కళ్లను కప్పేస్తోంది. అనుమానం హృదయాన్ని విషపూరితం చేస్తోంది. క్షణికావేశం ప్రాణాలను బలి తీసుకుంటోంది. ఉదయం పత్రిక తెరిచినా, టివి ఆన్ చేసినా, సోషల్ మీడియా చూసినా కనిపించేది హత్యలు, ఆత్మహత్యలు, కుటుంబ కలహాలు, లైంగిక నేరాలు, ప్రతీకార దాడులు, రక్తపు మరకలే. ఇవి కేవలం నేరాల వార్తలు మాత్రమే కాదు, సమాజంలో క్షీణిస్తున్న మానవ సంబంధాలకు అద్దంపట్టే విషాద చిత్రాలు. ఒకప్పుడు కుటుంబం అంటే భరోసా. పెద్దల మాటకు విలువ ఉండేది. చిన్న చిన్న గొడవలు ఇంటి గడప దాటేవి కాదు. కోపం వచ్చినా కాసేపటికి చల్లారిపోయేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసిన భార్యాభర్తలే ఒకరినొకరు హత్య చేసుకుంటున్నారు. కన్నబిడ్డలనే తల్లిదండ్రులు చంపుతున్నారు. తల్లిదండ్రులపై పిల్లలు దాడులు చేస్తున్నారు. అన్నదమ్ములు, బంధువులు ఆస్తి కోసం రక్తపాతం సృష్టిస్తున్నారు. ప్రేమను పంచాల్సిన చేతులే ప్రాణాలను తీస్తున్నాయి. కారణాలు వేర్వేరైనా చివరకు బలి అవుతున్నది మాత్రం మనిషి ప్రాణమే. ఈ పరిస్థితికి ఒక్క కారణం లేదు. క్షణికావేశం, సహనం లేకపోవడం, మద్యం, మాదకద్రవ్యాల వినియోగం, మానసిక ఒత్తిళ్లు, నిరుద్యోగం, పెరుగుతున్న ఆర్థిక భారాలు, కుటుంబ సభ్యుల మధ్య తగ్గిపోతున్న సంభాషణలు, మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ ప్రపంచంలో పెరుగుతున్న ఒంటరితనం... ఇవన్నీ కలిసి మనిషిలోని మానవత్వాన్ని నెమ్మదిగా హరిస్తున్నాయి. సమస్యలను చర్చించి పరిష్కరించుకునే సంస్కృతి బలహీనపడుతోంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ధోరణి పెరుగుతోంది. సమస్యలు, ఒక్క క్షణం ఆవేశంతో శాశ్వత విషాదాలు గా మారిపోతున్నాయి.

హత్య జరిగినప్పుడు ఒక ప్రాణం మాత్రమే పోతుందని అనుకోవడం పొరపాటు. ఆ ఘటనతో రెండు కుటుంబాలు శాశ్వతంగా ఛిన్నాభిన్నమవుతాయి. పిల్లలు అనాథలవుతారు. తల్లిదండ్రులు జీవితాంతం కన్నీళ్లతో మిగిలిపోతారు. ఇటీవలి కాలంలో గ్రేటర్ హైదరాబాద్‌లోనే వరుసగా వెలుగులోకి వస్తున్న హత్యలు సమాజాన్ని ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. గత ఏడాది నగరంలో 258 హత్య కేసులు నమోదయ్యాయి. ఇది కేవలం ఒక సంఖ్య కాదు, నగర జీవితంలో పెరుగుతున్న అసహనం, విలువల పతనానికి సంకేతం. షాబాద్‌లో జరిగిన వరుస హత్యల కేసు లో ప్రధాన నిందితుడు తనపై పోక్సో కేసు నమోదైందనే పగతో బాధితురాలి కుటుంబ సభ్యులను హత్య చేసి, అనంతరం తన భార్యా పిల్లలను కూడా చంపడం మానవత్వాన్ని కుదిపేసిన ఘటన. మరోవైపు పటాన్‌చెరులో రెండో వివాహం చేసుకున్న వ్యక్తిని అతని భార్య మరో వ్యక్తి తో కలిసి హత్య చేయడం, వివాహేతర సంబంధాలు ఎంతటి దారుణాలకు దారి తీస్తున్నా యో చూపించింది. ఇవి ఒక్కో సంఘటనలు కాదు, సమాజంలో పెరుగుతున్న నైతిక సంక్షోభానికి ప్రతిబింబాలు. మద్యం, మాదకద్రవ్యాలు, అక్రమ సంబంధాలు, డబ్బు మీద వ్యామోహం, విలాసవంతమైన జీవితం కోసం అడ్డదారులు వెతికే మనస్తత్వం, నియంత్రణలేని కోరికలు మనిషిని క్రమంగా పాశవికత్వం వైపు నెడుతున్నాయి. సోషల్ మీడియాలో నేర సంబంధిత కంటెంట్, హింసాత్మక వీడియోలు, అసభ్య దృశ్యాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇండియన్ సైకాలజీ విడుదల చేసిన అధ్యయనం ప్రకారం, ఒటిటికి అధికంగా అలవాటు పడిన వారిలో, ముఖ్యంగా టీనేజర్లలో ఒంటరితనం, హింసాత్మక ధోరణులు, ప్రవర్తనా మార్పులు పెరుగుతున్నాయని పేర్కొంది. అందుకే సాహిత్యం, సంగీతం, కళలు, క్రీడలు వంటి సృజనాత్మక అభిరుచుల వైపు యువతను మళ్లించడం కాలానుగుణ అవసరంగా మారింది.

పిల్లలకు కేవలం మార్కులు, ఉద్యోగాలు, పోటీ పరీక్షలే కాదు, నైతిక విలువలు, సహనం, పరస్పర గౌరవం, బాధ్యత, చట్టంపై విశ్వాసం, కుటుంబ బంధాల ప్రాధాన్యత కూడా బోధించాల్సిన అవసరం ఉంది. సమాజంలో పెరుగుతున్న హింసను కేవలం పోలీసు చర్యలతో మాత్రమే పూర్తిగా అరికట్టలేం. నేరం జరగకుండా నిరోధించేది కుటుంబం, విద్య, సమాజం, విలువలు. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడాలి. ఉపాధ్యాయులు పుస్తకాలతో పాటు జీవితాన్ని కూడా బోధించాలి. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మానవత్వం బతికితేనే కుటుంబం నిలుస్తుంది. కుటుంబం నిలిస్తేనే సమాజం నిలుస్తుంది. లేకపోతే 'మాయమైపోతున్నాడమ్మా... మనిషన్నవాడు' అనే ఆవేదన కేవలం ఒక పాటలోని పాదంగా కాకుండా, రేపటి భారత సమాజాన్ని వర్ణించే చేదు నిజంగా మిగిలిపోతుంది.

**మన్నారం నాగరాజు**

## నేపాల్ కొత్త ప్రభుత్వంపై
# జెన్ జీకి పెరుగుతున్న అసంతృప్తి

**అసద్ మీర్జా**

ఒక ప్రభుత్వాన్ని కూలదోసిన పది నెలల తర్వాత నేపాల్‌లోని జెన్ జీ తరం తాము నిర్మించిన ప్రభుత్వంతోనే తలపడుతోంది. ఒక క్రూరమైన తొలగింపు చర్య, ఒక డ్రైవర్ ఆత్మాహుతి, అసమ్మతిపై పెరుగుతున్న అణచివేత వంటివి బాలెన్ షా 'కొత్త రాజకీయాలు' పాత పోకడలకు భిన్నంగా ఉన్నాయా లేదా అని పరీక్షిస్తున్నాయి.

నేపాల్ ఒక ఇబ్బందికరమైన పునరావృతాన్ని ఎదుర్కొంటోంది. యువత తిరుగుబాటు సింఘా దర్బార్‌ను తగలబెట్టి, కె.పి.శర్మ ఓలీని పదవి నుంచి తొలగించిన ఏడాది లోపే, ఆ అలజడిని సృష్టించిన తరం ఈసారి తాము ఏ నాయకుడినైతే అధికారంలోకి తీసుకురావడానికి సహాయపడ్డారో ఆ నాయకుడికే వ్యతిరేకంగా మళ్లీ వీధుల్లోకి వచ్చింది. 2026 మార్చిలో జెన్ జీ ఆగ్రహాన్ని ఉపయోగించుకుని భారీ విజయం సాధించిన, ర్యాపర్–ఇంజనీర్ నుండి మేయర్‌గా మారిన ప్రధానమంత్రి బాలేంద్ర షా...తన ప్రధాని పదవీకాలంలో ఇప్పుడు మొట్టమొదటి నిరంతర ప్రజా తిరుగుబాటును ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం అవినీతి లేదా సోషల్ మీడియా నిషేధం కాదు, బుల్డోజర్‌లు. ఏప్రిల్ నెలాఖరు నుంచి ఖఠ్మండు లోయలోని భాగమతి, ఇతర నదీ తీరాల వెంబడి ఉన్న ఆక్రమణదారులు, అనధికార నివాసాలపై ప్రభుత్వం చేపట్టిన తొలగింపు చర్యలు 2,600లకు పైగా కుటుంబాల ఇళ్లను నేలమట్టం చేసింది. అంచనా ప్రకారం 15,000 మంది ప్రజలు నిర్వాసితులు అయ్యారు.

ఆక్రమిత ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే చర్యగా అభివర్ణించబడిన ఈ ఆపరేషన్‌కు మొదట్లో విస్తృత మద్దతు లభించింది. శాటిలైట్ మ్యాపింగ్, బయోమెట్రిక్ ధృవీకరణను ఉపయోగించి, అవకాశవాద ఆక్రమణదారుల నుండి 'వాస్తవ' భూమిలేని కుటుంబాలను శాస్త్రీయంగా వేరు చేస్తామని ఆర్ఎస్‌పి ఎన్నికల ప్రణాళిక కూడా వాగ్దానం చేసింది. అయితే ఆగ్రహాన్ని రేకెత్తించింది నదీ తీరాలను ఖాళీ చేసే సూత్రం కాదు, దాని తర్వాతి పరిణామాలు. తొలుత తొలగింపు, ఆ తర్వాతే పునరావాసం. సుమారు 325 కుటుంబాలను తాత్కాలిక నిర్బంధ కేంద్రాలకు తరలించారు. వాటిలో చాలా కేంద్రాలు ఆ తర్వాత వరదలకు గురయ్యాయి. ముఖ్యంగా కీర్తిపూర్‌లో ఇది కొట్టొచ్చినట్లు కనిపించింది. ఈ నెల ఆరంభంలో ఈ ఆశ్రయాలను కూడా ఖాళీ చేయాలని ప్రభుత్వం నిర్వాసితులను ఆదేశించింది. అయితే తమకు వెళ్లడానికి వేరే చోటు లేదని చాలామంది చెప్పారు. మున్సిపల్ పోలీసులతో ఘర్షణ తర్వాత గణేష్ నేపాలీ అనే డ్రైవర్ తనకు తాను నిప్పంటించుకోవడంతో ఆగ్రహం తారాస్థాయికి చేరింది. ఈ చర్యను నిరసనకారులు పేదల పట్ల ప్రభుత్వ ఉదాసీనతకు ప్రతీకగా మార్చారు.

అప్పటి నుండి జాయింట్ నేషనల్ స్క్వాటర్స్ ఫ్రంట్ 'పేదలపై అఘాయిత్యాలను అంతం చేయండి' అనే నినాదాలతో కూడిన బ్యానర్లతో ప్రదర్శనలు నిర్వహించింది. మరోవైపు, ఒకప్పుడు షా ఎదుగుదలను స్వాగతించిన యువ కార్యకర్తలే ఆయన పాలనను భూమిలేని వారిని రాజ్యాంగ బాధ్యతగా కాకుండా ఒక ఇబ్బందిగా పరిగణిస్తున్నారని మండిపడుతున్నారు. 2025 సెప్టెంబర్ లో జెన్ జీ పోరాడి సాధించిన జవాబుదారీతనం, సమ్మిళితత్వానికి ఇది ఒక ద్రోహమని వారు అంటున్నారు.

బాలెన్ షా పరిపాలన ఈ తొలగింపు ప్రక్రియను చాలాకాలంగా జరగాల్సిన భూ నిర్వహణగా సమర్థించుకుంది. నిజమైన భూమిలేని కుటుంబాలకు, లాభం కోసం ప్రభుత్వ లేదా ప్రైవేట్ భూములను ఆక్రమించుకున్న వారికి మధ్య వ్యత్యాసం పాటిస్తున్నామని నొక్కి చెప్పింది.

కానీ, ఈ విధానం కంటే కూడా దాని పర్యవసానాలను ఎదుర్కొన్న తీరు తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంది. వరదల తర్వాత పరిస్థితులను రికార్డు చేయడానికి కీర్తిపూర్ నిర్బంధ కేంద్రాన్ని సందర్శించిన మజీద్ అన్సారీ, సరిస్మా థాపా, నెల్సన్ ఘటానీలతో సహా పలువురు జెన్ జీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయవాది అయిన అన్సారీపై గేటు వద్ద దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. పాత్రికేయులతో మాట్లాడటానికి ప్రయత్నించినందుకు కార్యకర్త దుర్గా ప్రసాయ్‌ని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద పోలీసులు 'సున్నితమైన భద్రతా జోన్' నిబంధనలను ఉటంకిస్తూ వేరుగా అదుపులోకి తీసుకున్నారు. 'పోలీసు విధులకు ఆటంకం కలిగించేవారు, అశాంతిని ప్రేరేపించేవారు లేదా ప్రజా భద్రతకు ముప్పు కలిగించేవారిపై' మాత్రమే చర్య తీసుకుంటామని, చట్టబద్ధమైన నిరసనను గౌరవిస్తామని నేపాల్ పోలీసు ప్రతినిధి అబి నారాయణ్ కఫల్ స్పష్టం చేశారు. హక్కుల సంఘాలు దీనిని భిన్నంగా చూస్తున్నాయి. నేషనల్ అలయన్స్ ఆఫ్ విమెన్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్ దీనిని 'అమానుషమైన ప్రవర్తన', 'చట్టవిరుద్ధమైన నిర్బంధం' అని ఖండిస్తుండగా, శాంతియుత నిరసనను పోలీసులు భద్రతా ముప్పుగా పరిగణిస్తున్న విస్తృత ధోరణిని ఖఠ్మండు పోస్ట్ నమోదు చేసింది.




(పాత చిత్రాలు)

జాతీయ మానవ హక్కుల కమిషన్ రెండుసార్లు జోక్యం చేసుకుంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్బంధ కేంద్రాల నుంచి ఆక్రమణదారులను ఖాళీ చేయించవద్దని అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో నేపాల్‌లోని 2018 నాటి మురికివాడల గృహ చట్టాన్ని, ఆర్టికల్ 37 ప్రకారం తగిన గృహవసతి పొందే రాజ్యాంగ హక్కును, నేపాల్ ఆమోదించిన అంతర్జాతీయ ఒప్పందాలను ఉటంకించింది. సుప్రీంకోర్టు కూడా ఈ ఖాళీ చేయించే చర్యకు వ్యతిరేకంగా షోకాజ్ ఆదేశాలు జారీ చేసింది. ఒక మంత్రి ఆక్రమణదారులకు అరుదైన వ్యక్తిగత క్షమాపణ చెప్పి, ఈ పరిస్థితిని 'చూడటానికి కష్టంగా ఉంది' అని పేర్కొన్నారు. అయితే, తమ విధానం మొత్తం చట్టబద్ధమైనదేనని ప్రభుత్వం పదేపదే నొక్కిచెబుతున్న నేపథ్యంలో ఈ అంగీకారం ఇబ్బందికరంగా ఉంది.

మార్చి ఎన్నికలలో ఓడిపోయిన పార్టీలకు, తమను తిరస్కరించిన ఓటర్లకే రక్షకులుగా తమను తాము పునఃసృష్టించుకోవడానికి ఈ సంక్షోభం ఒక అవకాశం కల్పించింది. ప్రజా తీర్పు అనేది 'ఏకపక్ష పాలనకు అనుమతి పత్రం' కాదని వాదిస్తూ, 'తొలగింపునకు ముందు పునరావాసం' అనే విధానాన్ని అవలంబించాలని, పౌరులపై బలప్రయోగం ఆపాలని సిపిఎన్–యుఎంఎల్ కు చెందిన నీరజ్ ఆచార్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనతా సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మహతో ఇంకా ముందుకు వెళ్ళి, ప్రభుత్వ మొదటి వంద రోజులు 'పాత నిరంకుశత్వపు వాసనను' మోస్తున్నదని అభివర్ణించారు. బుల్డోజర్‌లతో కూల్చివేసిన నివాస ప్రాంతాలు, విద్య, ఆరోగ్య సంరక్షణపై పన్నులు, గణేష్ నేపాలీ ఆత్మాహుతి వంటి అంశాలు సంస్థాగత నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ఇక్కడ ప్రధాన వైఫల్యం ఉద్దేశంలో కాదు, క్రమబద్ధీకరణలో ఉంది. నేపాల్ రాజ్యాంగం, దాని 2018 ఆక్రమణదారుల హక్కుల చట్టం, పలు సుప్రీం కోర్టు తీర్పులు అన్నీ, జాతీయ మానవ హక్కుల మండలి పదేపదే చెబుతున్న ఒకే సూత్రాన్ని నిర్ధారిస్తున్నాయి. పునరావాసానికి ముందే ప్రత్యామ్నాయ గృహవసతి, జీవనోపాధి మద్దతు అందించాలి, అంతేగానీ పునరావాసం తర్వాత ఒక అదనపు ఆలోచనగా కాదు. విశ్వసనీయమైన భవిష్యత్ కార్యాచరణకు, ధృవీకరించబడిన పునరావాస స్థలాలు సిద్ధమయ్యే వరకు తదుపరి తొలగింపులను నిలిపివేయాలి. అలాగే, ఇష్టానుసారంగా బుల్డోజర్‌లతో దాడులు చేయడం కాకుండా, భూ సంబంధిత సమస్యల పరిష్కార కమిషన్ ద్వారా నిజమైన భూమిలేని కుటుంబాలను శాస్త్రీయ పద్ధతిలో గుర్తించే వాగ్దానాన్ని పూర్తి చేయాలి.

అన్నింటికంటే ముఖ్యంగా షా ప్రభుత్వం ఒక విషయాన్ని గుర్తించాలి. అదేమిటంటే, జెన్ జీ యొక్క అసలు డిమాండ్ కేవలం సింఘా దర్బార్‌లో ముఖాలను మార్చడం మాత్రమే కాదు పౌరులను, ముఖ్యంగా అత్యంత పేదవారిని, న్యాయబద్ధమైన పద్ధతిలో చూసే సంస్థలు కావాలనేది వారి డిమాండ్. ఈ పరీక్షలో విఫలమైతే, తాము ఒకప్పుడు వ్యతిరేకించిన అలవాట్లను ఆ ఉద్యమ నాయకులే ఎంత వేగంగా అలవర్చుకుంటారో తెలిపే ఒక అధ్యయనంగా అత్యంత పిన్న వయస్కురాలైన ప్రభుత్వం నేపాల్ మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# అర్హులందరికీ ఓటు రాజ్యాంగ లక్ష్యం

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి అర్హుడైన పౌరుడు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావడానికి చట్టం కల్పించిన అవకాశం ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలాధారం. ఈ ఎన్నికల వ్యవస్థకు భారత రాజ్యాంగం పునాది వేయగా, ఓటర్ల నమోదు, అర్హతలు, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలు ప్రధానంగా ప్రజాప్రాతినిధ్య చట్టాలు, సంబంధిత ఎన్నికల నిబంధనల ద్వారా అమలులోకి వస్తాయి. అందువల్ల ఓటర్ల జాబితాల ఖచ్చితత్వం, పారదర్శకత, న్యాయబద్ధత ప్రజాస్వామ్య విశ్వసనీయతకు అత్యంత కీలకం.

**రాజ్యాంగం యొక్క పునాది**

ఆర్టికల్ 326 వయోజన ఓటు హక్కు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగపరమైన చట్రాన్ని కల్పిస్తే, ఆర్టికల్ 324 ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల తయారీ, పర్యవేక్షణ వంటి బాధ్యతలను భారత ఎన్నికల సంఘానికి అప్పగిస్తుంది. ఓటర్ల నమోదు, అర్హతలు, జాబితాల సవరణ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలు ప్రధానంగా ప్రజాప్రాతినిధ్య చట్టం–1950, ప్రజాప్రాతినిధ్య చట్టం–1951, సంబంధిత ఎన్నికల నిబంధనల ప్రకారం అమలులో ఉంటాయి. డిజిటల్ సాంకేతికత, డేటా ఆధారిత పరిపాలన, కృత్రిమ మేధస్సు వంటి సాధనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను మరింత సమర్థవంతంగా రూపొందించడమే కాకుండా, పారదర్శకత, సమానత్వం, సహజ న్యాయ సూత్రాలను ఎలా పరిరక్షించాలన్నది సమకాలీన ప్రజాస్వామ్య వ్యవస్థల ముందున్న ప్రధాన సవాలు

**ఐక్యరాజ్యసమితి పరిశీలనలు..**

2026లో ప్రత్యేక విధానాల వ్యవస్థ పరిధిలోని స్వతంత్ర నిపుణులు భారత ప్రభుత్వానికి ఒక అధికారిక కమ్యూనికేషన్ పంపుతూ ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష ప్రక్రియలో పారదర్శకత, సహజ న్యాయ సూత్రాల అమలు, ప్రభావితులకు వినతులు సమర్పించే అవకాశాలపై కొన్ని ప్రశ్నలను ప్రస్తావించారు. ఈ కమ్యూనికేషన్ న్యాయస్థాన తీర్పు కాదు; ఇది బైండింగ్ నిర్ణయం కూడా కాదు. దీనిని స్వతంత్ర నిపుణులు తమ పరిశీలనలు, ఆందోళనలను తెలియజేసే ప్రక్రియగా పరిగణిస్తారు. మరోవైపు భారత ఎన్నికల సంఘం తన చర్యలు ప్రజాప్రాతినిధ్య చట్టం–1950, సంబంధిత ఎన్నికల చట్టాల ప్రకారం పూర్తిగా చట్టబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించబడుతున్నాయని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం ప్రకారం, మరణించిన వ్యక్తులు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారినవారు, ద్వంద్వ నమోదులు వంటి లోపాలను సరిదిద్దడం ద్వారా ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశ్యం.




ఈ అంశాలకు సంబంధించిన కొన్ని ప్రశ్న లు న్యాయస్థానాల పరిశీలనకు కూడా వచ్చిన నేపథ్యంలో, తుది చట్టపరమైన స్థితి సంబంధిత న్యాయస్థానాల ఆదేశాలు, తీర్పులు మరియు అమల్లో ఉన్న ఎన్నికల చట్టాల ఆధారంగానే నిర్ణయించబడుతుంది.

**సహాయక సాధనం.. ప్రత్యామ్నాయం కాదు**

డిజిటల్ యుగంలో కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ వంటి సాధనాలు పరిపాలనా సమర్థతను గణనీయంగా పెంచగలవు. అయితే అంతర్జాతీయ ప్రమాణాలు స్పష్టంగా సూచిస్తున్నది ఏమిటంటే.. సాంకేతికత మానవ హక్కులకు లేదా రాజ్యాంగ విలువలకు ప్రత్యామ్నాయం కాదు. కృత్రిమ మేధస్సు నైతికతపై యునెస్కో 2021 సిఫారసులు మానవ కేంద్రీకృత విధానం, పారదర్శకత, జవాబుదారీతనం, వివక్ష రహిత, మానవ పర్యవేక్షణ వంటి సూత్రాలను నొక్కి చెబుతున్నాయి. అలాగే డిజిటల్ యుగంలో గోప్యత హక్కుపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ఉన్నత కమిషనర్ కార్యాలయం 2021 నివేదిక ఆటోమేటెడ్ నిర్ణయాల్లో వివరణాత్మకత, న్యాయబద్ధత, సమర్థవంతమైన పరిహార వ్యవస్థ అవసరాన్ని ప్రాధాన్యంగా ప్రస్తావించింది. భారత్‌లో ఎన్నికల సంఘం ప్రకారం ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష ప్రక్రియలో నోటీసులు, అభ్యంతరాలు, అప్పీల్ వంటి చట్టబద్ధ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో డాక్యుమెంటేషన్, సమాచార ప్రాప్తి లేదా అమలులో ఎదురయ్యే సవాళ్లను మరింత సమర్థవంతంగా పరిష్కరించడం ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

**రాజ్యాంగమే తుది ప్రమాణం**

ప్రజాస్వామ్యంలో ఏ సాంకేతిక సాధనమైనా రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వం, న్యాయబద్ధత, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలకు లోబడి ఉండాలి. కృత్రిమ మేధస్సు సమాచార విశ్లేషణ, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడంలో ఉపయోగకరమైన సాధనంగా ఉండవచ్చు. అయితే పౌరుల హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాలు చట్టబద్ధమైన ప్రక్రియలు, మానవ పర్యవేక్షణ, సహజ న్యాయ సూత్రాలు, రాజ్యాంగబద్ధ సంస్థల జవాబుదారీతనం ఆధారంగానే ఉండాలి. ఓటర్ల జాబితాల సమగ్రతను పరిరక్షించడం మాత్రమే కాదు, ప్రతి అర్హుడైన పౌరుడు చట్టబద్ధంగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావడానికి అనుకూల వాతావరణాన్ని నిర్ధారించడం కూడా ఎన్నికల వ్యవస్థ లక్ష్యమే. ఈ బాధ్యతను నిర్వర్తించడం ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, పౌర సమాజం, మీడియా, పౌరులందరి ఉమ్మడి కర్తవ్యం. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా ప్రజాస్వామ్యానికి అసలైన బలం ప్రజల విశ్వాసమే. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేది పారదర్శకత, న్యాయబద్ధత, జవాబుదారీతనం, రాజ్యాంగబద్ధత.

**ఫిరోజ్ ఖాన్,** 9640466464

# విద్యారంగ సమస్యలు పట్టని పాలకులు

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి : ఎఐఎస్‌ఎఫ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటికైనా వెంటనే రాజీనామా చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో దినేష్ సిరంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. దినేష్ సిరంగరాజ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ దిశగా తీసుకెళ్తోందని విమర్శించారు. విబిఎస్‌ఎ బిల్లు2025, యూజిసి కొత్త మార్గదర్శకాలు రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఉన్నత విద్యను పేదలకు దూరం చేసే ప్రయత్నమని ఆరోపించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, ఆయన రాజీనామా చేసే వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. దేశంలో విద్యా వ్యవస్థలో లోపాలు పెరుగుతున్నాయని, విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. సిబిఎస్‌ఈ పరీక్షల నిర్వహణలో లో పాలు, టెండర్ల కేటాయింపులో అవకతవకలు చో టుచేసుకున్నాయని ఆరోపించారు. కేంద్ర విద్యా విధానాల వల్లే ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ. స్టాలిన్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో విద్యారం గ సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని, 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల క్లస్టర్లుగా మా ర్చే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని, ఖాళీగా ఉన్న ఎంఇఒ, డిఇ ఒ, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.10 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల చదువులకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయడం, జాతీయ లవిద్యా విధానం–2020ను రద్దు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీ నుంచి తీర్మా నం పంపడం, విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం, మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామకృష్ణ, గ్యార నరేష్, బానోత్ రాఘురాం, రహమాన్, చిట్యాల రాజు, బాలసాని లెనిన్, రాష్ట్ర సమితి సభ్యులు ఎం. చైతన్య కుమార్, మచ్చ రమేష్, ముదిగొండ మురళీకృష్ణ, ఎండీ అన్వర్, అనిల్, బాషబోయిన సంతోష్, ల్యాదల్ల శరత్, శాంతి కుమార్, వరక అజిత్, జోసెఫ్, ఉదయ్, సాగర్, ప్రేమ కుమార్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం

● ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందిస్తాం ● ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మణుగూరు/అశ్వాపురం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మ సాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనులు, అవసరమైన నిధులు తదితర అంశాలను మంత్రులకు వివరించారు.

### గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం : భట్టి


ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు రూ.1,640 కోట్లతో రెండు లక్షల ఎకరాలకు, ఇందిరా సాగర్ ప్రాజెక్టు రూ.1,680 కోట్లతో మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించబడినట్లు తెలిపారు.మొత్తం సుమారు రూ. 3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించబడిందన్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థి తి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునః రూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ. 24 వేల కోట్లకు పెరిగింద ని, ఇప్పటికే రూ. 7,5008,000 కోట్ల వరకు వ్య యం జరిగినట్లు వివరించారు. ప్రస్తుతం భారీ ప్రజాధనం ఇప్పటికే వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను సమన్వయం చేసి గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

### సీతారామ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తాం: మంత్రి ఉత్తమ్

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు. ఇప్పటికే ప్రాజెక్టుపై గణనీయమైన ప్రజాధనం వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ, కేంద్ర జల సంఘం సూచనల మేరకు సాంకేతిక పరీక్షలు, భూగర్భ పరిశీలనలు, నిర్మాణ భద్రతా అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌లు, బ్యారేజ్, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థల నిర్మాణాన్ని వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సీతమ్మసాగర్ సీతారామ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

### ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందిస్తాం : మంత్రి పొంగులేటి

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర పనుల కోసం సుమారు రూ.1,000 కోట్ల కు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమా రు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన చోట అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని అన్నా రు. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రాజెక్టు పనుల ప్రస్తుత పురోగతి, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అ నుసంధానం, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన, శాఖల మధ్య సమన్వయంపై మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు, భూ సంబంధిత అంశాల ను వేగవంతంగా పరిష్కరిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. అనంతరం మంత్రులు మారె ళ్ళపాడు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు : సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: గోల్కొండ కోటపై శ్రీజగదాంబ మహంకాళి అమ్మ వారికి తొలి బోనం సమర్పణతో ఆషాఢమాస ఆధ్యాత్మిక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమవుతున్న ఈ పవిత్ర వేళ, ఆ జగన్మాత ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు ప్రసాదించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ భక్తి, శక్తి, ఐక్యతకు చిరస్మరణీయ చిహ్నమని సిఎం ఒక సందేశంలో పేర్కొన్నారు. అమ్మవారిపై అచంచల విశ్వాసంతో సమర్పించే ప్రతి బోనం, ప్రతి ప్రార్థన ప్రజల జీవితాల్లో సిరిసంపదలు, సంతోషం, ధైర్యం, విజయాలను నింపాలని ఆకాంక్షించారు. శ్రీ జగదాంబ మహంకాళి అమ్మ వారి అనుగ్రహం సకల ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ ముఖ్యమంత్రి గారు ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి చట్టబద్ధత కల్పించాలి

## జిల్లాలకే వచ్చి సమీక్షలు నిర్వహించాలి: ఉద్యమకారుల డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి పూర్తి స్థాయి చట్టబద్ధత కల్పించాలని, భవిష్యత్తులో ప్రభుత్వాలు మారినా ఉద్యమకారుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. అలాగే వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్‌కు రావడం కష్టమవుతోందని, కమిటీ సభ్యులే జిల్లాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో గురువారం అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావుతో పాటు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మోతె శోభన్ రెడ్డి, రాములు నాయక్ తదితర సభ్యులు పాల్గొని ఉద్యమకారుల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉత్తర తెలంగాణ జిల్లాల పాత్ర విశేషమని కొనియాడారు. సింగరేణి కార్మికుల సమ్మెలు, కరీంనగర్ ఉద్యమ పోరాటాలు రాష్ట్ర సాధనలో కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఉద్యమకారులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఉద్యమకారుల కుటుంబానికి 250 గజాల ఇంటి స్థలం, గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్, ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఉద్యమకారుల డిమాండ్లపై స్పందించిన కమిటీ సభ్యులు ప్రతిపాదనలన్నింటినీ సమగ్ర నివేదికలో పొందుపరిచి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# 'బియాండ్ ది రిపోర్ట్ కార్డ్' పుస్తకాన్ని అవిష్కరించిన కోదండరామ్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రముఖ క్లాసికల్ డ్యాన్సర్, విద్యావేత్త, గిన్నీస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత సోనాలి ఆచార్జీ రచించిన తొలి పుస్తకం 'బియాండ్ ది రిపోర్ట్ కార్డ్' పుస్తకాన్ని ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను శక్తివంతం చేయడం ద్వారా దేశ నిర్మాణానికి తన వంతు సహకారం అందించాలనే లక్ష్యంతో ఆమె ఈ పుస్తకాన్ని రచించారు. ప్రతి పిల్లాడు ప్రత్యేకమైనవాడేనని, కేవలం అకాడమిక్ మార్కుల ఆధారంగానే వారిని అంచనా వేయకూడదని ఈ పుస్తకంలో సోనాలి స్పష్టం చేసింది. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మానసిక ఉల్లాసం, సృజనాత్మకత, నైతిక విలువలు ఎంత ముఖ్యమనే అంశాలు కూడా ఈ పుస్తకంలో వివరించారు.

# యాదగిరిగుట్టలో రైతులకు శిక్షణా శిబిరం

## 18 నుంచి 20 తేదీ వరకు వివిధ అంశాలపై సదస్సులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల రైతుల శిక్షణా శిబిరం ఈ నెల 18 నుంచి 20 తేదీవరకు యాదగిరిగుట్ట మున్నూరు కాపు సంఘం హాలులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, రైతు నాయకులు ఈ శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న రైతు శిక్షణ శిబిరంలో వ్యవసాయం, సాగునీరు, పంటల రక్షణ, పంట రుణాలు, మహిళా రైతుల సమస్యలు, భూ భారతి చట్టం, కౌలు రైతుల హక్కులు, పాల రైతుల సమస్యలు తదితర కీలక అంశాలపై ప్రముఖ నిపుణులు, శాస్త్రవేత్తలు, ఉద్యమ నాయకులు ప్రసంగించనున్నారని తెలిపారు. ఈనెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య శిబిరాన్ని ప్రారంభించనున్నారని వెల్లడించారు. మూడు రోజుల రైతుల శిక్షణా శిబిరంలో భాగంగా వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ముందుగా ఎల్‌నినో పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా మెట్ట పంటల సాగు అనే అంశంపై అల్దాస్ జానయ్య, భారత్–అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రధానమంత్రి మోదీ సంతకం – రైతాంగానికి మరణ శాసనం అనే అంశంపై డాక్టర్ శరత్ బాబు, వ్యవసాయ , జీవ వైవిధ్య శాస్త్రవేత్త మర్ల సోము వివరించనున్నారని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, కోతులు, ఇతర అటవీ జంతువుల నుంచి పంటల రక్షణ, వ్యవసాయ విశ్వవిద్యాలయం వనం సునీత, ఆర్‌బిఐ మార్గదర్శకాలు పంట రుణాల అంశంపై తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.రవికాంత్ అవగాహన కల్పించనున్నారు. 19వ తేదీన గోదావరి–కృష్ణా జలాల వినియోగం, పెండింగ్ ప్రాజెక్టులు అంశంపై రిటైర్డ్ ఇంజనీర్ డి.లక్ష్మీ కాంతం, చరిత్ర గమనంలో మార్పు అనివార్యం అంశంపై డాక్టర్ యుగల్ రాయలు, ఎరువులు–నీటి యాజమాన్యం, మహిళా రైతుల సమస్యలు, భూ భారతి చట్టం అమలు వంటి అంశాలపై వివిధ రంగాల నిపుణులు ప్రసంగిస్తారని వెల్లడించారు. 20వ తేదీన కౌలు రైతుల 2011 చట్టం అమలు, పాల రైతుల సమస్యలు–పరిష్కారాలు వంటి అంశంపై గాదే శ్రీనివాస్, మహిళా రైతుల అనే అంశంపై పరచూరి జమున , భూ భారతి చట్టం అమలు వ్యవసాయ కమిషన్ సభ్యులు భూమి సునీల్ వివరించనున్నారు. 20వ తేదీన కౌలు రైతులు 2011 చట్టం అమలు అంశంపై కొండల్, పాల రైతుల సమస్యలు పరిష్కారాలు అంశంపై కిషన్ కుమార్ అవగాహన కల్పించనున్నారు. అనంతరం అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తెలంగాణ రాష్ట్ర రైతు సం ఘం విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు బాగం హేమంతరావు, పశ్యపద్మ తెలిపారు.

# మహిళా రిజర్వేషన్ల అమలు కోరుతూ మహేష్ కుమార్ గౌడ్‌కు జెఎసి వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్: మహిళలకు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అమలు చేయాలని మహిళా రిజర్వేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో గురువారం మహేష్ కుమార్ గౌడ్‌ను మహిళా సంఘాల ప్రతినిధులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో అనుసంధానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ, రాజ్యాంగ సవరణ ద్వారా ఆ షరతులను తొలగించి వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. ఈ డిమాండ్ గతంలోనూ మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావించిన విషయమేనని వారు గుర్తు చేశారు. ఈ వినతిపత్రంపై ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి , పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వరూప, సిఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జ్యోతి సంతకాలు చేశారు. మహిళా రిజర్వేషన్లు స్వతంత్ర అంశమని, వాటిని ఇతర రాజకీయ లేదా పరిపాలనా ప్రక్రియలకు అనుసంధానం చేయడం వల్ల అమలు మరింత ఆలస్యమవుతుందని జెఎసి మహేష్ కుమార్ గౌడ్‌కు వివరించారు. రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్లను జనగణన, డీలిమిటేషన్ నుంచి వేరు చేసే సవరణను తీసుకురావాలని, మూడవ వంతు రిజర్వేషన్లను వెంటనే అమలు చేసేలా కాంగ్రెస్ తరపున పార్లమెంట్‌లో చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం ప్రస్తుతం చాలా తక్కువగా ఉందని, త్వరలో పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల అమలు అత్యవసరమని జెఎసి కోరింది.

# సమస్యలు పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఆరోగ్యశ్రీ ప్రభుత్వ ఆసుపత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఆరోగ్యశ్రీ ప్రభుత్వ ఆసుపత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ భాస్క ర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, నాయకులు నిఖిలేష్, రఘురామ్, నిరంజన్, నాగేష్, బాలు , కృష్ణ, సమత, భాస్కర్ తదితరులు తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. గత 18 సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవల నిర్వహణలో కీలక పాత్ర పో షిస్తున్నప్పటికీ, ఇప్పటికీ వరకు తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. తమను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించి ఉద్యోగ భద్రతను కల్పించాలని, ఐఎఫ్‌ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లించాలని, పిఎఫ్,ఇఎస్‌ఐ సంక్షేమ సౌకర్యాలను అమలు చేయాలని కోరారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పని చేస్తున్న ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు గడిచిన పది నుంచి 12 నెలలుగా వేతనా లు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేసి, ఇకపై ప్రతి నెలా సకాలంలో జీతాలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

**CHANGE OF NAME**

I, **GOLLA CHINAIAH S/o GOLLA GHINAPPA,** H.No. 4-99, Laxmi Ganapathi Nagar, Gandimaisamma, Dommara Pochampally, Dindigul, Medchal Malkajgiri, Telangana - 500043, My Son name was wrongly occurred in Aadhaar Card as **G SRI MANIKANTA YADAV** (Old Name), Age: 11 Years, Shall henceforth be known as **GOLLA MANIKUMAR YADAV** (New Name) for all purposes.

# యుపిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత కోచింగ్

## నేటి నుంచి ఆగస్టు 7 వరకు దరఖాస్తుల స్వీకరణ : మంత్రి పొన్నం

ప్రజాపక్షం/హైదరాబాద్: యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ (ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్ తదితర) పరీక్షలకు సన్నద్ధమవుతున్న తెలంగాణ యువత కోసం బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 10 నెలల పాటు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ కోచింగ్‌కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులను జూలై 17 నుంచి ఆగస్టు 7 వరకు స్వీకరిస్తామని, స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఆయన వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రతి నెల రూ.5 వేల స్టైఫండ్‌తో పాటు పుస్తకాల కొనుగోలుకు ఒకేసారి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు బిసి స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

# ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ విషప్రచారం:వాకిటి



ప్రజాపక్షం/హైదరాబాద్: పింక్ మీడియా ద్వారా ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ విషప్రచారం చేస్తోందని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో తెలంగాణను అప్పులపాలు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తొమ్మిదిన్నర ఏళ్లు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వారు ఇప్పుడు మళ్లీ మూడు నెలలు అప్పగించమని అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి గురువారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'ముఖాముఖి' కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ వివాదాలు, ఉద్యోగుల సమస్యలు, విద్యార్థుల సమస్యలకు సంబంధించిన వినతులు అందాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ముఖాముఖి కమిటీ కన్వీనర్ మద్దుల గాల్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**జీడిమెట్ల సర్కిల్-55, క్యూబిజెడ్, సిఎంసి.**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం. |
|---|---|---|---|---|---|
| NIT No. 12/DB/ EE-III/JDM/C-55/ QBZ/CMC/2026-27, Dated: 16.07.2026 | బోనాల పండుగకు తాత్కాలిక లైటింగ్. (2 పనులు | రూ. 0.947 లక్షలు | 17.07.2026 @ 3:00 PM | 24.07.2026 3:00 PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549 హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 8712034411 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III, జెడిఎం సి-55, సిఎంసి.
DIPR R.O. No. : 6202-PP/CL/ADVT/2026-27, Date: 16-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**కూకట్‌పల్లి సర్కిల్-52**

Lr.No: 12/CMC/KPC-52/EE/2026-27 Date: 16.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 12/CMC/ KPC52/ EE/2026-27 Dated: 16.07.2026 | సిఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-52లో అభివృద్ధి పనులు | రూ. 9.38 లక్షలు | 18.07.2026 మ.01:00గం.లకు, 25.07.2026 మ.02:00 గం.ల వరకు | శ్రీమతి టి.రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-52, సెల్: 8897507674 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-52, సిఎంసి.
DIPR R.O. No. : 6176-PP/CL/ADVT/2026-27, Date: 16-07-2026



## అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

కలెక్టర్ ప్రియాంక

**ప్రజాపక్షం/నారాయణపేట :** అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో విసి హాల్‌లో పిఎంఎఫ్ఎంఇ, పిఎం విశ్వకర్మ పథకాల కింద తిరస్కరించబడిన దరఖాస్తులపై కలెక్టర్ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌బిఐ శాఖలలో తిరస్కరణలు అధికంగా ఉన్నాయని తెలిపారు. అన్ని దరఖాస్తులను స్పష్టంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నప్పటికీ, ఎస్‌బిఐలో మాత్రమే ఎక్కువ తిరస్కరణలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్‌యండి సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వివిధ బ్యాంకులను కేటాయించిన పిఎం విశ్వకర్మ దరఖాస్తులను బ్యాంకుల వారీగా సమీక్షించి అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బ్యాంకుల వారీగా పెండింగులో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాల వివరాలను ఆ కార్పొరేషన్ ఇడి అబ్దుల్ ఖలీల్ సమావేశంలో వివరించగా, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ వెంకట్‌రాములు, ఎల్‌డిఎం విజయ్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర్ గౌడ్, మున్సిపాల్టీ కమిషనర్ శంకర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**ప్రజాపక్షం/కృష్ణ :** అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం తెల్లవారుజామున కృష్ణ పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఎస్సై నవీద్ తెలిపిన వివరాల ప్రకారం గూడెబల్లూరు గ్రామ శివారులో గస్తీ తిరుగుతుండగా ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ డ్రైవర్ షేక్ మహబూబ్ తండ్రి షేక్ ఇబ్రహీం వయసు 38, టిప్పర్ యజమాని పేరు శ్రీకాంత్ తండ్రి బహీరాం రాథోడ్ మీద కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీద తెలిపారు. అనుమతి తప్పవని ఎస్సై నవీద్ హెచ్చరించారు.

## భైరాపూర్ వాగులో ఇసుక అక్రమ రవాణా

### ట్రాక్టర్ స్వాదీనం డైవర్, యాజమానిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/వెల్దండ :** ప్రభుత్వ అనుమతులు లేకుండా భైరాపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకొని స్వాదీనం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాపై వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీ నిర్వహించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించారు. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ కోల నిరంజన్, యాజమాని తిరుగుడు మల్లేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం చట్ట విరుద్ధమని, అక్రమ ఇసుక రవాణాపై నిఘా కొనసాగుతొందని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సృష్టం చేశారు.

## వాటర్ హీటర్ షాక్‌తో వివాహిత మృతి



**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండల కేంద్రంలోని విషాదం చోటు చేసుకుంది. వాటర్ హీటర్ కు కరెంట్ షాక్ తగిలి 26 ఏళ్ల వివాహిత మంజుల భాయి మృతి చెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి 7గంటల సమయంలో జరిగింది. మంజుల భాయి స్నానం చేయడానికి బాత్రూంకి వెళ్లారు. ఆ సమయంలో వాటర్ హీటర్‌లో ప్రమాదవశాత్తు కరెంట్ లీక్ అయింది. దీంతో ఆమెకు తీవ్రమైన కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. గమనించి కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను మానవపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

## ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విద్యార్థి సంఘం నాయకులు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలను విద్యార్థి సంఘం నాయకులు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు నక్క ఈశ్వర్, జక్కుల ఆశన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వారి విద్యపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, గ్రంథాలయం, పిఇటి, కంప్యూటర్ ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిడి (ఫిజికల్ డైరెక్టర్) పోస్టు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కోల్పోతున్నారని తెలిపారు. పాఠశాలకు ప్రహరీ గోడను మంజూరు చేయడంతో పాటు ఉపాధ్యాయులకు ప్రత్యేక మరుగుదొడ్లను నిర్మించాలని కోరారు. ప్రస్తుతం మరుగుదొడ్ల సౌకర్యం లేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని,సంబంధిత విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వెంకటయ్య, నక్క ఆంజనేయులు, మధుగని రామకృష్ణ, జెట్టి నవీన్, సిసింద్ర, వెంకటేశ్వర్లు గౌడ్, అనుకలి రాజు, శరత్, వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం

ఆందోళనలో రైతన్న



**ప్రజాపక్షం/పెబ్బేరు :** ప్రకృతి వ్యవసాయానికి ప్రాణధారం రైతు ఎంత కష్టపడినా, ఎంత పెట్టుబడి పెట్టినా చివరికి ఆకాశం కరుణిస్తేనే పంట చేతికోస్తుంది. ఈ ఏడాది వానాకాలం ప్రారంభమైనప్పటికీను తెలంగాణలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా రుతుపవనాల తీరు మారడం, వర్షాల పంపిణీ అసమానంగా ఉండడం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది. వనపర్తి జిల్లాలో పరిస్థితి మరింత ఆందోళకరంగా కనిపిస్తోంది. సాధారణంగా ఈ సమయానికి సాగు పనులు ఊపందుకోవాల్సి ఉండగా, సగటు వర్షపాతం కన్నా తక్కువ వర్షాలు నమోదవడంతో అనేక మండలాల్లో రైతులు ఇంకా విత్తనాలు వేయలేక ఎదురుచూస్తున్నారు. కొందరు రైతులు పొలాలను సిద్ధం చేసుకుని వర్షాల కోసం వేచి ఉంటే, మరికొందరు ఇప్పటికే కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల గురించి ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సమయంలో రైతులకు అవసరమైంది. కేవలం వర్షం మాత్రమే కాదు, ప్రభుత్వ భరోసా వ్యవసాయశాఖ మార్గదర్శకత్వం, శాస్త్రీయ సలహాలు కూడా అంతే ముఖ్యమైనవి, ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రస్తుత పరిస్థితులను వివరించాలి. తొందరపడి విత్తనాలు వేయొద్దని, స్థిరమైన వర్షాలు వచ్చిన తర్వాతే సాగు ప్రారంభించాలని సూచించాలి. ఆలస్యంగా వర్షాలు వచ్చినా దిగుబడి ఇచ్చే స్వల్పకాలిక పంట రకాలు, ప్రత్యామ్యాయ పంటలపై స్పష్టమైన సూచనలు ఇవ్వాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రవేత్తలు కలిసి గ్రామాల వారీగా పంటల ప్రణాళికలను రూపొందించి రైతులకు చేరవేయాలి. నీటి సంరక్షణ, తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, నేలలో తేమను నిల్వ ఉంచే పద్ధతులపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలి. ప్రతి సంక్షోభం ఒక పరీక్ష, కానీ సరైన ప్రణాళిక, సమన్వయం, శాస్త్రీయ దృక్పథం ఉంటే నష్టాలను తగ్గించుకోవచ్చు. రైతుకు భరోసా కల్పించడం అంటే కేవలం ఆర్థిక సహాయం ఇవ్వడం మాత్రమే కాదు, సరైన సమాచారం, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునేలా చేయడం కూడా అంతే ముఖ్యం. ఈ క్లిష్ట సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రతి గ్రామంలో రైతు ధైర్యంగా ఉండేలా ప్రభుత్వం అండగా నిలిస్తేనే వ్యవసాయ రంగం ఈ వర్షాభావ సవాలును అన్నదాతలు అధిగమించగలరు. ఆకాశం వైపు చూసే రైతు కళ్లలో ఆందోళన కాదు.. ఆశ కనిపించేలా చేయడం ప్రభుత్వ యంత్రాంగం, వ్యవసాయశాఖ, సమాజం అందరి బాధ్యత. వర్షాలు కురవక, కాల్వలకు నీరు రాక సాగు కష్టమై, అన్నదాతల జీవనాధారమైన వ్యవసాయం చేసుకోలేక రైతులకు ఆత్మహత్యలే దిక్కు కాకుండా ప్రభుత్వం ఆదుకోవాలని గుమ్మడం గ్రామం మహిళా రైతు సరిత కోరుతున్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే సోమవారం నుండి సమ్మె


ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు ఎఐటియుసి హెచ్చరిక



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికుల పెండింగ్ వేతనాలు రెండు రోజుల్లో చెల్లించకపోతే సోమవారం మెరుపు సమ్మెకు దిగుతామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ హెచ్చరించారు. గురువారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల మూడు నెలల పెండింగ్ జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లింపులు ఇతర కార్మికులు సమస్యలపై గురువారం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, శ్రీ శాంతి ఏజెన్సీ కాంట్రాక్టర్ ప్రవీణ్, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులు సంయుక్తంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ఆసుపత్రి కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేస్తున్నా కార్మికులకు మాత్రం ప్రతినెల సకాలంలో వేతనాలు అందించడంలో అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు వైఫల్యం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు జీతాలు రాక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బాగీ కృష్ణ యాదవ్, ఆసుపత్రి యూనియన్ బ్రాంచ్ నేతలు , కార్మికులు నరసింహ, నాగరాజు, నవీన్, రాజేష్, పేర్మల్, అబ్దుల్ అజిద్, నాగరాజు, శేఖర్, వినయ్, భాస్కర్ రెడ్డి, మోహన్, మానెమ్మ, విజయలక్ష్మి , శివలీల, సుక్కమ్మ, అలివేలు, పద్మ, భార్గవి, నీరజ, స్వాతి, చెన్నమ్మ, రాధిక, లక్ష్మి , నీలమ్మ, సుమతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

వైరల్ ఫీవర్‌తో రైతులను కలిసిన వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/అమరచింత :** అమరచింత, ఆత్మకూరు మండల పరిధిలోని నందిమల్ల, మూలమల్ల రైతులు గురువారం హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని సాగు నీరు, పశువుల తాగునీటి అవసరాల దృష్ట్యా ప్రాజెక్టు కాలువ నుంచి నీటిని విడుదల చేయాలని రాష్ట్రమంత్రి వాకిటి శ్రీహరికి విన్నవించారు. మంత్రి వాకిటి శ్రీహరి స్పందించి జూరాల ప్రాజెక్టు సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడి సాగునీటిని విడుదల చేసేందుకు అధికారులు ఒప్పుకున్నారని రైతులకు సూచించారు. పశుసంవర్ధక, మత్స్య, క్రీడల, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నా తన నియోజకవర్గ పరిధిలోని రైతులు వచ్చారని తెలుసుకుని ఆ రైతుల సమస్యలను పూర్తిగా విని ఆ ప్రాంతంలోని జురాల ప్రాజెక్టు కాలువ నుండి రైతులకు కొంతమేర సాగునీటిని విడుదల చేసేందుకు కృషి చేసిన మంత్రికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గీత పారిశ్రామిక సహకార సంస్థ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, నందిమల్ల సర్పంచి రాజేందర్ రెడ్డి, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## హోరెత్తిన జనజాగరణ యాత్ర

సిఎం దృష్టికి తీసుకెళతా

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన జనజాగరణ యాత్ర నగర్ కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి అసెంబ్లీ నియోజకరవర్గానికి చేరింది. ఈ సందర్భంగా నియోజకరవ్గ కేంద్రంలో సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నరసింహ రావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ బహిరంగా సభను నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర అధ్యక్షులు, స్థితప్రజ్ఞచ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు మ్యాన పవన్, మల్లికార్జున్, నరేందర్ రావులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఎంఆర్ఎఓ ఎమ్ఆర్ఓ ఆఫీస్ నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ మహబూబ్‌నగర్ చౌరస్తా మార్కెట్ బస్టాండ్ మీదుగా మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు ఉత్సాహంగా సాగింది. ర్యాలీ పొడవునా ఉద్యోగులు వి.వాంట్ ఓపిఎస్ ఉద్యోగి పెన్షన్ మన హక్కు, అంటూ చేసిన నినాదాలతో కల్వకుర్తి పట్టణం హోరెత్తింది. అనంతరం మహబూబ్‌నగర్ చౌరస్తా పెద్ద బహిరంగా సభ జరిగింది. బహిరంగా సభ అనంతరం యూనియన్ నాయకులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు మ్యాన పవన్, మల్లికార్జున్, నరేంద్ర రావులతో పాటు జిల్లా బాద్యులు సైదులు నియోజకవర్గ స్థాయి నాయకులు రాజేందర్ సురేష్ వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కల్వరాల జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని కల్వరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై పాఠశాలకు మరోసారి గర్వకారణంగా నిలిచారు. ఈనెల 18వ తేదీన మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు పాఠశాలకు చెందిన సి.మీనాక్షి , జి.మీనాక్షి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్ వెల్లడించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ట్రయథలాన్, ఏసీ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తొలి స్థానం సాధించిన ఈ ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. క్రమశిక్షణతో సాధన చేయడం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని వారు పేర్కొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా

## కార్మిక లోకం పోరాటాలకు సిద్ధం

ఎఐటియుసి నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్




**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** కేంద్ర ప్రభుత్వ నూతన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక లోకం పోరాటాలకు సిద్ధమవ్వాలని ఎఐటియుసి నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. గురువారం హెచ్64 టిజి, జెన్కో ఆధ్వర్యంలో ఎఐటియుసి నాగర్ కర్నూల్ జిల్లా 3వ మహా సభ కరపత్రాల రిలీవ్ చేయడం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొన్నారు. 1886వ సంవత్సరంలో అమెరికా చికాగో నగరంలో 8గంటల పని, 8గంటల విశ్రాంతి, 8 గంటల వినోదం ద్వారా చారిత్రత్మక కార్మి చట్టాలను సాధించింది. స్వాతంత్ర పోరాట కాలంలో అనేక మంది కార్మిక నాయకులు కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న దేశ స్వాతంత్ర కోసం తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై, జిల్లా వ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్తు కార్యచరణను రూపొందించుకోవడానికి తాడూరు ఒడల కేంద్రంలో జరుగుతన్న మహా ప్రదర్శనకు కార్మికులంతా భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి హెచ్64 కార్మిక యూనియన్ శ్రీశైలం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు రామయ్య, బి.లక్ష్మ య్య, కోశాధికారి రమసుబ్బయ్య, నాయకులు కుమార్, శ్రీను, మబుల్ మల్లికార్జున్,న మోష అబ్దుల్ ఖాదర్, మహిళా కార్మికులు గౌరీ, చంద్రకళ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## జిల్దార్ తిప్పకు కృష్ణా జలాలు మళ్లించకపోతే ప్రజా ఉద్యమం తప్పదు



సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ హెచ్చరిక

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కొల్లాపూర్ మండలంలోని జిల్దార్ చెరువుకు కృష్ణాజలాలు మళ్లించి చెరువు కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించకపోతే ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ హెచ్చరించారు. నేడు సిపిఐ జిల్లా బృందం జిల్దార్ చెరువును సందర్శించి అక్కడ నిరసన ఆందోళన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972లో రంగదాసు చెరువుతో నిర్మించిన జిల్లా నేటీకి రైతులకు పూర్తిస్థాయి నీరు అందించే దుస్థితిలో ఉండడానికి కారణం. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన పాలకులేనని ఆయన మండిపడ్డారు. మొలచింతపల్లి ముక్కిడిగండం గేమ్ నాయక్ తండ చంద్రబండ తండా రైతులకు ఏకైక జీవనోపాధి అయిన ఈ చెరువు పనులు ఎందుకు ఇంత నిర్లక్ష్యాన్ని గురిచేరుతున్నాయని ఆయన ప్రశ్నించారు. పక్కనే కృష్ణనది ఏరులై పారుతుంది. అనేక ప్రాజెక్టుల రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నాయి. అయినా ఈ చెరువుకు కృష్ణా జలాలు మళ్లించడంలో ప్రభుత్వాలు ప్రభుత్వ ప్రజాప్రతినిధులు క్షమించరాని నిర్లక్ష్యం చేయడం మూలంగానే నేటీకి దాదాపుగా నాలుగువేల ఎకరాల ఆయకట్టు పొలాలకు నీళ్లు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కృష్ణా జలాలు మళ్లించడానికి కావాల్సిన ప్రణాళిక రూపొందించి యుద్ధప్రాతిపథకంగా నిధులు కేటాయించి పనులు ప్రారంభించకపోతే ఈ నాలుగు గ్రామాల రైతులు ఇతర కల్సొచ్చే శక్తులు సంఘాలు అందర్నీ కలుపుకోని ప్రజా ఉద్యమాన్ని తీవ్రత్తం చేస్తావని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా సమితి సభ్యులు గుర్రపు కురమయ్య, సిపిఐ మండల నాయకులు ఎండి యూసుఫ్, జంగం శివుడు, జి.వెంకటస్వామి, జె.శంకర్, అమరగిరి స్వామి, ఎండి పాషా, వెంకటస్వామి, శ్రీనివాసులు, చంద్రు, రామకృష్ణ, రాఘువేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ నర్సింగరావు




**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండడంతో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సాహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి విద్య, వైద్యం, తాగునీరు, వర్షపాతం, ప్రజాపాలన, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా ఫ్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించడంతో లక్ష్యం మేరకు విద్యార్థులు చేరేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాల వారీగా వర్షాపాతం వివరాలను తెలియజేస్తూ వివిధ పంటల సాగు వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో ప్రజలు తెలియజేసిన వివిధ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. గద్వాల ఐడిఒసి వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సంగరావు నిర్దేశిత అంశాలపై జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ హృదయ రాజ్, డిఈఓ విజయలక్ష్మి , సిపిఓ వెంకటరమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్, డిఎల్పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## అదుపుతప్పిన ద్విచక్ర వాహనం మహిళ మృతి

**ప్రజాపక్షం/గట్టు :** పొలం దగ్గర నుండి ద్విచక్ర వాహనంపై తల్లి , కుమారుడు ఇంటికి వస్తుండగా వాహనం అదుపు తప్పడంతో కింద పడిన సంఘటనలో తల్లి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బలిగెర గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై శేఖర్ గౌడ్ అందించిన వివరాల ప్రకారం, బలిగేర గ్రామానికి చెందిన నర్సమ్మ(52) ఈమె పెద్ద కుమారుడు బసప్ప ఇద్దరు పొలం పనులు ముగించుకోని ఇంటికి వస్తుండగా బలిగిర గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం ఎఫ్‌జడ్ (TS33T 5565) అదుపుతప్పి కింద పడ్డారు. ఈ సంఘటనలో తల్లి నరసమ్మ తలకు బలంగా గాయాలు కావడంతో ఈమెను చికిత్స నిమిత్తం ఐజ ఆసుపత్రికి తరలించారు. అనంతరం డాక్టర్ల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. ఈ సంఘటనపై కుమారుడు ముకయ్య గాళ్ల భీమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## 17న దళిత క్రైస్తవ గర్జన భారీ బహిరంగ సభ

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట 17వ తేదీన శుక్రవారం నాడు మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండ దగ్గర జరిగే దళిత క్రైస్తవ గర్జన భారీ బహిరంగ సభను దళిత క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కొత్తకోట ఎంబి సీయోను సంఘం చైర్మన్ ఎం.భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం నాడు దళిత క్రైస్తవ గర్జన బహిరంగ సభ పత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 14 15 25 ప్రకారం షెడ్యూల్ కులాలకు పూర్తి మత స్వేచ్ఛ ఇవ్వాలని షెడ్యూల్ కులాల హక్కులను హరించే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని ఆయన డిమాండు చేశారు. ఫాస్టర్స్ చర్చిలపై ఉజ్జీవ సభలపైన జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆయన కోరారు. కొత్తకోట మండలంలోని దళిత క్రైస్తవులు దైవజనులు సంఘం నాయకులు విశ్వాసులు అందరూ అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరడం జరిగింది. సంఘ వైస్ చైర్మన్ సీఎం ప్రియదర్శనం సంఘ సెక్రెటరీ రమేష్ కోశాధికారి చంద్రమోహన్, కమిటీ సభ్యులు ఎన్.జయరాజు, బి.నిక్సన్ , జే.రాజు, జే.జాన్ ఎన్ యాకోబు ఎన్.ప్రసాద్ , జె.లూకాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లపై విజిలెన్స్ అధికారుల విచారణ

**ప్రజాపక్షం/అమరచింత :** అమరచింత మండల పరిధిలోని పామిరెడ్డి పల్లెలో ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు కొందరు కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు డబ్బులు అడిగినట్లు వచ్చిన మాధ్యమాలలో వచ్చిన పుకార్లు ఆ వాస్తవమని విజిలెన్స్ అధికారి బలరాం, పిడి విఠోబాలు గురువారం పామిరెడ్డిపల్లిలో విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు 50 వేల లంచం ఇవ్వాలని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ గ్రామంలో లబ్ధిదారులచే విచారణ చేయగా ఎవరు కూడా లంచం అడగలేదని లబ్ధిదారులు విజిలెన్స్ అధికారులకు తేల్చి చెప్పారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ బిల్లుల విషయంలో లంచం అడిగినట్టు ఎలాంటి ఆధారాలు లేవని, ఆరోపణలలో వాస్తవం లేదని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ, హౌసింగ్ ఎఇలు పాల్గొన్నారు.



## మూడు దశల్లో ఖరీఫ్ సాగుకు నీటి సరఫరా

### మూసీ ప్రాజెక్టు నుండి తొలి తడికి నీటి విడుదల

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఖరీఫ్ సాగుకు మూసీ ప్రాజెక్టు నుండి మూడు దశల్లో నీటిని సరఫరా చేయాలని ముందే నిర్ణయించిన నీటిపారుదల శాఖ అధికారులు తొలి తడికి గురువారం నీటిని విడుదల చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మొదటి దశ జూలై 16 నుండి ఆగష్టు 5 వరకు 20 రోజులపాటు 15 రోజుల విరామ అనంతరం రెండవ దశ ఆగష్టు 20 నుండి సెప్టెంబర్ 4 వరకు మూడవ దశ సెప్టెంబర్ 19 నుండి అక్టోబర్ 4 వరకు నీటి విడుదల చేయనున్నారు. ప్రస్తుతం మూసీ ప్రాజెక్టులో 640.92 అడుగుల నీటి మట్టం వద్ద 3.098 టిఎంసిల నికర నిల్వలు అందుబాటులో ఉన్నాయి. మూడు దశల్లో మొత్తం 2.819 టిఎంసిల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇదిపోగా మిగులు 0.279 టిఎంసిల నికరంగా నీరు ఉండే అవకాశం ఉంది. ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి లభ్యతను బట్టి నాల్గవ తడికి నీటి విడుదలకు నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

## ప్రజాస్వామ్యంలో యువతే కీలకం

### ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ నమోదు చేసుకోవాలి : ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యువత ఓటు హక్కు విలువను తెలుసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ ప్రభుత్వ గ్రంథాలయ ఆవరణలో విద్యార్థులతో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యేతో పాటు మిర్యాలగూడ ఆర్‌డీవో రమణారెడ్డి విచ్చేశారు. ఈ ముఖాముఖి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణల కోసం క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎన్యూమరేషన్ ప్రక్రియను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ దరఖాస్తు విధానంపై విద్యార్థులు లేవనెత్తిన పలు సందేహాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆర్‌డీవో రమణారెడ్డి నిశితంగా పరిశీలించి వాటికి తగిన వివరణలు ఇచ్చారు. యువ ఓటర్ల శాతాన్ని పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రంథాలయానికి వచ్చే ప్రతి అభ్యర్థి ఓటరు జాబితాలో తమ పేరు ఉండేలా చూసుకోవాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో ఎన్నికల విభాగం సిబ్బంది, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సుగుణయ్య త్యాగాలు మరవలేనివి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం:** గంగాపురం సుగుణయ్య అకాల మరణం సిపిఐ కి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సుగుణయ్య దశదిన కర్మ సందర్భంగా సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు గంగాపురం సుగుణయ్య కుటుంబ సభ్యులు ఎంతో కృషి చేశారని అన్నారు. భూ పోరాటాలు నిర్వహించి జైలు జీవితం అనుభవించిన వారిలో సుగుణయ్య, లింగమయ్య ఉన్నారని గుర్తు చేశారు. సిపిఐలో ఉంటూ కడవరకు కమ్యూనిస్టుగా ఉన్న గొప్ప ఉత్తమ కమ్యూనిస్టు అని అన్నారు. ఈ సంతాప సభలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే యాదగిరి రావు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే. శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి,గీత పనివారాల సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ నాగభూషణం, మాజీ గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య పాల్గొన్నారు.

## ఫలించిన టియుడబ్ల్యుజె( ఐజెయు) పోరాటం

### జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ

### జిల్లా కలెక్టర్, డిఇఒలకు జిల్లా కమిటీ కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో జర్నలిస్టు కుటుంబ సభ్యుల ఫీజు రాయితీ కోసం టియుడబ్ల్యుజె(ఐజెయు) చేసిన పోరాటానికి ఫలితం దక్కింది.జూన్ 5వ తేదీన టియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.అయితే సర్క్యులర్ జారీలో జాప్యం జరగటంతో సరిగ్గా నెల రోజుల తర్వాత జూలై 6వ తేదీన ఆందోళన కార్యక్రమాలకు,నిరసనలకు ధర్నాలకు,టియుడబ్ల్యుజే జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కనీవిని ఎరగని రీతిలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. జిల్లాలోని అన్ని మండలాలు,పట్టణాలు, డివిజన్ కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలలో జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున జర్నలిస్టు పాల్గొని సర్క్యులర్ జారీకోసం చేసిన పోరాటం ఫలించింది. దీంతో జిల్లాలోని జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు పాఠశాల విద్యలో 50 ఫీజు రాయితీని కల్పిస్తూ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి సుశేందర్ రావు సర్క్యులర్ జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్క్యులర్ జారీ చేసి ఎంతో మంది మధ్యతరగతి కుటుంబాలకు చెందిన జర్నలిస్ట్ కుటుంబాల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించినందుకు జిల్లా కలెక్టర్, డిఇఒలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు పరమేష్, కార్యదర్శి దోటి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు జిల్లా అధ్యక్షుడు సలీం,యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జిల్లా యాదయ్య, నాయకులు, జర్నలిస్టులు అశోక్,తెల్లగమల దశరథ, దేవరకొండ యాదగిరి, లతీఫ్, ముచ్చర్ల శ్రీనివాస్, కంది వేణు తదితరులు పాల్గొన్నారు.



# సాగర్‌లో నీళ్లు అడుగంటుతున్నాయ్..

### గతేడాదితో పోలిస్తే భారీ తగ్గుదల..



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వలు ఆందోళనకరంగా తగ్గుతున్నాయి. గత ఏడాది ఇదే తేదీతో పోలిస్తే ఈ ఏడాది రిజర్వాయర్‌లో నీటిమట్టం 43.69 అడుగులు తగ్గడం ఖరీఫ్ సాగునీటి నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. 2025 జూలై 16 నాటికి సాగర్ నీటిమట్టం 557.29 అడుగులు ఉండగా, 2026 జూలై 16 నాటికి అది 513.60 అడుగులకు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదలగా ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే ఈ సమయానికి జలాశయంలో ఆశాజనకమైన నిల్వలు ఉండా ల్సి ఉంటుంది. అయితే ఈసారి ఎగువ ప్రాంతా ల నుంచి ఆశించిన స్థాయిలో వరద ప్రవాహాలు లేకపోవడం, వర్షపాతం కూడా ఆశించిన మేర నమోదు కాకపోవడంతో సాగర్ పరిస్థితి ఆందోళనకరంగా మారింది.ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటి లభ్యతను తాగునీరు, సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి అవసరాల మధ్య ఎలా సమతుల్యం చేస్తారన్నది కీలకంగా మారింది. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే ఖరీఫ్‌కు నీటి విడుదలపై సందిగ్ధత నెలకొనే అవకాశాన్ని అధికారులు కూడా కొట్టిపారేయడం లేదు. ఇప్పటి నుంచి కురిసే వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాలపైనే సాగర్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. రానున్న రోజుల్లో భారీ ఇన్‌ఫ్లోలు నమోదైతేనే జలాశయంలో నీటి మట్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ప్రణాళిక ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.గత ఏడాది 557.29 అడుగులు... ఈ ఏడాది 513.60 అడుగులు... ఈ 43.69 అడుగుల వ్యత్యాసమే ప్రస్తుతం సాగర్ పరిస్థితిని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

## లబ్ధిదారులను వెంటనే ఇళ్లలోకి అనుమతించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో నిర్మించిన 565 డబుల్ బెడ్‌రూం ఇళ్లను, అప్పటి జిల్లా కలెక్టర్, ఆర్డీవోల సమక్షంలో పూర్తి పారదర్శకంగా, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం డ్రా పద్ధతిలో ఎంపికైన లబ్ధిదారులకు కేటాయించారని, అదే లబ్ధిదారులను ఎలాంటి అడ్డంకులు లేకుండా వెంటనే ఇళ్లలోకి అనుమతించాలని కోరు తూ గురువారం మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సూర్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుల సొంత ఇల్లు అనేది కలగానే మిగిలిపోకుండా నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం అందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ డబుల్ బెడ్‌రూం గృహ పథకాన్ని అమలు చేసి వేలాది కుటుంబాలకు అశ్రయం కల్పించారని అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్‌లో నిర్మించిన 565 డబుల్ బెడ్‌రూం ఇళ్లను సూర్యాపేట జిల్లా కలెక్టర్, కోదాడ ఆర్డీవో సమక్షంలో కెమెరాల పర్యవేక్షణలో పూర్తిగా పారదర్శకంగా డ్రా విధానంలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు.

## వేగవంతంగా సిఎంఆర్ డెలివరీ

### రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ జి వి. శ్యాం ప్రసాద్ లాల్



**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి వి శ్యాం ప్రసాద్ లాల్ పౌరసరఫరాల అధికారులు ,రైస్ మిల్లర్లను ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఖరీఫ్ 100 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు.గురువారం అయన నల్గొండ రెవిన్యూ అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఉమ్మడి నల్గొండ జిల్లా రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో కష్టం మిల్లింగ్ రైస్ పై సమీక్ష నిర్వహించారు.ఎఫ్ సి ఐ రేక్ మూమెంట్, స్థలాలు, ఎఫ్ సి ఐ పేమెంట్స్ తదితర అంశాలపై ఆయా జిల్లాల వారీగా సమీక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఖరీఫ్ వంద రోజుల ప్రణాళికపై సమీక్షిస్తూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని, ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రానున్న ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక కు పౌరసరఫరాధికారులతో పాటు, రైస్ మిల్లర్లు కూడా సిద్ధం కావాలన్నారు. సి ఎం ఆర్ డెలివరీలో భాగంగా ప్రతిరోజు డిఎస్ఓ లు పౌరసరఫరాల డిఎం లు మిల్లలవారీగా పర్యవేక్షణ చేసి సీఎంఆర్ డెలివరీని పెంచేయాలన్నారు. ప్రతి వారం మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. మిల్లులు 24 గంటలు నడిచేలా పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసిల్దారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ ఆదనపు కలెక్టర్‌జె .శ్రీనివాస్, నల్గొండ పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల డీఎస్ ఓ లు, పౌర సరఫరాల డీఎంలు, ఉమ్మడి నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్లు, సివిల్ సప్లై, ఎన్ ఫొసిమెంట్ విభాగాల అధికారులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## ఆగస్టు 3లోగా సర్ ప్రక్రియ వందశాతం పూర్తికి చర్యలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆగస్టు 3 లోగావంద శాతం పూర్తి చేయాల్సి ఉందని,ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ ప్రక్రియ పురోగతిపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఓటర్లకు 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 78 శాతం మ్యాపింగ్, డిజిటలైజేషన్ పూర్తయిందని, రానున్న నాలుగు నుంచి 5 రోజుల్లో దీనిని 92 శాతానికి పెంచాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను పంపిణీ చేసి, వాటిని పూరించడంలో ప్రజలకు సహాయం చేస్తున్నారని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు10లక్షల మ్యాపింగ్‌లు పూర్తయ్యాయని, ఇంకా 54 వేల మ్యాపింగ్‌లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇంకా 344 ఓట్లు గుర్తించాల్సి ఉందని తెలిపారు. బుధవారం నాటికి పెండింగ్ మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి కోసమే అత్తను హత్య చేసిన కోడలు

### కొణతం భాగ్యమ్మ అనుమానాస్పద హత్య కేసును ఛేదించిన పోలీసులు

### డిఎస్‌పి ప్రసన్న కుమార్ వివరాలు వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామానికి చెందిన కొణతం భాగ్యమ్మ అనే వృద్ధురాలు 28 ఏప్రిల్ 2026న అనుమానాస్పదంగా మృతి చెందింది. దీనిపై తన కూతురు శోభారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు జరుపగా ఆస్తి కోసం కోడలే భాగ్యమ్మను హత్య చేసినట్లు తేలింది. గురువారం డిఎస్పి వి. ప్రసన్న కుమార్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. తన అత్త భాగ్యమ్మ మంచం మీది నుండి మృతి చెందినట్లు కోడలు మధుర తమ బంధువులతో పాటు తన ఆడపడుచు ఉప్పు శోభారాణికి సమాచారం అందించింది. అక్కడికి చేరుకొని ఆమె తల్లి మృతదేహంపై పడి రోధిస్తూ ఆమె ఒంటిపై ఉన్న దెబ్బలను గుర్తించి తన తల్లి చావు అనుమానాస్పదంగా ఉందని తన వదిన కొణతం మధురను నిలదీయగా మంచం మీద నుండి కిందపడి మృతి చెందినట్లు చెప్పగా అది నమ్మశక్యంగా లేదని తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం రిపోర్టు కూడా దెబ్బలు కొట్టడం వల్ల భాగ్యమ్మ మృతి చెందినట్లు తేలింది. దీంతో పోలీసులు కోడలు మధురను అదుపులోకి తీసుకొని విచారించగా మృతురాలు భాగ్యమ్మ కుమారుడు మృతి చెందగా కోడలు మధుర వద్దనే ఉంటుంది. ఆమెకు 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో తన కూతురు శోభారాణి భాగం కావాలని తుంగతుర్తి కోర్టులో కేసు ఫైల్ చేయడం జరిగింది. దీంతో వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇదే విషయం తన తల్లితో తేల్చుకునేందుకు శోభారాణి తన స్వంత గ్రామమైన టేగామమైన గ్రామం నుండి అక్కడికి వెళ్ళింది. దీనికి తన కోడలు మధుర అభ్యంతరం తెలుపగా కనీసం ఆమెకు రెండు ఎకరాలైనా ఇవ్వాలని భాగ్యమ్మ చెప్పగా అందుకు నిరాకరించింది. దీనిలో భాగంగా అత్తను కొట్టడంతో బలమైన గాయాలై మృతి చెందింది. తన అత్త మంచం మీద నుండి పడి మరణించినట్లు ఫోన్ ద్వారా బంధువులకు నమ్మబలికింది. ఆమె దహన సంస్కారాలు చేస్తున్న సమయంలో మృతురాలి ఒంటిపై గాయాలు గమనించారు. ఇది పోలీసుల విచారణలో వాస్తవమని తేలడంతోపాటు నింధితురాలు మధుర తానే కొట్టి చంపినట్లు చెప్పడంతో ఆమెను అరెస్టు చేశారు. ఆమె నుండి ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించారు. ఈ సమావేశంలో తుంగుతుర్తి సిఐ పాల్గొన్నారు.

## ల్యాండ్ ఛీటింగ్ కేసులో ఓ వ్యక్తి అరెస్టు



**ప్రజాపక్షం/చివ్వెంల :** ల్యాండ్ ఛీటింగ్ కేసులో మండల పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. సూర్యాపేట పట్టణానికి చెందిన కాసర్ల సురేందర్ రెడ్డి ఐలాపురం గ్రామ శివారులో ఉన్న భూమిని ప్లాట్లుగా విక్రయిస్తామని చెప్పి ఇతరుల భూమిని తనదిగా నమ్మించి మోతె మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన కొడిదల వెంకన్న, కొడిదల కనకయ్యలకు అమ్మి భారీ నగదును తీసుకోవడం జరిగింది. భూమికి డబ్బులు మొత్తం చెల్లించినప్పటికి రిజిస్ట్రేషన్ చేయకుండా నెలల తరబడి గడుపుతుండడంతో భూమిని కొనుగోలు చేసిన కొడిదల వెంకన్న ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. దీంతో కాసర్ల సురేందర్ రెడ్డి వారిని మోసం చేసినట్లు గుర్తించి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు.

## మహిళల సంక్షేమమే లక్ష్యం

### ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మహిళల సంక్షేమం, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులకు చెందిన మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో 8 వేలకుపైగా మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల ఆర్థిక భారం తగ్గిందని చెప్పారు.నకిరేకల్‌లో 100 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పూర్తైందని ట్రామా కేర్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడపర్తి గ్రామంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఆరోగ్యశ్రీ వైద్య సహాయ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్,తహశీల్దార్ యశ్వంత్ రాజ్,మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగొని రజిత శ్రీనివాస్, నాయకులు పన్నాల రాఘవరెడ్డి లింగాల వెంకన్న,బ్రహ్మదేవర రమేష్ ,మురారి శెట్టి కృష్ణమూర్తి,గంగాధర పద్మ,గాజుల సుకన్య,పద్మ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ గ్రామీణ నీటి పారుదలశాఖ మరియు మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న తాగునీటి పరిస్థితి, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా, పైప్‌లైన్ల నిర్వహణ, మోటార్ల పనితీరు, నీటి నిల్వ సామర్థ్యం, లీకేజీల నివారణ, మరమ్మతులు, నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై తదితర అంశాలపై అధికారులతో ఎంఎల్‌ఏ సమగ్రంగా చర్చించారు. వేసవి కాలంతో పాటు ఇతర సమయాల్లో కూడా ప్రజలకు ఎలాంటి మంచినీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను ఎంఎల్‌ఏ ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎంఎల్‌ఏ ఆదేశించారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలోనూ మంచినీటి సమస్య లేకుండా చూడటమే నాలక్ష్యం అని అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఏ బాలునాయక్ పేర్కొన్నారు. ఈసమీక్షా సమావేశంలో గ్రామీణ నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ శాఖకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తేర్యాల గ్రామాభివృద్ధికి కృషి చేయండి



**ప్రజాపక్షం/మోటకొండూరు:** తేర్యాల గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని గురువారం ప్రభుత్వవిప్ ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యను కలిసి సర్పంచ్ లత, గ్రామశాఖ అధ్యక్షులు సికిందర్‌రెడ్డి కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గుండాల మండలంలో, నేడు మోటకొండూరు మండలంలో కూడా మారుమూల ప్రాంతం అవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, గతంలో పనిచేసిన ఎంఎల్‌ఏలు తేర్యాల గ్రామంలో సవతి తల్లి ప్రేమ చూపిస్తూ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు విసుగు చెందారుని అన్నారు. ప్రభుత్వ విప్ ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య తేర్యాల గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామంలో సిసి రోడ్లు, పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు మూతబడిన పాఠశాలల పునరుద్దరణ చేయడం తదితర అభివృద్ధి కార్యక్రమాలతో తేర్యాల గ్రామం ముందుకు వెళ్ళడం గమనార్హం. అని ఇవే కాకుండా గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులు, టీచర్లను కేటాయించాలని, గ్రామంలో పూర్తి స్థాయి సిసి రోడ్ల నిర్మాణం చేయాలని, బిక్కేరు వాగుపై చెక్ డ్యాం నిర్మించాలని, గోదావరి వాగు ఉధృతి ఉండడం వలన ఇబ్బందులు ఎదురవుతున్నందున పరిమితి పెంచాలని, విద్యుత్ జంక్షన్, సబ్ స్టేషన్, ప్రైమరీ హెల్త్ సెంటర్ మంజూరు చేయాలని ఎంఎల్‌ఏను కోరడం జరిగింది. ఎంఎల్‌ఏ ఐలయ్య సానుకూలంగా స్పందిస్తూ త్వరలో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో సర్పంచ్ లత స్వామి హర్షం వ్యక్తం చేశారు.

## డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** యువత మాదకద్రవ్యాల బారీన పడకుండా వారి భవిష్యత్‌ను కాపాడుకోవడమే లక్ష్యంగా హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హనుమానాయక్ మాట్లాడుతూ నేటి యువతే దేశానికి భవిష్యత్ అని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని సూచించారు. సరదా కోసం అలవాటు చేసుకునే వ్యాసనాలు జీవితాలను రోడ్డున పడేస్తాయని హెచ్చరించారు. కళాశాల పరిసరాల్లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాని ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే లేదా డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతులు



ప్రజాపక్షం/రంగారెడ్డి: జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 8 మంది అంగన్‌వాడీ ఆయాలకు, హెల్పర్లకు అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇచ్చిన ఉత్తర్వులను అదనపు కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి గురువారం నియామక పత్రాలు అందజేయడం జరిగిందని జిల్లా సంక్షేమ అధికారిణి జి.శాంతిశ్రీ తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఓలు ఎల్.శాంతిరేఖ, ఎస్.రేణుక, పి.ఉదయ హాజరయ్యి అంగన్‌వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు అందజేయడం జరిగింది. త్వరలో జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని జిల్లా సంక్షేమ అధికారిణి జి. శాంతి శ్రీ తెలిపారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు రక్ష

ఎల్‌బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రజాపక్షం/హయత్‌నగర్: సిఎం రిలీఫ్‌ఫండ్ పేదల ఆరోగ్యభద్రతకు రక్ష అని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కి చెందిన మంజుల వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు ఎమ్మెల్యేని సంప్రదించారు. ఆయన స్పందించి సిఎం సహాయనిధి ద్వారా రూ.2లక్షల ఎల్ఓసి మంజూరు చేయించి బాధితురాలు సోదరుడు రాజుకు అందజేశారు. కార్యక్రమంలో భవాని ప్రవీణ్ కుమార్, యాదశంకర్, ముద్ద కళ్యాణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని మేడిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న హనుమాను దేవాలయానికి దూరంగా టిజిఐఐసి అధికారులు రోడ్డును నిర్మించాలని కోరుతూ గురువారం మేడిపల్లి, పల్లే చేల్క తండాకు చెందిన యువకులు ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పల్లే చెల్కతండా మాజీ సర్పంచ్ లోకేశ్, ఉప సర్పంచ్ బాల్ , మధు, రాజేంధర్, శ్రీను, బిమ్లా, బాలు, మల్లేశ్, మధు, నారియా, పిఅర్‌జి ఫౌండేషన్ అధ్యక్షులు పోద్దుటూరి రవీందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## పార్కు స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : అక్రమంగా పార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఉమ్మడి బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మారుతి నగర్ కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురికావడంతో కాలనీ వాసులు సమాచారంతో నిర్మాణాన్ని కాలనీ వాసులతో కలిసి అడ్డుకున్నారు. రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి కాలనీవాసులతో కలిసి పార్కు స్థలంలో అనుమతులు ఎలా ఇచ్చారని అధికారులను నిలదీశారు. అనుమతులను తక్షణమే రద్దు చేయాలని, పార్కు స్థలం కాపాడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రావు, శ్రీధర్‌రావు, గంగం ప్రేమ్‌నాథ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్‌గౌడ్, రవిశంకర్, దుర్గాప్రసాద్, అరుణ, దుర్గ, స్వాతి, సత్య, ఉమా, శారద, బిందు, సత్యవేణి పాల్గొన్నారు.

## 641జిఒ రద్దు చేయాలి

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారాయణరావు



ప్రజాపక్షం/కొత్తూరు: సిద్దాపూర్‌లో ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డును తక్షణమే ప్రభుత్వం రద్దు చేసి, 641జీవో ఉపసంహరించుకోవాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులు, గిరిజనులతో నిజ నిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా నారాయణ రావు మాట్లాడుతూ చెత్త డంపింగ్ యార్డు వల్ల చెరువులు, కుంటలు, వన్యప్రాణులు, ప్రకృతి వనరులు పూర్తిగా కలుషితమయ్యే అస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు, సహాయ కార్యదర్శి తిరుమలయ్య సుభాన్, బాలయ్య, రాములు, వెంకటేష్, బాలయ్య, బస్వరాజ్, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్, మిట్టునాయక్ పాల్గొన్నారు.

## బిఎల్ఒలు 'సర్' ప్రక్రియ బాధ్యతాయుతంగా నిర్వహించాలి

ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: సర్ ప్రక్రియను బిఎల్‌ఓలు బాధ్యతయుతంగా వ్యవహరించి, ఓటర్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ వికాష్ మహాతో పేర్కొన్నారు. గురువారం హస్తినాపురంలోని నందనవనం, భూపేష్ గుప్తా నగర్, జనార్ధన్‌రెడ్డి కాలనీల్లో జరుగుతున్న సర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారంను బిఎల్‌ఓల నుంచి పొంది, ఫారాలను నింపించి నిర్దేశిత గడువులోగా తిరిగి బిఎల్‌ఓలకు అందచేయాలని ఆయన సూచించారు. ఫారంను సమర్పించకపోతే జాబితా నుంచి పేరు తొలగింపు జరుగుతుందన్నారు. ఓటు హక్కు కలిగిన వారు తమ ఓటును సర్ ప్రక్రియలో భాగంగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమావత్ శ్రీనివాస్ నాయక్, సయ్యద్ పాష, బిఎల్‌ఓలు సత్యనారాయణ, అనంతలక్ష్మి , రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ జంక్షన్‌లో రెండు అండర్‌పాస్‌లు

- రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఎంఎంసి బ్రేక్
- సమస్యగా మారిన భూసేకరణ
- నాగోల్ - హబ్సిగూడల వైపు అండర్‌పాస్‌ల నిర్మాణం
- నిర్మాణ వ్యయంతో పాటు తగ్గనున్న ఆస్తుల సేకరణ
- ప్రతిపాదనలు రూపొందిస్తున్న అధికారులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉప్పల్ జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు నిర్మించ తలపెట్టిన రెండు ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని రద్దు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వాటి స్థానంలో రెండు అండర్ పాస్‌లు నిర్మించాలనే యోచనలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్( ఎంఎంసి) యోచనలో ఉన్నట్లు తెలిసింది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించే పనిలో ఇంజనీరింగ్ యంత్రాంగం ఉంది. సర్వే ఆఫ్ ఇండియా, రామాంతాపూర్ వైపున రెండు అండర్‌పాస్‌ల నిర్మాణం జరపనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. ఉప్పల్ బస్టాండ్ నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు మీదుగా స్టేడియం వరకు నిర్మాణ పనులను ఎంఎంసి చేపడుతుంది. ఉప్పల్ బస్టాండ్ నుంచి నారపల్లి వరకు జాతీయ రహదారుల సంస్థ నిర్మాణ పనులు చేపడుతున్న విషయం తెల్సిందే. అయితే ఉప్పల్ జంక్షన్ పరిధిలో హబ్సిగూడ నాగోల్, నాగోల్ హబ్సిగూడ వైపు ఎడమ, కుడి రెండు వైపుల రెండు ఫ్లైఓవర్‌లతో పాటు ఉప్పల్ నారపల్లి ఎలివెటెడ్ కారిడార్ ఒకే ప్యాకేజీ కింద నిర్మించాలని గతంలో నిర్ణయించారు. దీనితో కేవలం ఉప్పల్ నారపల్లి పనులు మాత్రమే ప్రారంభించారు. హబ్సిగూడ నాగోల్ వైపు ఎడమ, కుడి వైపుల నిర్మించే రెండు ఫ్లైఓవర్ల భూసేకరణ ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. పెద్ద సంఖ్యలో భూసేకరణ జరపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సర్వే ఆఫ్ ఇండియాతో పాటు ప్రైవేట్ ఆస్తులు ఎక్కువ సంఖ్యలో సేకరించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రెండు ఫ్లైఓవర్లకు భూసేకరణ భారీ మొత్తంలో సేకరించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఉప్పల్ జంక్షన్‌లో మెట్రోరైలుతో పాటు ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో ఉంది. ఈ రెండు ప్రాజెక్టులు కూడా ఈ రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి అడ్డంకిగా మారే పరిస్థితులు ఉన్నాయి. దీంతో రెండు ఫ్లైఓవర్ల నిర్మాణం సవాల్‌గా మారడంతో పాటు భూసేకరణ సమస్యాత్మకంగా తయారైంది. దీంతో ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రతిపాదనల నుంచి ఎంఎంసి వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే వైపున రెండు అండర్‌పాస్‌లు నిర్మిస్తే అన్ని సమస్యలకు పరిష్కారంగా ఉంటుందనే యోచనలో ఎంఎంసి అధికారులు యోచిస్తున్నట్లు తెలిసింది. భూ సేకరణతో పాటు వ్యయం కూడా భారీ మొత్తంలో తగ్గడంతో పాటు నిర్మాణ పనులు కూడా త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకవచ్చేందుకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో అధికారులు ఎంఎంసి ఉన్నతాధికారులు అండర్‌పాస్‌ల నిర్మాణం వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన తుది నిర్ణయం త్వరలోనే తీసుకునే అవకాశం ఉందని సమాచారం. అండర్‌పాస్‌ల నిర్మాణానికి సంబంధించి నిర్ణయం తీసుకున్న వెంటనే అందుకు సంబంధించిన డిపిఆర్ తయారు చేసి, పనులు ప్రారంభించాలనే యోచనలో ఎంఎంసి అధికారులు ఉన్నట్లు తెలిసింది.

# చెత్త డంపింగ్ యార్డు రద్దు చేయండి

641జిఒ రద్దుకు సిఎంకు లేఖ రాస్తా.. ఎంపి డికె అరుణ



ప్రజాపక్షం/కొత్తూరు: పర్యావరణానికి ముప్పు కలిగించే చెత్త డంపింగ్ యార్డును రద్దు చేయాలని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎంపి డికె అరుణ డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో పర్యటించి ప్రజలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి డికె అరుణ ప్రసంగించారు. ప్రభుత్వం ఏకపక్షంగా 641జీవోను విడుదల చేయడం అప్రజాస్వామికమన్నారు. జనావాసాల మద్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా ప్రజలు ఆరోగ్యం ప్రమాదంలో పడే అస్కారం ఉంటుందని వివరించారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డంపింగ్ యార్డు ప్రతిపాధనను పున పరిశీలించాలని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. చెత్త డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ప్రజలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల నేతలు పాల్గొన్నారు.

## జాబితాలో ఓటు నమోదు కావాలి

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : ప్రతిఒక్కరు తమ పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూసుకోవాలని ఉమ్మడి మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మాదాపూర్ డివిజన్‌లో సర్ కార్యక్రమంపై శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీనివాస్‌గౌడ్, కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావు, జూపల్లి సత్యనారయణ హాజరై మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు మిస్ అవ్వకుండా జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ప్రతి బిఎల్‌ఎ అప్రమత్తగా పని చేయాలని సూచించారు.




## తప్పులు లేకుండా 'సర్' వివరాలు



ప్రజాపక్షం/కేశంపేట: ఎన్యుమరేషన్ ఫారాలు తప్పులు లేకుండా ఓటర్లు బిఎల్‌ఓలు ఇచ్చేందుకు కృషిచేయాలని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దండే రామచంద్రయ్య, నాయకులు రావుల పెంటయ్య, వార్డు సభ్యులు జింక యాదయ్య, నేలు ఎల్లనమోని శ్రీహరి, బిఎల్‌ఓలు విజయలక్ష్మి , గంటేల జంగయ్య,కుమ్మరి శ్రీనివాసు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాపక్షం/కొందుర్గు: రోగులకు మెరుగైన సేవలు అంధించేందుకు 102,108 అంబులెన్స్ నిర్వాహకులు కృషిచేయాలని కోఆర్డినేటర్స్ రాంబాబు, శ్రీహరి సూచించారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలో ఉన్న 102, 108అంబులెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సేవల సమయంలో ఉపయోగపడే ఔషదాలు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పనిచేయాలని సూచించారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ నార్త్ కాలనీల్లో నూతన డ్రైనేజీ పనులు గురువారం జలమండలి మేనేజర్ భాను ప్రకాష్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు పొగుల రాంబాబుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాగరాజా, రాజు, శ్రీనివాస్, చక్రధర్, రామనాథరెడ్డి, కోటేశ్వరయ్య, సీతా మెహర్ తదితరులు పాల్గొన్నారు.



# చరిత్రలో చిరస్థాయిగా అమరవీరుల త్యాగాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




ప్రజాపక్షం/షాద్‌నగర్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి) ఆధ్వర్యంలో అమరవీరు స్థూపం ఆవిష్కరణ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితం, సోనియాగాంధీ కృషితోనే తెలంగాణ రాష్ట్రం సిద్దించిందని గుర్తు చేశారు. వీరి త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, నల్లమోని శ్రీధర్, వెంకట్‌రాంరెడ్డి, రఘునాయక్, శేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవికుమార్‌గుప్తా, అంబటి ప్రభాకర్, దంగు శ్రీనివాస్‌యాదవ్, జాంగారి రవి, జెఏసి నేతలు జనార్ధన్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, నక్క బాలరాజ్, టిజి.శ్రీనివాస్, బిష్వ కృష్ణయ్య, రవీంద్రనాథ్, అర్జునప్ప, మందారం నర్సింహులు, గొర్లరాము, పరంజ్యోతి పాల్గొన్నారు.

## వినాయక నగర్ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా




ప్రజాపక్షం/హయత్ నగర్: హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వినాయకనగర్ కాలనీలో సీనియర్ సిటిజన్ సొసైటీ భవనం నిర్మించి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దల కోసం నిర్మించిన ఈ భవనం నేటికీ ఉపయోగపడటం ఆనందంగా ఉందన్నారు, కార్యక్రమంలో యాదిరెడ్డి, హరినాథ్ బాబు,అత్తపురం రామచంద్ర రెడ్డి సుధాకర్, వెంకట్ రెడ్డి ,రాజారావు,బుచ్చి రెడ్డి ,నర్సింహా గౌడ్ , విశ్వరూప శర్మ, సత్తయ్య, కాలనీ కార్యదర్శి మహేష్ , సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు మరియు ప్రముఖులు పాల్గొన్నారు.

## అత్యాధునిక వసతులతో ప్రభుత్వ పాఠశాల



ప్రజాపక్షం/షాద్‌నగర్: హైద్రాబాద్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామాకృష్ణారావు స్వగ్రామంలో రూ.50కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో ప్రభుత్వ పాఠశాల భవనం మంజురైందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ వివరించారు. గురువారం మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో సిసి రోడ్డుతోపాటు పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ బూర్గుల గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ శివలీల, సర్పంచులు నరసింహులు, జంగయ్య, చందునాయక్, మల్లేష్, రామకృష్ణ, నేతలు రాములుగౌడ్, నవీన్, కట్ట వెంకటేష్, శ్రీశైలం, భరత్‌రెడ్డి, పుల్లారెడ్డి, లింగారెడ్డిగూడ ఉపసర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

## ఘనంగా జగన్నాథ రథయాత్ర

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌టిసి కాలనీలో కళింగ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రకు గురువారం మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ ప్రజలందరు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని జగన్నాథ స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రఘునాయక్, కౌన్సిలర్లు చాకలి పెంటయ్య, మురళీమోహన్ (అప్పి), సుధీర్, ప్యాట అశోక్, ఎస్పీ శివ, పినమోని గోపాల్, నల్లమోని శ్రీధర్, కె.జయప్రకాష్, నారాయణ గౌడ్, భరత్ లోహాటి, తంగడపల్లి శంకర్, సాయికృష్ణ, జయప్రకాష్, మురళి, గంగనమోని సత్తయ్య, రవితేజలతోపాటు భక్తులు పాల్గొన్నారు.



# గిరిజనుల సంక్షేమం మరిచిన పాలకులు

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: పాలకులు గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ వారి సంక్షేమాన్ని మర్చిపోయాయని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి ఆరోపించారు. గిరిజన సమాఖ్య అబ్దుల్లాపూర్ మెట్ మండల మహాసభ గురువారం రావి నారాయణరెడ్డి కాలనీ ఫజ్ 2 సిపిఐ కార్యాలయంలో మెట్టు మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు యాదిరెడ్డి హాజరై మాట్లాడుతూ గిరిజనులకు విద్య, ఉద్యోగ, రాజకీయరంగాలలో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. గిరిజనుల జనాభాకి అనుగుణంగా నిధుల కేటాయింపు, రిజర్వేషన్ల పెంపు మరియు పోడు భూములకి పట్టాలు మరియు ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై పోరాటం చేయాలన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లకుండా చూసి గిరిజనుల అభివృద్ధికి ఆ నిధులు ఉపయోగించాలన్నారు. నైపుణ్యం కలిగిన గిరిజన యువతకు ప్రత్యేకమైన సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ సక్రునాయక్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రకటించిన నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మెట్టు మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, లోక్యనాయక్, లావుడియాశంకర్, వినోద్, వెంకటేష్, దేవా, వర్త్య శంకర్, క్రాంతి, శ్రీదేవి, వంశీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మూడో భాష బోధనపై సుప్రీంకోర్టు ఆందోళన

**న్యూఢిల్లీ :** సిబిఎస్‌ఈ పాఠ్యాంశంలో 9వ తరగతి నుంచి మూడో భాషను ప్రవేశపెట్టే విధానంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. 9వ తరగతి నుంచే విద్యార్థులపై చదువు ఒత్తిడి పెరుగుతుందని, అలాంటి సమయంలో కొత్త భాషను ప్రవేశపెట్టడం వారి మానసిక ఒత్తిడిని మరింత పెంచుతుందని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. కొత్త భాషను ప్రవేశపెట్టాలనుకుంటే 5వ లేదా 6వ తరగతి నుంచే బోధించడం మంచిదని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని కేంద్ర తరపు న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

## లఖింపూర్ ఖేరీ హింస కేసు

### సాక్షుల బెదిరింపుల్లో వారి ప్రమేయం లేదు

అజయ్ మిశ్రా, ఆశిష్ మిశ్రాకు అనుకూలంగా సుప్రీంకోర్టులో యుపి ప్రభుత్వం నివేదిక

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ హింసాకాండ కేసు (2021)లో సాక్షులను బెదిరించారనే ఆరోపణలపై మాజీ కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా, ఆయన కుమారుడు ఆశిష్ మిశ్రాకు ఎలాంటి ప్రమేయం లేదని దర్యాప్తులో తేలిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ వ్యవహారంలో వారిపై అభియోగపత్రం కూడా దాఖలు చేయలేదని వెల్లడించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు రాష్ట్ర ప్రభుత్వం తాజా స్థితిగతుల నివేదికను సమర్పించింది. సాక్షుల బెదిరింపు కేసులో అమన్‌దీప్ సింగ్‌పై మాత్రమే అభియోగపత్రం దాఖలైందని, అజయ్ మిశ్రా, ఆశిష్ మిశ్రా ప్రమేయానికి ఎలాంటి ఆధారాలు లభించలేదని కోర్టు నమోదు చేసింది. ఆశిష్ మిశ్రా బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వచ్చే నెలకు వాయిదా వేసింది. ప్రధాన హింసాకాండ కేసులో విచారణ వేగంగా సాగుతోందని, మరో మూడు నెలల్లో ట్రయల్ పూర్తయ్యే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం మరో 62 మంది సాక్షులను విచారించాల్సి ఉందని వెల్లడించింది. 2021 అక్టోబర్ 3న లఖింపూర్ ఖేరీలో రైతుల నిరసన సందర్భంగా జరిగిన హింసలో నలుగురు రైతులు సహా మొత్తం ఎనిమిది మంది మరణించారు. ఈ ఘటనలో ఆశిష్ మిశ్రాతో పాటు మరో 12 మందిపై హత్య, నేర కుట్ర తదితర అభియోగాలతో విచారణ కొనసాగుతోంది. గతంలో విచారణ నెమ్మదిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, సాక్షుల హాజరు నిర్ధారించి విచారణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది.

## కూల్చివేతలపై ధిక్కార పిషటీన్

### సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని సుప్రీంకోర్టు సూచన


సుప్రీంకోర్టు 2024లో జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ ఆస్తుల కూల్చివేతలు జరిగాయని ఆరోపిస్తూ పలు ధిక్కార పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే, వీటిని నేరుగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారాల్లో వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉన్నందున బాధితులు సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులకు సంబంధించిన రికార్డులను సంబంధిత హైకోర్టులకు బదిలీ చేస్తామని, అవసరమైతే జిల్లా కోర్టుల ద్వారా సాక్ష్యాలను సేకరించి వాస్తవాలను నిర్ధారించాలని సూచించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక రక్షణ ఉత్తర్వులు హైకోర్టు విచారణ పూర్తయ్యే వరకు కొనసాగుతాయని స్పష్టం చేసింది. అయితే అవసరమైతే ఆ ఉత్తర్వుల్లో మార్పులు కోరుతూ హైకోర్టులను ఆశ్రయించవచ్చని తెలిపింది. ఈ కేసులను సాధ్యమైనంత వరకు నాలుగు నెలల్లోగా పరిష్కరించాలని హైకోర్టులను కోరింది. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పలుచోట్ల 'బుల్డోజర్ న్యాయం' పేరుతో చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా కూల్చివేతలు జరుగుతున్నాయని వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ఈ చర్యల్లో అధికారులు చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించారా? లేదా? అన్నదే ప్రధానమని పేర్కొంది. వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని శిక్షాత్మక చర్యల మాదిరిగా కూల్చివేతలు చేపట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జస్టిస్ బాగ్చి వ్యాఖ్యానించారు. గత ఏడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా వర్తించే మార్గదర్శకాలను జారీ చేస్తూ, ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

## తూర్పు, మధ్య, ఈశాన్య రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

**న్యూఢిల్లీ:** భారత వాతావరణ శాఖ (ఐఎండి) దేశంలోని తూర్పు, మధ్య, ఈశాన్య ప్రాంతాలకు చెందిన పలు రాష్ట్రాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం, చురుకుగా ఉన్న రుతుపవనాల కారణంగా రానున్న రెండు మూడు రోజుల పాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ముఖ్యంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. భారీ వర్షాల నేపథ్యంలో నదులు, వాగులు పొంగిపొర్లే ప్రమాదం ఉండటంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వరదలు, పట్టణాల్లో నీటిమునిగే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం కూడా ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా యంత్రాంగాలను అప్రమత్తం చేశాయి. జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన దళాలు (ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్) అవసరమైన ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచబడ్డాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక శిబిరాల ఏర్పాటుతో పాటు అత్యవసర సహాయక చర్యలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## అదానీ క్రిమినల్ కేసు ఉపసంహరణపై

# అమెరికా న్యాయస్థానం సందేహాలు



**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీపై నమోదైన అవినీతి, లంచాల కేసును ఉపసంహరించుకోవాలని అమెరికా న్యాయశాఖ (డిఒజె) చేసిన విజ్ఞప్తిపై అమెరికా ఫెడరల్ కోర్టు మరోసారి తీవ్ర సందేహాలు వ్యక్తం చేసింది. న్యూయార్క్ తూర్పు జిల్లా ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి నికోలస్ గరౌఫిస్, కేసును ఉపసంహరించుకునే నిర్ణయం ఎలా తీసుకున్నారనే విషయంలో న్యాయశాఖ ఇచ్చిన వివరణ పూర్తి స్థాయిలో లేదని వ్యాఖ్యానించారు. అదానీ తరఫు న్యాయవాది రాబర్ట్ జిఫ్రా జూనియర్ సమర్పించిన పత్రాల్లో కొత్త సమాచారం బయటపడటంతో ఈ సందేహాలు మరింత బలపడ్డాయని కోర్టు పేర్కొంది. ఈ వివాదానికి కారణం అమెరికా న్యాయశాఖ రెండు వేర్వేరు సందర్భాల్లో కోర్టుకు సమర్పించిన వివరాల మధ్య ఉన్న వైరుధ్యం. ఈనెల 4న సమర్పించిన అఫిడవిట్‌లో ప్రిన్సిపల్ అసోసియేట్ డిప్యూటీ అటార్నీ జనరల్ ఆర్. ట్రెంట్ మెక్‌కాటర్, అదానీపై క్రిమినల్ అభియోగాలను ఉపసంహరించుకోవాలనే నిర్ణయాన్ని తానే ఒక్కడే తీసుకున్నానని, ఈ విషయంలో అమెరికా అటార్నీ జోసెఫ్ నోసెల్లా లేదా ఇతర అధికారుల అభిప్రాయాలను కోరలేదని స్పష్టం చేశారు. అయితే, అదానీ తరఫు న్యాయవాది కోర్టుకు సమర్పించిన ప్రకటనలో మే 11న అమెరికా అటార్నీ జోసెఫ్ నోసెల్లా పంపిన ఇమెయిల్‌ను జత చేశారు. ఆ ఇమెయిల్‌లో అదానీ గ్రూప్ ప్రతిపాదించిన 10 బిలియన్ డాలర్ల అమెరికా పెట్టుబడిని కేసు పరిష్కారంలో భాగంగా అంగీకరించబోమని స్పష్టంగా పేర్కొంటూనే, కేసు పరిష్కారానికి సంబంధించిన ఇతర మార్గాలపై చర్చలు కొనసాగుతున్నాయని నోసెల్లా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేసు ఉపసంహరణ నిర్ణయంలో నోసెల్లా కూడా కీలక పాత్ర పోషించినట్లు కనిపిస్తోందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. మెక్‌కాటర్ చెప్పినట్లుగా ఆయనే ఏకైక నిర్ణయాధికారి అయితే, నోసెల్లా ఎందుకు కేసు పరిష్కార చర్చల్లో పాల్గొన్నారనే ప్రశ్నను కోర్టు లేవనెత్తింది. అంతేకాకుండా, మే 18న కేసు ఉపసంహరణకు సంబంధించిన ప్రభుత్వ దరఖాస్తుపై నోసెల్లా సంతకం చేసినప్పటికీ, ఈనెల 4న సమర్పించిన వివరణాత్మక అఫిడవిట్‌పై ఆయన సంతకం లేకపోవడాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. దీంతో న్యాయమూర్తి నోసెల్లాను ఈనెల 17లోగా ప్రమాణపూర్వక ప్రకటన సమర్పించాలని ఆదేశించారు. మెక్‌కాటర్ పేర్కొన్న కారణాలతో తాను ఏకీభవిస్తున్నారా? కేసు ఉపసంహరణకు మరే ఇతర కారణాలు ఉన్నాయా? ఉంటే వాటిని పూర్తి వివరాలతో వెల్లడించాలని సూచించారు. అదేవిధంగా, కోర్టుకు భాగంగా మాత్రమే సమర్పించిన మే 11 ఇమెయిల్‌ను పూర్తిస్థాయిలో అందజేయాలని అదానీ తరఫు న్యాయవాదిని ఆదేశించగా, ఆయన వెంటనే పూర్తి ఇమెయిల్‌ను దాఖలు చేశారు. ఈ కేసు నేపథ్యం 2024 నవంబర్‌కు చెందినది. అప్పట్లో అమెరికా న్యాయశాఖ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా పలువురిపై భారత రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సుమారు 250 మిలియన్ డాలర్ల లంచాలు ఇచ్చి పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టులు పొందారని, అనంతరం అమెరికా పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ క్రిమినల్ అభియోగాలు నమోదు చేసింది. ఇదే వ్యవహారంపై అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) కూడా ప్రత్యేకంగా సివిల్ కేసు నమోదు చేసింది. తర్వాత మే నెలలో ఎస్ఇసితో జరిగిన ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం గౌతమ్, సాగర్ అదానీలు కలిపి 18 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించేందుకు అంగీకరించారు. అయితే ఆరోపణలను అంగీకరించలేదు. అనంతరం అమెరికా న్యాయశాఖ క్రిమినల్ కేసును ఉపసంహరించుకోవాలని కోర్టును ఆశ్రయించింది. కానీ ఆ విజ్ఞప్తిలో తగిన కారణాలు వివరించలేదని ఇప్పటికే కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. తాజా పరిణామాలతో అదానీ కేసు మరోసారి అమెరికా న్యాయవ్యవస్థలో చర్చనీయాంశంగా మారింది. కేసు ఉపసంహరణ వెనుక నిజమైన కారణాలు ఏమిటి? న్యాయశాఖ తన పూర్తి నిర్ణయ ప్రక్రియను కోర్టుకు వెల్లడించిందా? అనే అంశాలపై కోర్టు విచారణ కొనసాగుతోంది. జూలై 17న నోసెల్లా సమర్పించే ప్రమాణపూర్వక ప్రకటన ఈ కేసు భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక పత్రంగా మారే అవకాశం ఉంది.

## ఇస్రోలో శాస్త్రవేత్తల రాజీనామాలపై కేంద్రం అప్రమత్తం

ఇస్రోలో కీలక ప్రాజెక్టుల సిబ్బంది నిష్క్రమణపై కేంద్రం కొత్త నిబంధనలు




**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో శాస్త్రవేత్తలు స్వచ్ఛంద పదవీ విరమణ (విఆర్ఎస్), రాజీనామాల వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల వంద మందికి పైగా శాస్త్రవేత్తలు రాజీనామా చేయడం లేదా ముందస్తు పదవీ విరమణ తీసుకోవడంతో, జాతీయ ప్రాధాన్యత కలిగిన అంతరిక్ష ప్రాజెక్టులపై దాని ప్రభావం పడకుండా చర్యలు చేపట్టింది. ఈ మేరకు అంతరిక్ష శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్) ఈనెల 14న ఇస్రోకు చెందిన ప్రధాన పరిశోధనా కేంద్రాలకు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం, గగన్‌యాన్ మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం, ఇతర కీలక అంతరిక్ష మిషన్లు, ప్రాజెక్టులతో అనుబంధంగా పనిచేస్తున్న గ్రూప్‘ఏ’ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు లేదా స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించ కూడదు. అలాంటి దరఖాస్తులను ఆయా కేంద్రాల డైరెక్టర్లు తమ స్పష్టమైన సిఫార్సులతో కలిసి నేరుగా అంతరిక్ష శాఖకు పంపాలని, తుది నిర్ణయం శాఖే తీసుకుంటుందని పేర్కొంది. దీంతో 2020లో ఇస్రో కేంద్రాల డైరెక్టర్లకు ఇచ్చిన స్వతంత్ర ఆమోద అధికారాలను కేంద్రం పరిమితం చేసింది. ఇటీవలి కాలంలో బెంగళూరులోని యుఆర్ రావు శాటిలైట్ సెంటర్ (యుఆర్ఎస్‌సి), తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ (విఎస్ఎస్‌సి)ల నుంచి అత్యధిక మంది శాస్త్రవేత్తలు నిష్క్రమించినట్లు సమాచారం. గగన్‌యాన్ ప్రయోగానికి ఉపయోగించే ఎల్‌విఎం3 (గతంలో జిఎస్ఎల్‌వి మార్క్3) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన సీనియర్ శాస్త్రవేత్త విక్టర్ జోసెఫ్ టి కూడా ఈ ఏడాది ప్రారంభంలో సంస్థను వీడడం చర్చనీయాంశమైంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2020లో అంతరిక్ష రంగాన్ని ప్రైవేటు సంస్థలకు తెరవడం, 2023లో భారత అంతరిక్ష విధానం అమల్లోకి రావడంతో ప్రైవేటు స్పేస్ స్టార్టప్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం దేశంలో 400లకు పైగా నమోదిత అంతరిక్ష స్టార్టప్‌లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. పిక్సెల్, స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, ధ్రువ స్పేస్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ వంటి సంస్థలు మెరుగైన వేతనాలు, పరిశోధనలో అధిక స్వేచ్ఛ, వేగవంతమైన అవకాశాలను అందిస్తుండటంతో ఇస్రోలోని అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు అక్కడికి వెళ్తున్నారని భావిస్తున్నారు. ఇదే సమయంలో ఇస్రో ఇటీవల కొన్ని సాంకేతిక ఎదురుదెబ్బలను కూడా ఎదుర్కొంది. గత ఏడాది, ఈ ఏడాది జరిగిన రెండు పిఎస్ఎల్‌వి ప్రయోగాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అయినప్పటికీ, గగన్‌యాన్, చంద్రయాన్4, భారతీయ అంతరిక్ష కేంద్రం (భారతీయ స్పేస్ స్టేషన్), మంగళయాన్2 వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయాలంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను సంస్థలో కొనసాగించడం అత్యంత అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మార్గదర్శకాలు ఇస్రోలో ప్రతిభను నిలబెట్టుకోవడానికి తీసుకున్న కీలక పరిపాలనా చర్యగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం

ప్రధానికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ



**న్యూఢిల్లీ:** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం మళ్లీ ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో, ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే డీలిమిటేషన్ బిల్లును ఆమోదింప చేస్తామని కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేసిన నేపథ్యంలో ఖర్గే లేఖ ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా, డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజుకు పలు మార్లు లేఖలు రాశానని, అయితే ప్రభుత్వం ఆ విజ్ఞప్తిని పట్టించుకోలేదని ప్రధానికి రాసిన లేఖలో కర్గే పేర్కొన్నారు. అనంతరం 2026 రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఏప్రిల్ 17న లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు సవరించిన బిల్లును వర్షాకాల సమావేశాల్లో మళ్లీ ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం వస్తోందని, అలాంటి పరిస్థితిలో ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించి, సవరించిన ప్రతిపాదనలను అన్ని పార్టీలకు వివరించాలని ఖర్గే కోరారు. అలాగే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు దానిని పూర్తిగా అధ్యయనం చేసేందుకు తగిన సమయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఈ అంశంపై విస్తృత రాజకీయ సంప్రదింపులు అవసరమని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది.

## నీట్ ప్రశ్నపత్రం లీక్ కేసు..

### బెయిల్ పిటిషన్‌పై తీర్పు22కు వాయిదా




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్–యుజి 2026 ప్రశ్నపత్రం లీక్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ఈ కేసులో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న అనంతరం తీర్పును ఈనెల 22కు వాయిదా వేసింది. ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) విచారిస్తున్న నేపథ్యంలో, నిందితులకు బెయిల్ మంజూరు చేయడాన్ని సిబిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కుట్ర దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక వైద్య ప్రవేశ పరీక్ష విశ్వసనీయతను దెబ్బతీసిందని, ఇంకా దర్యాప్తు కొనసాగుతున్న దశలో నిందితులను విడుదల చేస్తే సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని సిబిఐ కోర్టుకు వివరించింది. మరోవైపు, నిందితుల తరఫు న్యాయవాదులు తమ ఖాతాదారులు విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారని, దీర్ఘకాలంగా న్యాయ నిర్బంధంలో ఉన్నందున బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. గతంలో ఇదే కేసులో కొందరు నిందితుల బెయిల్ అభ్యర్థనలను కోర్టు తిరస్కరించగా, మరికొన్ని సందర్భాల్లో ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పరిమిత ఉపశమనం కల్పించింది. ఈ కేసు దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉండటంతో న్యాయపరమైన పరిణామాలపై తీవ్ర ఆసక్తి నెలకొంది.

## వర్షాకాల సమావేశాల్లో న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లు

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని దృష్టిలో ఉంచుకుని న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కలిపి సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34 ఉండగా, దానిని 38కు పెంచేందుకు కేంద్రం ఇటీవల ఆర్డినెన్స్ జారీ చేసింది. ఇప్పుడు అదే ఆర్డినెన్స్ స్థానంలో చట్టాన్ని తీసుకురావడానికి ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టనుంది. ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష సభ్యులు సమర్పించిన చట్టబద్ధ తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. పార్లమెంట్ సమావేశాలు లేని సమయంలో అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా చట్టాలను అమలు చేయవచ్చు. అయితే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తర్వాత ఆ ఆర్డినెన్స్‌ను ఆరు వారాల (42 రోజుల) లోపు ఉభయ సభలు ఆమోదించి చట్టంగా మార్చాలి. లేకపోతే ఆ ఆర్డినెన్స్ స్వయంచాలకంగా రద్దవుతుంది. ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటికే సుప్రీం కోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించారు. ప్రతిపాదిత బిల్లు రాజ్యాంగ సవరణకు సంబంధించినది కాకపోవడంతో, దీనిని ఆమోదించడానికి సాధారణ మెజారిటీ చాలు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను కాలానుగుణంగా పెంచుతూ వస్తున్నారు. 1956లో మొదట ఈ సంఖ్య ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి 10గా ఉండేది. అనంతరం 1960, 1977, 1986, 2009, 2019లో వరుసగా పెంచారు. ప్రస్తుతం పెండింగ్ కేసుల సంఖ్య అధికంగా ఉండటం, వేగంగా న్యాయ సేవలు అందించాల్సిన అవసరం పెరగడం వల్ల మరోసారి న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలని ప్రధాన న్యాయమూర్తి సిఫారసు చేయగా, కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు చర్యలు చేపట్టింది.



## లైంగిక నేరాల విచారణలో శారీరక చర్య ఒక్కటే ప్రమాణం కాదు

ఎన్‌సిడబ్ల్యూ ఛైర్‌పర్సన్ విజయా రాహత్కర్

**న్యూఢిల్లీ:** లైంగిక నేరాలకు సంబంధించిన కేసులను విచారించే సమయంలో కేవలం శారీరక చర్యను మాత్రమే ప్రమాణంగా తీసుకోకుండా, బాధితురాలి గౌరవం, ఆమె సమ్మతి, సంఘటన వల్ల కలిగిన భయం, మానసిక వేదన వంటి అంశాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యూ) ఛైర్‌పర్సన్ విజయా రాహత్కర్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ లక్ష్యం చట్టంలోని సాంకేతిక అంశాలకే పరిమితం కాకుండా, బాధితురాలికి న్యాయం జరిగిన అనుభూతిని కలిగించేలా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. పాట్నా హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఒక తీర్పుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియా కథనాల ప్రకారం, ఒక మహిళ సల్వార్‌ను తొలగించేందుకు ప్రయత్నించడం, ఆమె ఛాతిని బలవంతంగా నొక్కడం వంటి చర్యలు అత్యాచార యత్నం కిందకు రావని హైకోర్టు పేర్కొంది. ఈ వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా విజయా రాహత్కర్ మాట్లాడుతూ, న్యాయస్థానాలు చట్టం, సమర్పించిన సాక్ష్యాధారాల ఆధారంగానే తీర్పులు ఇస్తాయనడంలో సందేహం లేదని చెప్పారు. అయితే 18 సంవత్సరాల పాటు సాగిన న్యాయపోరాటం అనంతరం కూడా బాధితురాలికి సంపూర్ణ న్యాయం జరిగిందనే భావన కలగకపోతే, అలాగే తీవ్రమైన లైంగిక నేరాలకు పాల్పడిన వారికి తగిన శిక్ష పడకపోతే, అది మహిళల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల గౌరవం, శారీరక స్వాతంత్ర్యం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణే న్యాయవ్యవస్థ అత్యున్నత ప్రాధాన్యంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అవలంబించిన బాధిత కేంద్రిత, సున్నితమైన దృక్పథాన్ని ఆమె స్వాగతించారు. ఇదిలా ఉండగా, పాట్నా హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి తీర్పులు వెలువరించే ముందు సమగ్ర న్యాయ పరిశోధన జరగాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై సమగ్ర ఉత్తర్వులు జారీ చేస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మహిళల గౌరవం, హక్కులను పరిరక్షించే దిశగా న్యాయవ్యవస్థ మరింత సున్నితమైన, లింగ న్యాయానికి అనుగుణమైన విధానాన్ని అవలంబిస్తుందనే విశ్వాసాన్ని విజయా రాహత్కర్ వ్యక్తం చేశారు.

## ప్రత్యేక ఖైదీల విడుదలపై విధివిధానాలు రూపొందించాలి

**న్యూఢిల్లీ:** వృద్ధాప్యంలో ఉన్న లేదా ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీల ముందస్తు విడుదల లేదా శిక్ష తగ్గింపునకు సంబంధించి మూడు నెలల్లో సమగ్ర విధానాన్ని రూపొందించాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఇలాంటి ప్రత్యేక ఖైదీల విడుదలకు స్పష్టమైన విధానం ఉండాలని పేర్కొంటూ, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. కొత్త విధానంలో విడుదలకు అర్హత ప్రమాణాలు, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను స్పష్టంగా పేర్కొనడంతో పాటు, 'ప్రాణాంతక వ్యాధి' అనే పదానికి దేశవ్యాప్తంగా ఒకే విధమైన నిర్వచనం ఉండాలని కోర్టు సూచించింది. ఈ విధానాన్ని రూపొందించే సమయంలో రాష్ట్ర న్యాయ సేవల సంస్థలతో సంప్రదింపులు జరపాలని, దరఖాస్తుల పరిశీలన, నిర్ణయం తీసుకునే ప్రక్రియ పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించింది. ఈ వ్యవస్థ అమలుకు అవసరమైన సాంకేతిక సహాయం, డిజిటల్ మౌలిక వసతులు, శిక్షణను రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అందించాలని కోర్టు పేర్కొంది. అలాగే ఆరు నెలల్లో తమ ఆదేశాల అమలుపై కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. 70 ఏళ్లు దాటిన ఖైదీలు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీల విడుదలకు మార్గదర్శకాలు జారీ చేయాలని జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నాల్సా) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. భారత జైళ్లలో సామర్థ్యానికి మించి ఖైదీలు ఉండటంతో వృద్ధులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖైదీలకు తగిన వైద్య సంరక్షణ అందించడం కష్టమవుతోందని నాల్సా తన పిటిషన్‌లో పేర్కొంది. 2022 చివరి నాటికి దేశంలోని జైళ్ల ఆక్యుపెన్సీ రేటు 131 శాతానికి చేరిందని కూడా నాల్సా కోర్టు దృష్టికి తీసుకొచ్చింది.

# ‘క్లిష్ట దశ’ లోకి వాంగ్‌చుక్ దీక్ష




19 రోజులకు చేరిక...
9 కిలోలకు తగ్గిన శరీరబరువు
ఆయన అవయవాలపై ప్రభావం చూపుతుం-దని వైద్యులు హెచ్చరిక

**న్యూఢిల్లీ :** ఉద్యమకారుడు, హక్కుల కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి విషమిస్తున్నప్పటికీ కేంద్రం 'నిమ్మకు నీరెత్తినట్లు'గా వ్యవహరిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో ఆయన చేస్తున్న నిరాహారదీక్ష గురువారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. 9 కిలోల మేరకు సోనం వాంగ్‌చుక్ బరువు తగ్గడం ఆయన పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆయన సుదీర్ఘ నిరాహారదీక్ష క్లిష్ట దశలోకి ప్రవేశించారని, ఇది ఆయన అవయాలపై ప్రభావం చూపడం ప్రారంభించవచ్చని వైద్యులు హెచ్చరించారు. బుధవారం రాత్రి ఆలస్యంగా విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో రాజకీయ నాయకులు, మద్దతుదారులు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ తన నిరాహారదీక్షను విరమించబోనని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. ఆయన స్పష్టం చేసిన కొన్ని గంటల తర్వాత ఈ ఆరోగ్య సమాచారం వెలువడింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకుండా దీక్షను విరమించడం తప్పుడు సంకేతాన్ని పంపుతుందని ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు. తనకు విజ్ఞప్తులు చేయడానికి బదులుగా కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఈనెల 20న ప్రతిపాదించిన 'పార్లమెంట్ మార్చ్'ను బలోపేతం చేయాలని వాంగ్‌చుక్ ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆయన ఆందోళనకు మద్దతు వెల్లువెత్తుతూనే ఉంది. కాగా రైతు నాయకుడు రాకేశ్ టికాయత్ గురువారం సాయంత్రం జంతర్ మంతర్ వద్ద సోనం వాంగ్‌చుక్‌ను కలుస్తానని ప్రకటించారు. సంగీత స్వరకర్త విశాల్ దద్లానీ, నటుడు సాయజీ షిండే, రచయిత్రి శోభా డే తదితరులు కూడా ఉద్యమకారుడు, హక్కుల కార్యకర్త సోనం వాంగ్‌చుక్‌తో చర్చలు జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అతని క్షీణిస్తున్న ఆరోగ్యం పట్ల ఆందోళన వ్యక్తంచేశారు. ఇదిలాఉండగా, ‘ఏ పౌరుడి ప్రాణమైనా అమూల్యమైనదే’ అని పేర్కొంటూ, వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని ప్రతీరోజూ పర్యవేక్షించాలని, అవసరమైనప్పుడు వైద్య సహాయం అందించాలని ఢిల్లీ హైకోర్టు గురువారం అధికారులను ఆదేశించింది. క్రమం తప్పని వైద్య పర్యవేక్షణకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలు కోర్టుకు తెలిపాయి. డాక్టర్ సతీష్ లాంబా జారీ చేసిన వైద్య బులెటిన్ ప్రకారం..సోనం వాంగ్‌చుక్ తన నిరాహారదీక్ష ప్రారంభించినప్పటి నుంచి 9 కిలోలకు పైగా బరువు తగ్గారు. వాంగ్‌చుక్ రక్తంలో చక్కెర స్థాయి 80ఎంజి/డిఎల్‌గా నాడి నిమిషానికి 72గా నమోదైంది. పడుకున్నప్పుడు రక్తపోటు 105/61ఎంఎం హెచ్‌జిగా, కూర్చున్నప్పుడు 101/65 ఎంఎం హెచ్‌జిగా ఉన్నది. సోనం వాంగ్‌చుక్ శరీరంలోని నీటి శాతం బాగానే ఉందని, మానసికంగా చురుకుగా ఉన్నాడని వైద్యులు ప్రకటించారు.అయితే, వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్షలో క్లిష్ట దశలోకి ప్రవేశించారని లాంబా హెచ్చరించారు. గ్లూకోజ్ నిల్వలు అయిపోయిన తర్వాత శరీరం కొవ్వును వినియోగించుకుంటుంది. ఆ తర్వాత కండరాలు క్షీణించడం మొదలవుతుందని, అతని కీటోన్ స్థాయి 3 ప్లస్‌గా ఉండేదని, హైడ్రేషన్ మెరుగుపర్చిన తర్వాత అది 2 ప్లస్‌కు తగ్గిందని, యాసిడ్ ఎక్కువైన సంకేతం ఇది కండరాలు క్షీణిస్తున్నాయన్న విషయాన్ని సూచిస్తుందని డాక్టర్ సతీష్ లాంబా హెచ్చరించారు తర్వాత దశ ఆందోళనకరంగా ఉండవచ్చని, అవయవాలు ప్రభావితం కావచ్చని, మేం ఆయనను 24/7 నిఘాలో ఉంచుతున్నామని, అయితే అది ఆ దశకు చేరుకోదని తాము ఆశిస్తున్నామని లాంబా వివరించారు. అయితే, అతను ఒక అమూల్యమైన పౌరుడు కాబట్టి వీలైనంత త్వరగా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని తాను కోరుతున్నానని, వైద్యులుగా మేం అతనిని కోల్పోవాలని అనుకోవడంలేదని, అవయవాలు దెబ్బతింటే అది మాకు నిజంగా ఆందోళన కలిగిస్తోందని డాక్టర్ సతీష్ లాంబా చెప్పారు.

**వాంగ్‌చుక్ ఆరోగ్యపరిస్థితి విషమంపై ఎంపి కపిల్ సిబల్ ఆందోళన**

హక్కుల కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యపరిస్థితి విషమంపై ప్రముఖ న్యాయవాది, రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ గురువారం ఆందోళన వ్యక్తంచేశారు. వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని ‘ప్రజావ్యతిరేక ప్రభుత్వం’ అని అభివర్ణిస్తూ, అటువంటి ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే హక్కులేదని సిబల్ మండిపడ్డారు.

**దీక్ష ముగించాలని వాంగ్‌చుక్‌కు కేంద్రం విజ్ఞప్తి చేయడం సబబు : సిఎం ఒమర్ అబ్దుల్లా**

రాజకీయాల్లో కూడా మానవత్వానికి, కరుణకు కొంత చోటు ఉండాలి కాబట్టి ఆయన తన నిరాహార దీక్షను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసి ఉండాల్సిందని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమించడంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

**జీవితం అమూల్యమైనది...**

**సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని పరిరక్షించండి : ఢిల్లీ హైకోర్ట్**

వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని ప్రతీరోజూ పర్యవేక్షించాలని, అవసరమైతే వైద్య సహాయం అందించాలని ఢిల్లీ హైకోర్ట్ గురువారం అధికారులను ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి డికె.ఉపాధ్యాయ, జస్టిస్ తేజాస్ కరియాతో కూడిన ధర్మాసనం ప్రాణం అమూల్యమైనదని, సోనం వాంగ్‌చుక్ పరిస్థితిని ప్రభుత్వ వైద్యులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేసింది.

# హిందూ మహాసముద్రంలో 530మంది గల్లంతు

## రెండు రోహింగ్యా పడవలు బోల్తా
## యుఎన్‌హెచ్‌ఆర్‌–ఐఒఎం తీవ్ర ఆందోళన



**నైపిడావ్ :** మయన్మార్ తీర ప్రాంతం నుండి బయలు దేరిన రెండు పడవలు ప్రతికూల వాతావరణం కారణంగా అండమాన్ సముద్రంలో అదృశ్యమయ్యాయి. సుమారు 530 మందిపైగా రోహింగ్యాలు వలసవెళుతున్న సమయంలో ఈ రెండు పడవలు బోల్తా పడి ఉంటాయని,వారంతా విశాల సముద్రంలో గల్లంతయ్యారని ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మెజార్టీ రోహింగ్యాలతోపాటు ఇతరులు కూడా ఈ పడవల్లో ఉండే అవకాశం ఉంది. మయన్మార్ రఖైన్ రాష్ట్ర సముద్ర తీరం నుండి జూన్ నెలలో ఈ పడవలు బయలు దేరాయి. మయన్మార్ తీరంలో ఈ పడవలు బోల్తా పడి ప్రయాణికులు అదృశ్యమయ్యారని, వారంతా సజీవంగా ఉండే అవకాశం లేదని యుఎన్‌హెచ్‌సిఆర్ (శరణార్థుల వ్యవహారాలు చూస్తే ఐక్యరాజ్యసమితి హైకమిషనర్) ఐఒఎం (అంతర్జాతీయ శరణార్థుల సంస్థ) అధికారులు ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఐతే వీరంతా మరణించారని సాక్ష్యాధారాలతో ఇప్పటివరకూ ఎవరూ ధృవీకరించలేదు. ఐతే ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఈ సముద్రమార్గంలో ఎలాంటి రక్షణలు లేని అనధికార పడవల ప్రయాణాలు, మానవ అక్రమ రవాణాసంస్థలు,కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవడంతో పాటు,గాలింపు చర్యలు చేపట్టగల నెట్‌వర్క్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని యుఎన్‌హెచ్‌సిఆర్,ఐఓలు సూచించాయి.

మయన్మార్‌లో హింసను తప్పించుకోవడంకోసవ వీరంతా ప్రాణాలకు తెగించి పడవల్లో అక్కడి నుండి పారిపోయే సాహసాలు చేస్తున్నారు. యుఎన్‌హెచ్‌సిఆర్–ఐఓఎం చెప్పిన సమాచారం ప్రకారం 250 మంది రోహింగ్యాలు ప్రయాణం చేస్తున్న మొదటి పడవ బయలుదేరిన కొద్దిసేపటికే బాహ్యప్రపంచంతో సంబంధాలు కోల్పోయింది. 280 మందితో బయలుదేరిన రెండో పడవ జులై 8వ తేదీన ఐరావతి తీర ప్రాంతంలో మునిగిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు.

మయన్మార్ రఖైన్ రాష్ట్రంలో తరతరాలుగా తలదాచుకుంటున్న రోహింగ్యా ముస్లిం ప్రజ( అరకాన్ ఇండియన్స్)లకు ప్రస్తుతం ఏ దేశ పౌరసత్వమూ లేదు. వారందరినీ ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం శరణార్థులుగా పరిగణించింది. మయన్మార్‌లో ప్రస్తుతం ప్రజాస్వామ్యబద్ధ ప్రభుత్వంగా చెలామణీ అవుతున్న జుంటా పాలకులు 2021లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోసి అధికారంలోకి వచ్చినప్పటినుండీ చెలరేగిన అంతర్యుద్ధం కారణంగా ఆ దేశంలో అనూహ్యంగా హింస, మానవహక్కుల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయి. సంఘర్షణలు నివారించే 'యాక్‌లెడ్' సంస్థ సమాచారం ప్రకారం దాదాపు 1,00,000 మంది ఈ సంఘర్షణల్లో మరణించారు. మయన్మార్ ప్రభుత్వ అండతో దశాబ్దాలుగా జాతి నిర్మూలన తరహాలో రోహింగ్యాలపై వేధింపులు కొనసాగుతున్నాయి.

ఈ హింసాత్మక చర్యల నుండి దూరంగా పారిపోయేందుకు రోహింగ్యాలు ప్రాణాలకు తెగించి సముద్రంలో చిన్న చిన్న పడవలలో వెళ్ళిపోతు తరచు ప్రమాదాలకు గురై మరణిస్తున్న ఘటనలు ఇటీవల అనేకం జరుగుతున్నాయి.

హ్యూమన్‌రైట్స్ వాచ్ సమాచారంప్రకారం 10 లక్షల మంది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు పారిపోయారు. కాక్స్ బజార్ నగర శివారు ప్రాంతంలో గుడారాలలో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోయినాగానీ వారంతా మురికివాడలలో దుర్భరజీవితం గడుపుతున్నారు. కానీ ఇప్పటికీ 6.30 లక్షలమంది రోహింగ్యాలు తమ మాతృభూమిగా మమకారం పెంచుకున్న మయన్మార్ రఖైన్ రాష్ట్రాన్ని వదిలివెళ్ళలేక అక్కడే జీవిస్తున్నారు.

# ఉక్రేన్ రక్షణమంత్రి తొలగింపు

**పోటెత్తిన ప్రజా నిరసన : సాయుధ దళాల్లో అసమ్మతి**



**కీవ్:** ఉక్రేన్ ప్రజాదరణ పొందిన రక్షణ మంత్రి మైఖైలో ఫెడోరోవ్‌ను అధ్యక్షుడు జెలెన్స్కీ ఆకస్మికంగా పదవీచ్యుతుణ్ణి చేయడంతో దేశవ్యాప్తంగా ప్రజానిరసన పొటెత్తింది. వేలాదిమంది ప్రజలు మైఖైలో ఫెడోరోవ్ (35)కు మద్దతుగా వీధుల్లోకి వచ్చారు. ఆయనను తిరిగి పదవిలో నియమించాలని ఉక్రేన్ వ్యాప్తంగా అనేక నగరాలలో ప్రజలు నినాదాలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. జెలెన్స్కీ తన పదవికాలంలో చేసిన అతిపెద్ద తప్పిదం మైఖైలో ఫెడోరోవ్‌ను తొలగించడమేనని సాధారణ సైనికులు విమర్శిస్తున్నారు. ఈ తొలగింపు చర్య సాయుధ దళాల్లో తీవ్ర అసమ్మతిని రేకెత్తించింది. ఈ ఏడాది జనవరి 14వ తేదీన రక్షణమంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న మైఖైలో ఫెడోరోవ్ కేవలం ఆరునెలల తక్కువ సమయంలోనే ప్రజాదరణ పొందారు. రష్యాకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో ఉక్రేన్ సాయుధ బలగాలను కొత్త మార్గంలో నడిపించారు. సాంకేతికత అభివృద్ధి,నియామకాల విషయంలో వినూత్న విధానం అమలు చేశారు.శరవేగంగా శక్తిమంతమైన డ్రోన్లు,క్షిపణులను తయారు చేయించారు. రష్యా లోలోపలకు వెళ్ళి, 2700 కి.మీ దూరంలో ఉన్న చమురు రిఫైనరీలను లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేశారు. దీంతో రష్యాలో చమురు సంక్షోభం తలెత్తింది. అప్పటివరకూ యుద్ధంలో చతికిలబడి ఉన్న ఉక్రేన్ పైచేయి సాధించేలా చర్యలు తీసుకోవడంలో మైఖైలో ఫెడోరోవ్ చైసిన చొరవ దేశ ప్రజలను ఆకర్షించింది. ప్రజలు ఆయనపై అతి తక్కువ సమయంలో తీవ్ర అభిమానం పెంచుకున్నారు. ఆయనున ఆకస్మికంగా పదవి నుండి తొలగించడంతో ప్రజాగ్రహం పెల్లుబికింది. ఉక్రేన్ ప్రధానమంత్రి యూలియా స్విరిడెంకో రాజీనామాను ఆ దేశ పార్లమెంటు ఆమోదించిన రెండు రోజులకే వార్ క్యాబినెట్‌ను ప్రక్షాళన చేసి కొత్త రక్తం ఎక్కించేందుకు జెలెన్స్కీ పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపట్టారు.

# బ్రెజిల్‌పై 25 శాతం ట్రంప్ సుంకం

## అమెరికా వైఖరికి లులా డసిల్వా ఖండన

**వాషింగ్టన్ :** బ్రెజిల్ నుండి అమెరికాకు దిగుమతయ్యే ఎంపిక చేసిన వస్తువులపై 25 శాతం కొత్త సుంకాలను డోనాల్డ్ ట్రంప్ విధించారు.ఈనెల 22వ తేదీ నుండి ఈ కొత్త సుంకాలు అమలులోకి వస్తాయి. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా తీవ్రంగా వ్యతిరేకించారు.కాఫీ,గొడ్డు మాంసం, నారింజ పండ్లు,నారింజ రసం మినహా అమెరికాకు బ్రెజిల్ నుండి వచ్చే వస్తువులపై ఈ సుంకాలభారం విధించారు. బ్రెజిల్ అన్యాపూరితమైన వాణిజ్య పద్ధతులకు పాల్పడుతోందని ట్రంప్ విమర్శించారు. తాము అలాంటి అన్యాయ పద్ధతులకు పాల్పడలేదని లులా డసిల్వా వివరణ ఇచ్చారు. రాబోయే అక్టోబరులో బ్రెజిల్‌లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో కుమారుడు ఫ్లావియో బోల్సొనారో లులా డసిల్వాకు వ్యతిరేకంగా పోటీకి సిద్ధమతున్నారు.ఇటీవల ఫ్లావియో బోల్సొనారో అమెరికాలో పర్యటించారు. ఇప్పుడు ట్రంప్ భారీస్థాయిలో బ్రెజిల్‌పై 25 శాతం సుంకాలు పెంచడంపై ఫ్లావియో బోల్సొనారోను లులా డసిల్వా తీవ్రంగా తప్పుపట్టారు. వాస్తవానికి బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో ట్రంప్‌కు ప్రియ మిత్రుడు. 2022 ఎన్నికల తీర్పును తారుమారు చేసేందుకు ప్రయత్నం చేసిన బోల్సొనారోపై లులా డసిల్వా విచారణ చేపట్టినందుకు ఆగ్రహించిన ట్రంప్ ఆ వంకతో బ్రెజిల్‌పై చాలా అత్యధికంగా 50 శాతం దిగుమతి సుంకాలు విధించారు.

# చైనా పట్ల పెరిగిన సానుకూలత

## ట్రంప్ వచ్చాక దిగజారిన అమెరికా
## ప్యూ రీసెర్చ్ నివేదిక వెల్లడి

**వాషింగ్టన్ :** ప్రపంచంలోని అనేక దేశాలు, ప్రభుత్వాలు ఇప్పుడు అమెరికాకు బదులుగా చైనా వైపే మొగ్గు చూపుతున్నాయని 'ప్యూ రీసెర్చ్ సెంటర్' అధ్యయనం పేర్కొంది. అనేక దేశాలలో చైనాపట్ల సానుకూల అభిప్రాయం రికార్డు స్థాయికి చేరుకుంది. డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా పరిస్థితి అంతర్గతంగా, విదేశీ విధానంలో కూడా అభాసుపాలై విశ్వసనీయత కోల్పోయింది. 36 దేశాలలో ఎంపిక చేసిన 42,000 మంది అభిప్రాయాలను పలు కోణాలలో వేదిక సేకరించింది. ఈ 36 దేశాలలో 25 దేశాలకు చెందిన వారు చైనాపట్ల ఎక్కువ సానుకూల దృక్పధాన్ని ప్రదర్శించారు. 2002 నుండి ప్రపంచ అగ్రరాజ్యాలపట్ల ప్రజల అభిప్రాయాలను ఈ కేంద్రం సేకరిస్తోంది. కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమంది చైనావైపు సానుకూల దృక్పథంతో ఉన్నారని, సర్వే పరిశోధనల్లో ఇలాంటి ఫలితాలు నమోదు చేయడం ఇదే మొదటిసారి అనీ ఈ అధ్యయన పరిశోధకులలో ఒకరైన జోనాథన్ షల్మాన్ చెప్పారు. సాధారణ మధ్యాదాయ వర్గాలు ఎక్కువగా ఉండే దేశాలలో చైనా పట్ల గణనీయ సానుకూలత ఉండగా, సంపన్నదేశాలలో ప్రతికూల అభిప్రాయాలు ఉన్నాయని చెప్పారు. ఐతే ఈ విషయంలో సింగపూర్‌కు పూర్తి మినహాయింపు ఉంది. అత్యధిక తలసరి జిడిపి ఉన్న సింగపూర్‌లో చైనాపట్ల గణనీయమైన సానుకూలత ఉంది. 90 శాతం పాకిస్థానీయులు చైనాకు అనుకూలంగా ఉండగా, జపనీయుల్లో 11 శాతం మాత్రమే అనుకూలంగా ఉన్నారు. గతంలో అంటే 2008 లో జార్జిబుష్ పరిపాలనాకాలం ముగింపులో 2017లో ట్రంప్ పాలనాప్రారంభంలో కూడా అమెరికాపట్ల సానుకూలత క్షీణించడాన్ని ప్యూ రీసెర్చ్ సెంటర్ గుర్తించింది. ఈసారి తాజా సర్వేలో ఇటలీ,స్పెయిన్,మెక్సికో,కొలంబియా, ఇండోనేసియా,మలేసియా,నైజీరియా,టర్కీ వంటి దేశాలలో చైనాపట్ల సానుకూల ధోరణి రికార్డుస్థాయిలో పెరిగింది. ట్రంప్‌కు అత్యధికంగా ఫిలిప్పీన్స్ నుండి 68 శాతం సానుకూలత లభించగా,వెస్ట్‌బ్యాంక్,తూర్పు జెరూసలెంల నుండి కేవలం నాలుగుశాతం మాత్రమే సానుకూలత వచ్చింది. అమెరికా వాషింగ్టన్ డి.సి కేంద్రంగా పనిచేసే ప్యూ రీసెర్చ్ సెంటర్ నిష్పక్షపాతవైఖరిగల బుద్ధిజీవుల వేదిక. దీనిని 'యదార్థ బుద్ధిజీవుల వేదిక'గా కూడా పిలుస్తారు. అమెరికా సహా ప్రపంచాన్ని రూపుదిద్దే సామాజిక సమస్యలు,ప్రజాభిప్రాయం, జనాభా సమస్యలను అధ్యయనం,పరిశోధన,ప్రజాభిప్రాయసేకరణల ద్వారా ప్రపంచం ముందు ఉంచుతుంది.దీని కొత్త నివేదిక ప్రకారం అనేక దేశాలలో ప్రభుత్వాలకు చైనాపట్ల సానుకూల వైఖరి గణనీయంగా అభివృద్ధి చెందగా,అమెరికాపట్ల విశ్వాసం క్షీణించింది.సాధారణ ప్రతిస్పందనలలో డోనాల్డ్ ట్రంప్–జీ జిన్‌పింగ్ లకు సమాన స్కోరు లభించింది. కానీ అమెరికాలో మానవహక్కుల స్వేచ్ఛ గణనీయంగా ఉన్నప్పటికీ



అమెరికా కంటే చైనా ప్రపంచ దేశాల స్వేచ్ఛకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని, దేశాల అంతర్గత వ్యవహారాలలో చైనా అంత తొందరగా జోక్యం చేసుకోదని నివేదిక పేర్కొంది.ఈ అధ్యయనంలో సగటున 75 శాతం మంది అమెరికా ఇతరదేశాల్లో జోక్యం చేసుకుంటోందని అభిప్రాయం వ్యక్తం చేయగా 45 శాతం మంది మాత్రమే చైనాపట్ల అదే అభిప్రాయం వ్యక్తం చేశారు.గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ చెప్పడం ప్రారంభించిన తర్వాత, వెనిజులా మాజీ నేత నికొలస్ మదురో దంపతులను కిడ్నాప్‌చేసి అమెరికాకు తరలించిన తర్వాత ప్యూ రీసెర్చ్ సెంటర్ ఈ అధ్యయనం చేపట్టింది.

# బోనాలు షురూ

(మొదటి పేజీ తరువాయి)



చాలా మహిమ గలదని అని చెప్పారు. రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుండాలనే సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు కేటాయించిందన్నారు. తెలంగాణను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బోనాలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఈబోనాలకు ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఉందన్నారు. బోనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు, శాసన సభ్యులు దానం నాగేందర్, నవీన్‌యాదవ్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్,దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, అడిషనల్ సిపి తప్సీర్ ఇక్బాల్, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**హెచ్ఎండిఎ గ్రౌండ్స్‌లో బోనాల సామాగ్రి విక్రయాలు : 15 రోజుల పాటు మేళా**

అంతరించిపోతున్న సంప్రదాయ కుల వృత్తులకు పునర్జీవం పోసేందుకు, వృత్తిదారులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో కుల వృత్తుల మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్ఎండిఎ గ్రౌండ్స్‌లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుల వృత్తుల మేళాను ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ కుల వృత్తిదారులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ మేళాలో 60 స్టాళ్లు ఏర్పాటు చేయగా, ఇవి 15 రోజుల పాటు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మేళాలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌ను మంత్రి పరిశీలించి, కుల వృత్తిదారులను ప్రోత్సహించారు. బోనాల సందర్భంగా మట్టి కుండల వినియోగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో మంత్రి స్వయంగా మట్టి దీపాలను తయారు చేశారు. పూసర్ల కులానికి చెందిన కళాకారులు అందించిన గాజుల బుట్టను ఎత్తుకుని సందర్శకులను ఆకట్టుకున్నారు. పూసర్ల స్టాల్‌లో పూసల దండలను కొనుగోలు చేసి ఎమ్మెల్యేల సతీమణులకు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. బోనాల పండుగకు అవసరమైన మట్టి కుండలు, పూజా సామాగ్రితో పాటు వివిధ కుల వృత్తులకు చెందిన ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులో ఉన్నాయని, హైదరాబాద్ ప్రజలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఈ మేళాను సందర్శించి కొనుగోళ్లు చేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయాదేవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఈర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరువు పరిస్థితులు

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎంసి ఎన్నికలు, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చర్యలు తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది. మరో వైపు సీతమ్మ సాగర్, హైదరాబాద్ మెట్రో రైల్, ట్రిపుల్ ఆర్‌తో పాటు పలు ప్రజా ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలనా అంశాలు, ప్రభుత్వ శాఖల వారీగా పనితీరు, పెండింగ్ సమస్యలు, బోనాల పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరగనున్నట్లు సమాచారం.

# జాప్యంపై వివరణ ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ లోని సుచిత్రకొంపల్లి మధ్య జాతీయ రహదారి44పై ఎలివేటెడ కారిడార్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివరణ ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ ప్రాజెక్టు ఆలస్యాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. న్యాయస్థానం తదుపరి విచారణకు కేసును వాయిదా వేసింది.

# సిపిఐకి సంపూర్ణ అర్హత

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలన్న సిపిఐ డిమాండ్‌పై ప్రధాన భాగస్వామిపక్షం సిపిఐ(ఎం) తన సమ్మతిని ఇంకా తెలియజేయాల్సి ఉంది.

ఈ విషయం గురించి న్యూఢిల్లీలో గురువారం పాత్రికేయులు డి.రాజాను ప్రశ్నించినప్పుడు ఆయన పైవిధంగా స్పందించారు. ఈ పదవిని సిపిఐ కోరుతోందన్నారు.''మా పార్టీ వైపు నుండి ఇది న్యాయబద్ధమైన డిమాండ్,ఎందుకంటే మా పార్టీ ఎల్‌డిఎఫ్‌లో ముఖ్యమైన మిత్రపక్షంగా ఉంది. ప్రస్తుతం ఎల్‌డిఎఫ్ ప్రతిపక్షంలో ఉంది, కాబట్టి ప్రతిపక్షంలో ఉప నాయకుడి పదవి స్వీకరించడం ద్వారా మా పార్టీ శాసనసభ వేదికపై మరింత క్రియాశీలమైన పాత్ర పోషించాలని కోరుకుంటోంది, ఐతే ఈ చర్చలు ప్రస్తుతం ఇప్పటికీ ఇంకా రాష్ట్రస్థాయిలో కొనసాగుతున్నాయి'' అన్నారు. కాగా, ప్రతిపక్ష ఉపనాయకుడి పదవి ఒక ముగిసిన అధ్యాయం అని కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించిన కొద్ది రోజులకే డి.రాజా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రతిపక్ష ఉపనాయకుడి పదవి ఇచ్చేందుకు సిపిఐ(ఎం) అయిష్టంగా ఉందని వార్తలు వచ్చాయన్న ప్రశ్నకు డి.రాజా సమాధానమిస్తూ, రెండుపార్టీలకు వారి వారి సొంత వైఖరులు ఉంటాయని, అందువల్ల చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ''ఒక స్వంతంత్ర పార్టీగా వారికి ఒక అభిప్రాయం ఉంటుంది, ఒక స్వతంత్ర పార్టీగా మాకున్న వైఖరి మాకు ఉంటుంది, చర్చలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి, ఈ పదవిపై సంప్రదింపులు జరుగుతున్నాయి,వేచిచూద్దాం'' అన్నారు.

ఇదిలా ఉండగా సిపిఐ శాసనసభ్యుడు పి.ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ, పార్టీ చేస్తున్న డిమాండ్ ఎంతో సమర్థనీయమైనదని, పార్టీ ఈ పదవిని పొందడం ఎంతో అత్యావశ్యకమని అన్నారు. ''సిపిఐ ఒక అత్యావశ్యకమైన,సమర్థనీయమైన డిమాండ్‌ను ముందుకు తీసుకువచ్చింది, ఎల్‌డిఎఫ్ వేదికపై సిపిఐ ఏనాడూ సమర్థనీయం కాని, అన్యాయపూరితమైన,అనావశ్యకమైన విషయాలను ప్రస్తావించలేదు'' అన్నారు. ఇది పూర్తిగా అత్యావశ్యకం,అత్యంత సమర్థనీయం అనే ఒక దృఢవిశ్వాసంతోనే కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనాయకుడి పదవిని సిపిఐ కోరుతోంది, ఒదువల్ల సంప్రదింపుల ద్వారా దీనిపై నిర్ణయాన్ని తాము ఆశిస్తున్నాం'' అని ప్రసాద్ చెప్పారు.



# విరమించాలని అడగొద్దు...

(మొదటి పేజీ తరువాయి)

మారుతుంది'అని ఆయన ప్రశ్నించారు.దానికి బదులుగా పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు రాజకీయ శాస్త్రం, ప్రజాస్వామ్యంలో ఒక నిజమైన పాఠంలో పాల్గొనాలని చెబుతూ, జులై 20న కాక్‌రోచ్ జనతా పార్టీ ప్రతిపాదించిన పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేసేందుకు వేలాదిగా తరలిరావాలని సోనం వాంగ్‌చుక్ ప్రజలకు పిలుపునిచ్చారు.

తన నిరాహారదీక్షలో 18వ రోజైన బుధవారం రాత్రి పొద్దుపోయాక పంచుకున్న ఒక వీడియో సందేశంలో వాంగ్‌చుక్ మాట్లాడుతూ తన నిరాహారదీక్షను విరమించమని కోరుతూ తనకు వేలాది మంది ప్రజల నుంచి మెస్సేజెస్ వచ్చాయని, చాలామంది సీనియర్ రాజకీయ నాయకులు తన వద్దకు వచ్చి ప్రేమతో, ఆందోళనతో మాట్లాడారని, కొందరు నన్ను భోజనం తినేలా ఆదేశాలు జారీ చేయాలని కూడా కోర్టును కూడా ఆశ్రయించారని వాంగ్‌చుక్ వివరించారు. తన ఆరోగ్యంపై ఆందోళనలను తగ్గించే ప్రయత్నంలో ఇప్పటివరకూ నిర్వహించిన వైద్య పరీక్షలలో ఎటువంటి తక్షణ ప్రమాదం ఉన్నట్లు సూచన రాలేదని సోనం వాంగ్‌చుక్ తెలియజేశారు. తన పరిస్థితి రెండు, నాలుగురోజుల్లో చనిపోయేంత తీవ్రంగా లేదని, చాలా వైద్య పరీక్షలే జరిగాయని, 18 రోజుల నిరాహార దీక్ష ఫలితాలు చాలా సాధారణంగా ఉన్నాయని, ఇసిజి కూడా తీశారని, అది కూడా అంత చెడ్డగా ఏమీ లేదని, నేను ఇంకా చాలా రోజులు కొనసాగించగలనని వాంగ్‌చుక్ వివరించారు.

**దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిపిఐ ఎంపి**

న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థి–యువజన నిరసన కార్యక్రమాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి, ఎంపి పి. సందోష్ కుమార్ గురువారం సందర్శించారు. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లకు సిపిఐ తన సంఘీభావాన్ని ప్రకటించిందని, ధర్మేంద్ర ప్రధాన్ దేశ భవిష్యత్తును దెబ్బతీశారు, ఆయన పదవి నుంచి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్ చుక్, నేహా, అమీన్, మనీష్ వంటి కార్యకర్తలను సందోష్ కుమార్ కలుసుకుని, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి దృఢ సంకల్పాన్ని అభినందించారు.

# రివ్యూ పిటిషన్ డిస్మిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కారుణ్య నియామకానికి సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కొత్త అంశాలతో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం చెల్లదని పేర్కొంటూ జస్టిస్ సూరేపల్లి నంద ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. తల్లి మరణంతో కారుణ్య నియామకం కోరిన పి. కవిత అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని గతంలో హైకోర్టు ఆదేశించినప్పటికీ వాటర్ బోర్డు రివ్యూ కోరింది. అదే సమయంలో కోర్టు ఆదేశాలను అమలు చేయలేదంటూ కవిత ధిక్కరణ పిటిషన్ కూడా దాఖలు చేశారు. రివ్యూ అనేది అప్పీలుకు ప్రత్యామ్నాయం కాదని, రికార్డులో స్పష్టమైన తప్పు ఉన్నప్పుడే దాఖలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్న న్యాయస్థానం రివ్యూను తిరస్కరించింది. పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి కారుణ్య నియామకంపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ ధిక్కరణ పిటిషన్‌ను ముగించింది.

# నిలదీస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును మరోసారి ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఏప్రిల్‌లో ఈ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, ఇప్పుడు మళ్లీ అదే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్ బిల్లుతో పాటు తీవ్రమైన నేరాల్లో 30 రోజులకుపైగా జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును కూడా కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని జైరాం రమేశ్ తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ఐక్యతను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని ఆయన చెప్పారు. అదే విధంగా, 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు', విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం2013లో ప్రతిపాదిత మార్పులను కూడా కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి 'గరీబ్ కల్యాణ్ అన్న యోజన'కు ఆధారమైన ఆహార భద్రత చట్టంలో మార్పులు పేదల ప్రయోజనాలను దెబ్బతీసే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందించిన మల్లికార్జున ఖర్గే, రామాలయ విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, ప్రభుత్వ సంస్థల స్వతంత్రత కోల్పోవడం, రాజకీయ పార్టీల చీలికలు, అవినీతి ఆరోపణలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నిర్మూలన, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోదీ ప్రభుత్వాన్ని జవాబుదారిగా నిలబెడతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, వర్షాకాల సమావేశాలకు ముందు ప్రతిపక్ష 'ఇండియా కూటమి' సోమవారం సమావేశమై ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేయనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై అభిప్రాయాలు తెలుసుకోనుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20న ప్రారంభమై ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది.

# కుదేలవుతున్న కుటుంబాలు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించిన ఆయన, సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలవాలని అధికారులకు సూచించారు. డిజిపి సైబర్ ల్యాబ్‌లు, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఓసి), డిజిటల్ ఫోరెన్సిక్ విభాగం, సోషల్ మీడియా యూనిట్ తదితర విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సైబర్ నేరాల ధోరణులు, దర్యాప్తు విధానాలు, ఏఐ వినియోగంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ ఆధారిత సైబర్ కాల్ సెంటర్ పనితీరును పరిశీలించిన డిజిపి, బాధితుల నుంచి సమాచారం సేకరించి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆటోమేటిక్‌గా చేరవేసే వ్యవస్థను అభినందించారు.

**సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల నష్టం..**

ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు ఇటువంటి సేవలను విస్తరించాలని సూచించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం 2025లో రాష్ట్రంలో సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం నమోదైనా, గత ఏడాదితో పోలిస్తే నష్టాలు 20 శాతం తగ్గాయన్నారు. దేశవ్యాప్తంగా నమోదైన 49,620 సైబర్ ఎఫ్ఐఆర్‌లలో 21,639 కేసులు తెలంగాణలోనే నమోదవడం గమనార్హమని అధికారులు పేర్కొన్నారు. రూ.75 లక్షలకు పైగా నష్టం జరిగిన కేసుల్లో 78 శాతం, రూ.1 లక్షకు పైగా నష్టం జరిగిన కేసుల్లో 56 శాతం ఎఫ్ఐఆర్ కన్వర్షన్ రేటు నమోదైందన్నారు.

2025లో నమోదైన 86,177 ప్రధాన నేరాల ఎఫ్ఐఆర్‌లలో 21,639 సైబర్ నేరాలకు సంబంధించినవేనని, ఇతర ప్రధాన నేరాల వల్ల రూ.207 కోట్ల నష్టం జరిగితే సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల నష్టం సంభవించిందని వివరించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్ లైన్ లేదా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని, ఓటిపిలు, పాస్‌వర్డ్లు, బ్యాంకు వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### ఇంగ్లండ్‌ను చిత్తు చేసి వరుసగా రెండోసారి

# ఫైనల్‌కు దూసుకెళ్లిన అర్జెంటీనా

## సెమీస్‌లో 2–1తో విజయం

అద్భుతమైన ఆటతీరుతో ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్‌లోకి అర్జెంటీనా దూసుకెళ్లింది. అట్లాంటా వేదిక జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై 2–1 తేడాతో చిరస్మరణీయమైన విజయాన్ని అందుకొని ఈనెల 20న స్పెయిన్‌తో జరిగే ఫైనల్ పోరుకు సిద్ధమైంది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఫస్ట్ ఆఫ్‌లో అర్జెంటీనా కెప్టెన్ మెస్సీని ఇంగ్లండ్ డిఫెండర్లు సమర్ధవంతంగా అడ్డుకున్నారు. మ్యాచ్ 55వ నిమిషంలో ఇంగ్లాండ్ ఆటగాడు ఆంథోనీ గోర్డాన్ అద్భుత గోల్‌తో జట్టుకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. అర్జెంటీనా ఓటమి అంచుల్లో నిలిచిన దశ నుంచి ఊహించని రీతిలో పుంజుకుంది. ఇందులో కెప్టెన్ మెస్సీ పాత్ర కీలకంగా మారింది. మ్యాచ్ ముగియడానికి కేవలం ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉన్న దశలో అర్జెంటీనా ఆట స్వరూపాన్నే మార్చేసింది. 85వ నిమిషంలో మిడ్ ఫీల్డర్ ఎంజో ఫెర్నాండెజ్ డి బాక్స్ –లాంగ్ రేంజ్



షాట్‌తో బంతిని గోల్ పోస్టులోకి పంపాడు. దీంతో స్కోరు 1–1తో సమమైంది. ఇక 92వ నిమిషంలో (ఇంజ్యూరీ టైమ్) లియోనెల్ మెస్సీ అద్భుతమే చేశాడు. మెస్సీ అందించిన క్లాసిక్ క్రాస్‌ను సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ లౌటారో మార్టినెజ్ హెడర్ ద్వారా గోల్‌గా మలిచి అర్జెంటీనాకు 2–1తో తిరుగులేని విజయాన్ని అందించాడు. దీంతో ఫిఫా వరల్ కప్‌లో మెస్సీ సేన వరుసగా రెండోసారి క్వాలిఫై అయింది. కాగా, ఈ మ్యాచ్‌లో ఓడిన ఇంగ్లండ్ 19న ఫ్రాన్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో మూడో స్థానం కోసం పోటీ పడనున్నది.

# క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన పివి సింధు!

భారత స్టార్ షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో సరికొత్త రికార్డు సృష్టించింది. టోక్యో వేదికగా జరిగిన మహిళ సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ అయిన చైనా క్రీడాకారిణి హాన్ యూను వరుస గేమ్లలో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ఘనంగా ప్రవేశించింది. ప్రస్తుత సీజన్‌లో ఇదే సింధు అత్యుత్తమ ప్రదర్శన. రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 10వ ర్యాంకర్ అయిన సింధు.. తనకంటే ఉన్నత ర్యాంకులో ఉన్న చైనా షట్లర్‌ను కేవలం 35నిమిషాల్లోనే 21–16, 21–14 తేడాతో ఓడించింది. మ్యాచ్ ప్రారంభంలో పీవీ సింధు కాస్త నెమ్మదిగా ఆడినప్పటికీ.. మొదటి గేమ్ మధ్యలోకి వచ్చేసరికి పూర్తి ఫామ్ అందుకుంది. కోర్టులో చురుగ్గా కదులుతూ అద్భుతమైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో తొలి గేమ్‌ను 21–16తో కైవసం చేసుకుంది. ఇక రెండో గేమ్‌లో కూడా సింధు విజృంభించింది. ఏకపక్షంగాసాగిన ఈగేమ్‌లో ప్రారంభంలోనే 8–0తో భారీ ఆధిక్యం సాధించి.. చివరకు 21–14తో



మ్యాచ్‌ను ఈజీగా ముగించింది. ఈ విజయంతో హాన్ యూపై సింధు తన ముఖాముఖి రికార్డును 8–1కి మెరుగుపరుచుకుంది. ఈ గెలుపుతో మంచి ఊపుమీదున్న 31ఏళ్ల సింధు క్వార్టర్ ఫైనల్స్లో జపాన్ క్రీడాకారిని నొజోమీ ఒకుహారాతో తలపడనుంది. నిజానికి రెండో రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ అయిన దక్షిణ కొరియా స్టార్ ప్లేయర్ ఆన్ సే యంగ్ వైదొలగడంతో ఒకహారాకు వాకోవర్ లభించింది. దాంతో ఆమె నేరుగా క్వార్టర్స్ చేరింది. సింధు, ఒకుహారాల మధ్య గతంలో అనేక ఉత్కంఠభరితమైన పోరాటాలు జరిగాయి. కాబట్టి ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా ఆసక్తికరంగా మారనుంది. ప్రస్తుతం జపాన్ ఓపెన్ టోర్నమెంట్లో భారత్ తరపున సింధు ఒక్కతే నిలిచింది. ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో తనిషా క్రాస్టో, ధ్రువ్ కపిల మిక్స్‌డ్ డబుల్స్ జోడీ నిష్క్రమించడంతో ఇప్పుడు టోర్నమెంట్‌లో సింధు ఒక్కతే మిగిలిన భారత క్రీడాకారిణిగా నిలిచింది. తనిషా, ధ్రువల భారత జోడీ, టాప్ సీడెడ్ చైనా జోడీ అయిన ఫెంగ్ యాన్ జె, హువాంగ్ డాంగ్ పింగ్ల చేతిలో 47 నిమిషాల్లో 20–22, 17–21 తేడాతో ఓడిపోయింది. ఇప్పుడు భారత ఆశలు సింధుపైనే ఉన్నాయి.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

# మనదేశంలో మొదటి రైల్వే లైన్ ఏ సంవత్సరంలో వేశారు?

- 'కరారా' పాలరాయి ఉత్పత్తి చేస్తున్న దేశం
  ఇటలీ
- ఇందిర జలప్రభను ప్రారంభించిన తేదీ
  అక్టోబర్ 2
- చంబల్ ప్రాజెక్టు గల రాష్ట్రం ఏది?
  మధ్యప్రదేశ్
- ఆధునిక యుగారంభము
  క్రీ.శ. 1300
- రాజారాంమోహనరాయ్ ఎక్కడ మరణించారు
  బ్రిస్టల్
- రాష్ట్రీయమాధ్యమిక శిక్షా అభియాన్ ఎవరి ప్రతిపాదిత పథకం?
  కేంద్ర ప్రభుత్వం
- ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించిన తేది
  1945, అక్టోబర్ 24
- సున్నపురాయి అధికంగా లభించే రాష్ట్రం
  తమిళనాడు
- పరమాణు కేంద్రకాన్ని కనుక్కున్నది ఎవరు?
  రూథర్‌ఫర్డ్
- రాజ్యాంగ సభకు మొదటిసారిగా ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?
  1946 జులై
- రేడియోధార్మికతను కనుక్కున్నది ఎవరు?
  బెకరల్
- 86వ రాజ్యాంగ సవరణచట్టం(2002) ద్వారా రాజ్యాంగంలో చేర్చిన నూతన ఆర్టికల్ ఏది?
  21A
- 'ద్విదళబీజ' మొక్క
  కొబ్బరి
- గోదావరి నదిపై ఆనకట్ట కట్టారు
  ధవళేశ్వరం
- విద్యుదయస్కాంతం దేనితో తయారుచేస్తారు?
  మెత్తని ఇనుము
- శేషాచలం కొండలను ఏ పేరుతో పిలుస్తారు
  తిరుపతి కొండలు
- ప్రపంచంలో కర్ర గుజ్జు, న్యూస్ ప్రింటులను అత్యధికంగా ఉత్పత్తి చేయు దేశం ఏది?
  కెనడా
- మానవుని నోటిలో కత్తెర పళ్ళ సంఖ్య
  8
- మొట్టమొదటి నూలు మిల్లు ఎక్కడ స్థాపించారు?
  ముంబాయి
- హైదరాలీ ఏ ప్రాంత పాలకుడు?
  మైసూరు
- బాలగంగాధర తిలక్‌కు మిత్రుడు:
  లాన్స్ బరీ
- జియామేస్ అనేది ఏ ధాన్యపు శాస్త్రీయ నామము?
  మొక్కజొన్న
- పంజాబ్ రాష్ట్రంలో నీటిపారుదల వసతిని కల్గిస్తున్న నది:
  బియాస్
- రాగి, బంగారం నిక్షేపాలు ఎక్కువ కలవు
  రాకీపర్వతాల్లో
- మొదటి ప్రపంచ యుద్ధారంభం :
  1914
- లక్షదీవుల రాజధాని
  కవరత్తి
- అంధత్వం ఏ విటమిన్ లోపం వలన ఏర్పడుతుంది?
  'A' విటమిన్
- మనదేశంలో మొదటి రైల్వే లైను ఏ సంవత్సరంలో వేయబడినది?
  1853
- ప్రపంచంలో 'పుట్టగూళ్ళ పెంపకంలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
  భారత్
- రెడ్ షర్ట్ (ఎర్రచొక్కా) దళాన్ని ఏర్పాటు చేసినది ఎవరు?
  గారిబాల్డి



- అనిబిసెంటు ఈ దేశస్థురాలు?
  ఐర్లాండు
- బాలకార్మిక వ్యవస్థను నిషేధించిన ఆర్టికల్ ఏది?
  24
- 'Queen of Quit India' గా పేరుపొందిన మహిళ?
  అరుణా అసిఫ్ అలీ
- వెట్టిచాకిరి, పడుపు వృత్తిని రాజ్యాంగం నిషేధించినట్లు ఏ ఆర్టికల్ తెలియజేస్తుంది?
  23
- మింటో మార్లే సంస్కరణలు?
  1909
- చేప నుండి మానవుడి వరకు....వర్గానికి చెందుతారు.
  ఆక్రా
- ఆఫ్రికా ఖండంలో ఓడరేవు
  కార్డేటా
- భూమిపైన గల నీటిలో.... శాతం సముద్రాలలో కలదు.
  97
- ఫ్రెంచివారి ప్రముఖ వర్తక స్థావరం ఏది?
  పుదుచ్చేరి
- నైలునది వరప్రసాదం
  ఈజిప్టు
- ఇందిర జలప్రభకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ ఎంత?
  రూ.1800 కోట్లు
- బులంద్ దర్వాజాను నిర్మించింది ఎవరు?
  అక్బర్
- ఒక గ్రాము పిండి పదార్థాముల నుండి లభించు శక్తి:
  4 కేలరీలు
- ఇందులో ఏది ప్రాంతీయ పార్టీ?
  అకాలీదళ్
- డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు జన్మస్థలము :
  భీమవరం
- 'ఇక్రిసాట్' గల ప్రాంతం
  హైదరాబాద్
- మొక్కలు కిరణజన్య సంయోగక్రియను ఏ రంగు భాగములో జరుపుకొనును?
  ఆకుపచ్చ
- మనదేశంలో మొదటి రైల్వే లైను ఏ రెండు ప్రాంతాల మధ్య వేయబడినది?
  ముంబాయి థానే

### నిర్మించి సిద్ధంగా ఉన్న ఇండ్లను

# పేదలకు పంపిణీ చేయరెందుకు?

**సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్**

**తీగలగుట్టపల్లిలో పేదలతో ఇండ్ల ఆక్రమణకు సిపిఐ నేతల యత్నం, అడ్డుకున్న పోలీసులు**

**ప్రజాపక్షం/కరీంనగర్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన పేదలకు ఇవ్వడం లేదని విమర్శించిన కాంగ్రెస్, నిర్మించి సిద్ధంగా ఉన్న డబుల్‌బెడ్ రూం ఇండ్లను ఎందుకు పంపిణీ చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రశ్నించారు. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలో ప్రభుత్వం నిర్మించిన ఇండిపెండెంట్ డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల చుట్టూ ఉన్న చెట్లను తొలగించి, గడ్డిని, చెత్తను తీసివేసి, ఇండ్ల చుట్టూ చదును చేశారు. అర్హులైన పేదలకు ఇండ్లను పంపిణీ చేయాలని నినాదాలు చేశారు. ఇండ్లలోకి వెళుతున్న సిపిఐ నేతలను, పేదలను పోలీసులు అరెస్ట్ చేసి కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కలను నిజం చేయాలని తీగలగుట్టపల్లి ఇండిపెండెంట్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించారని, నిర్మించి ఏండ్లు గడుస్తున్నా పేదలకు మాత్రం కేటాయించడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు గడిచిన నేటికి పంపిణీ చేయకపోవడంలో ఆంతర్యం ఏముందో అర్థం కావడం లేదన్నారు. చింతకుంటలో నిర్మించిన ఇండ్లు నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా మారుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తీగలగుట్టపల్లి, చింతకుంటలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బీర్ల పద్మ, కొట్టె అంజలి, సిపిఐ శాఖ కార్యదర్శులు చెంచల మురళి, కసిబొజుల సంతోష్ చారి, కాల్వ శ్రీనివాస్ యాదవ్, అల్లేపు రాజు, ఓర్సు కొమురయ్య, నాయకులు మ్యాకల రమ్య, బీర్ల స్వాతి, రజిత, రమ, లక్ష్మీ, మల్లిక, ప్రియ తదితరులు పాల్గొన్నారు.





### సింగరేణికి గనులు రాకపోవడానికి

# కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణం

**డిమాండ్‌లను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపు నిస్తాం**

**గుర్తింపు సంఘం ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్**



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణికి కొత్త గనులు రాకపోవడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కారణమని గుర్తింపు సంఘం ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి5లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమాన్ని ఎఐటియుసి చేపట్టిందని, 2012లో అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి సేవ్ సింగరేణి పేరుతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించేందుకు కృషి చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించకుండా ప్రైవేటు సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణి నష్టపోతోందని ఆయన విమర్శించారు. సింగరేణిలో రాష్ట్రానికి 51%, కేంద్రానికి 49% వాటా ఉన్నప్పటికీ సంస్థను నిర్వీర్యం చేసే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను వేలంతో సంబంధం లేకుండా సింగరేణికే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు బాయి బాట, భరోసా యాత్ర పేరుతో సింగరేణిలో యాత్రలు చేయడం వల్ల కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎండిఆర్ చట్టంవల్లే సింగరేణికి బొగ్గు బ్లాకులు రావడం లేదని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం గుర్తించిన నాలుగు బొగ్గు బ్లాకులను బిజెపికి, బొగ్గు గనుల శాఖ మంత్రికి చిత్తశుద్ధి ఉంటే వేలంలో ఉన్న వాటిని తొలగించి, తాడిచర్ల బ్లాక్–2ను ఎలా అలాట్ చేశారో అదే విధంగా ఈ నాలుగు గనులను కూడా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో 31 డిమాండ్లతో యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వగా, ఇప్పటి వరకు రెండు విడతల చర్చలు జరిగాయన్నారు. సమ్మె నోటీసులో ప్రధాన డిమాండ్లు ఐన కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, 12వ వేతన సంఘం వెంటనే ఏర్పాటు చేయాలని, 4 లేబర్ కోడ్ల రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.56వేల కోట్ల బకాయిల విడుదల చేయాలని, కార్మికుల నుండి రికవరీ చేసిన ఆదాయపన్ను రీయింబర్స్మెంట్ మారు పేర్ల సమస్య పరిష్కారం, మెడికల్ బోర్డు కొనసాగింపు, సొంతింటి పథకం అమలుపై డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆగస్టు నెలలో ఇతర కార్మిక సంఘాలతో కలిసి సమ్మె చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో గుర్రం ప్రభుదాస్, ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, రంగు శ్రీను, మాదన మహేష్, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, ఎడవెల్లి రాజిరెడ్డి, సదయ్య, ఉదయభాను, రవీందర్, నర్మద, అంజన్న, మడ్డి కిరణ్, పాపన్న, పరుశురాం, శ్రీనివాస్, సురేష్, పర్లపెల్లి రామస్వామి పాల్గొన్నారు.

## పర్యవేక్షణా లోపంతోనే విద్యార్థి మృతి

**ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**

**ప్రిన్సిపాల్, పిఇటిని సస్పెండ్ చేయాలని డిమాండ్**

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మోడల్ స్కూల్‌లో సిబ్బంది పర్యవేక్షణా లోపంతోనే విద్యార్థి మృతిచెందాడని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ఆరోపించారు. రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్‌లో మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం జరగాలని ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేణుకుంట్ల ప్రీతం, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్, పిఇటిని వెంటనే సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెద్దపెల్లి ఆర్‌డిఓ గంగయ్య సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు గొడిసెల ప్రణీత్, పప్పు శ్రీకాంత్, దుర్గ అవినాష్, పవన్, నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన హక్కుల రక్షణే ధ్యేయం

**గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం**

**ప్రజాపక్షం/పాల్వంచ :** గిరిజన హక్కుల రక్షణే ధ్యేయంగా పాల్వంచ కేంద్రంగా ఈనెల 18, 19 తేదీలో రెండు రోజుల పాటు జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని మహాసభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయం చండ్రా రాజేశ్వరరావు భవన్‌లో బి.వెంకట్ అధ్యక్షతన గిరిజన సమాఖ్య ముఖ్యనాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈసందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు వసంతాలు దాటినా గిరిజన బతుకులు మారలేదన్నారు. నేటికీ హక్కుల కోసం పోరాటం చేయాల్సివస్తున్నదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాసి వేసేందుకు కుట్రలు చేస్తున్నదని, దానిలో భాగంగానే అటవీ సంపదను కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగార్‌తో నక్సలైట్లను తుదముట్టించిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న గిరిజన వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల వేదికగా గళమెత్తాలన్నారు. గిరిజన హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో చేపట్టబోయే ఉమ్మడి పోరాటాలకు మహాసభలు నాంది పలకాలని ఆకాంక్షించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమల్ని నిర్వహించాలన్నారు. 18, 19 తేదీలలో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య మహా సభల సందర్భంగా 18న నిర్వహించే మహా ప్రదర్శన, బహిరంగ సభకు గిరిజనులు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభను ముఖ్య అతిధులుగా అఖిల భారత ఆదివాసీ మహాసభ ఇన్‌చార్జి డి.అనిరాజా, అఖిల భారత ఆదివాసీ మహాసభ జాతీయ ప్రదాన కార్యదర్శి పశుపతి కోల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి. వెంకట్, ఆహ్వాన సంఘం కోశాధికారి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, శ్రీను, వైఎస్. గిరి, కొంగర అప్పారావు పాల్గొన్నారు.




## మహిళా సాధికారతతోనే సమాజ వికాసం

**మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన**

**ప్రజాపక్షం/మేళ్లచెరువు :** మహిళా సాధికారతతోనే సమాజ వికాసం సాధ్యమవుతుందని, మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. గురువారం మండల కేంద్రంలో భారత జాతీయ మహిళా సమాఖ్య మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారానికి మహిళా సమాఖ్య అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో మహిళలకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళ హక్కులు వారి సామాజిక వికాసంపై చర్చించడంతో పాటు నూతన మండల కమిటీల ఏర్పాటు ధ్యేయంగా సభ నిర్వహించారు. మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలుగా కంచర్ల సాంబ, ఉపాధ్యక్షురాలుగా నాగమణి, ప్రధాన కార్యదర్శిగా అల్లం రాజేశ్వరి, సహాయ కార్యదర్శిగా కామేశ్వరమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ గా జాన్వీలను నియమించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, ఐలాపురం లక్ష్మి తో పాటు మహిళ ప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# విద్యార్థులపై వివక్షకు శాశ్వతంగా అడ్డుకట్ట

**'రోహిత్ వేముల తెలంగాణ' బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలి: భట్టి**



ప్రజాపక్షం/హైదరాబాద్: ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులపైన జరిగే గుర్తింపు ఆధారిత వివక్షకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 'రోహిత్ వేముల తెలంగాణ' బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ బిల్లు ముసాయిదా నిమ్మితం అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ చట్టం రూపకల్పనలో ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్తామని, రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ప్రకటించారు.'రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు 2026' రూపకల్పనపై ఏర్పాడిన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి కీలక సమావేశం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యాసంస్థల్లో వివక్ష లేని ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు చట్టాన్ని అత్యంత పటిష్టంగా రూపొందిస్తున్నామని ప్రకటించారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు)లో జరిగిన రోహిత్ వేముల విషాద ఉదంతం కేవలం తెలంగాణకే కాకుండా దేశం మొత్తాన్ని కదిలించిందన్నారు. ఆనాడు వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటంలో ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా యూనివర్సిటీకి వచ్చి సంఘీభావం ప్రకటించారని గుర్తు చేశారు. ఆనాడు విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ఆనాటి టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా తాను, మంత్రి శ్రీధర్ బాబు, క్రియాశీలక నేత పొన్నం ప్రభాకర్ పెద్ద ఎత్తున పోరాటం చేశామన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో ఎటువంటి వివక్ష లేని విద్యా విధానాన్ని, చట్టాన్ని తీసుకొస్తామని హామీనిచ్చామని, అందులో భాగంగానే ఈ చట్టాన్ని తీసుకొస్తున్నామని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకాలని, వివక్ష కారణంగా ఎవ్వరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండకూడదన్న రాహుల్ గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాడిందన్నారు. కొత్త చట్టానికి సంబంధించిన సమగ్ర విధివిధానాలతో కూడిన ప్రాథమిక ముసాయిదా నివేదికను సిద్ధం చేయాలని సంబంధిత శాఖ కార్యదర్శిని భట్టి విక్రమార్క ఆదేశించారు. కర్నాటకలో ఇప్పటికే ఇటువంటి చట్టం కోసం జరుగుతున్న ముసాయిదా ప్రయత్నాలను పరిశీలించి, అక్కడి ఉత్తమ పద్ధతులను స్వీకరించాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు,విద్యార్థి అసోసియేషన్ల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నామని, ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి బిల్లులో తుది మార్పులు ఉంటాయని భట్టి స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, క్యాబినెట్ సబ్‌కమిటీ ఆమోదం పొందిన అనంతరం ఈ చారిత్రాత్మక బిల్లును త్వరలోనే రాష్ట్ర శాసనసభ (అసెంబ్లీ) ముందుకు తీసుకొస్తామన్నారు.

**న్యాయపర చిక్కులు రాకుండా పటిష్టంగా ఉండాలి**

ఈ చట్టానికి భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేలా సుప్రీంకోర్టు అడ్వకేట్, సామాజిక కార్యకర్త దిశా వాడేకర్ను ప్రత్యేక ఆహ్వానితురాలిగా పిలిపించి చర్చించామని భట్టి విక్రమార్క తెలిపారు. కొలంబియా లా స్కూల్ (న్యూయార్క్) నుండి ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేసిన ఆమె అనుభవం చట్టాన్ని అత్యంత సమగ్రంగా, లోపరహితంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

## హిందూ విద్యార్థులకు కల్మా నేర్పాల్సిన అవసరం లేదు

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్ : సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో రెండో తరగతి హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్‌ఫాతిహా నేర్చుకుని రావాలని హోమ్‌వర్క్ ఇవ్వడం తీవ్ర అభ్యంతరకరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. విద్యాసంస్థలు విద్యను బోధించాల్సిందే తప్ప, ఏ విద్యార్థిపైనా మతపరమైన అంశాలను బలవంతంగా రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రైవేట్ విద్యాసంస్థల్లో పాఠాల బోధనపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. ఇటీవల ఆర్మూరులో తల్లిదండ్రులకు తెలియకుండా హిందూ విద్యార్థులకు ఉర్దూ బోధించారని ఆరోపిస్తూ, దీనిని ప్రశ్నించిన ప్రజలపైనే అక్రమ కేసులు నమోదు చేశారని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మజ్లిస్ పార్టీ కలిసి హైదరాబాద్, తెలంగాణలో మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే పరిస్థితులను సృష్టిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు.ఎవరైనా విద్యాసంస్థలను వేదికగా చేసుకుని మతపరమైన ప్రభావం చూపేందుకు లేదా మతాంతరీకరణకు ప్రయత్నిస్తే సహించబోమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారు చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

## హిందూ సంస్కృతిపై దాడి సహించబోం

**కేంద్రమంత్రి బండి సంజయ్**

ప్రజాపక్షం/హైదరాబాద్ : భాగ్యనగరంలోని సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థి డైరీలో 'కల్మా, సూరహ్ ఫాతిహా' చదువుకురావాలని హోమ్‌వర్క్ రాయడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇది హిందూ సంస్కృతిపై జరుగుతున్న బలవంతపు దాడేనని అభివర్ణించారు. ఇలాంటి ఘటన జరుగుతున్నా సోకాల్డ్ సెక్యులర్ సంఘాలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. వివాదాస్పద హోమ్‌వర్క్ ఇచ్చిన స్కూల్ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆటో డ్రైవర్ భరత్‌ను వేధించిన పోలీసులు, మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## క్రీడలకు సంపూర్ణ ప్రోత్సాహం

**టిజి20 విజేతలకు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు**



ప్రజాపక్షం/హైదరాబాద్: క్రీడా రంగ అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టమైన కార్యాచరణ ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. టిజి20 లీగ్ విజేత హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టు గురువారం హైదరాబాద్ ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను సిఎం అభినందించి వారికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ తెలంగాణకు ప్రత్యేక క్రీడా విధానాన్ని తీసుకొచ్చామని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు బహుమతులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. గ్రామీణ క్రీడాకారులకు టిజి20 మంచి వేదికగా నిలుస్తోందని సిఎం పేర్కొన్నారు. దేశ ప్రతిష్ఠను పెంచే క్రీడాకారులుగా ఎదగాలని సిఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, ఈనాడు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డు ఏర్పాటు నిర్ణయం కార్మికుల విజయం

ప్రజాపక్షం/హైదరాబాద్: సింగరేణి సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం కార్మికుల విజయమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. వారసత్వ ఉద్యోగాలు సింగరేణి కార్మికుల చట్టబద్ధమైన హక్కు అని అన్నారు. ఇకపై ప్రతి నెలా తప్పని సరిగా మెడికల్ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలని గురువారం ఒక ప్రకటనలో కవిత పేర్కొన్నారు. హైదరాబాద్ నగర ప్రజల ఐక్యతకు చిహ్నమైన ఆషాఢ బోనాల ప్రారంభోత్సవం సందర్భంగా అందరికీ కవిత బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## మహారాష్ట్ర పోలీసుల స్టడీ విజిట్

**తెలంగాణ పోలీస్ అకాడమీ శిక్షణపై అధ్యయనం**

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ పోలీస్ అకాడమీలో అమలు చేస్తున్న శిక్షణా విధానాలను అధ్యయనం చేసేందుకు మహారాష్ట్ర పోలీస్ అకాడమీ (నాసిక్)కు చెందిన అధికారుల బృందం మూడు రోజుల స్టడీ విజిట్ కోసం గురువారం హైదరాబాద్‌లోని ఆర్‌బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించింది. డిఎస్‌పి సంతోష్ గాయకే నేతృత్వంలోని బృందం అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్‌ను కలిసింది. అధికారులు మార్నింగ్ పరేడ్, ఔట్‌డోర్ శిక్షణ, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, హ్యాంకిన్స్ మ్యూజియం, యూనిట్ ఆసుపత్రి, ఫైరింగ్ రేంజ్‌లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర శిక్షణా సదుపాయాలను పరిశీలించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో అమలవుతున్న ఆధునిక శిక్షణా విధానం, మౌలిక వసతులు, ట్రైనీల ఆరోగ్య భద్రతకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించిన మహారాష్ట్ర అధికారులు, ఇక్కడి ఉత్తమ పద్ధతులను తమ అకాడమీలో అమలు చేస్తామని తెలిపారు.

## బిఆర్‌ఎస్‌లో ప్రవీణ్‌కుమార్ 'డస్ట్‌బిన్‌లో కాగితం





ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యవహార శైలి ఆయన విద్యకు తగినట్లుగా లేదని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ విమర్శించారు. ఒక సోదరుడిగా సలహా ఇస్తున్నానని, ఇదే ధోరణిలో కొనసాగితే బిఆర్‌ఎస్‌లో 'డస్ట్‌బిన్‌లో పడేసే కాగితం'లా మారే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్, కెటిఆర్‌లు అవసరం తీరిన తర్వాత పలువురు నాయకులను పక్కన పెట్టిన చరిత్ర ఉందని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం చెప్పిన స్క్రిప్ట్‌ను చదవడం తప్ప విజ్ఞతతో మాట్లాడటం లేదని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. మీనాక్షికి ఒక న్యాయం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరో న్యాయం అన్నట్లుగా ఆర్‌ఎస్ ప్రవీణ్ వ్యాఖ్యలు ఉన్నాయని, రెండు ఓట్లు ఉన్నాయనే ఆరోపణలు చేయాలంటే పూర్తి ఆధారాలు ఉండాలని సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల అఫిడవిట్‌లో ఆదర్శనగర్‌లో ఓటు చూపించి, ఎంపి ఎన్నికల అఫిడవిట్‌లో అలంపూర్‌లో ఓటు చూపించారని, కుటుంబ సభ్యుల పేర్లపైనా రెండు ఓట్ల అంశం ఉందని ఆరోపించారు. అలాంటప్పుడు ముందుగా ఎవరిపై చర్యలు తీసుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు.

## మల్కాజిగిరిని హరిత నగరంగా తీర్చిదిద్దుదాం

**ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి**







ప్రజాపక్షం/హైదరాబాద్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి)ను పర్యావరణహితంగా, మరింత హరిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం వన మహోత్సవం, అర్బన్ బయోడైవర్సిటీ (యుబిడి) విభాగం పనితీరుపై ఆయన ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో గ్రీన్ కవర్ (పచ్చదనం) విస్తరణకు స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. 'కేవలం మొక్కలు నాటడంతోనే మన బాధ్యత ముగిసిపోదు. నాటిన ప్రతి మొక్కను రక్షించి, బతికించుకోవడం అత్యంత ముఖ్యం' అని స్పష్టం చేశారు. నగరంలోని ప్రతి డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలలో ప్రత్యేకంగా వన్ డే ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ విస్తృతంగా మొక్కలు నాటాలని కోరారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల వివరాలు, వాటి సంఖ్య, మనుగడపై ప్రత్యేక రికార్డులను నిర్వహించడంతో పాటు వీటన్నింటికీ విధిగా జియో టాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్లాంటర్ బాక్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

రహదారులు, పబ్లిక్ ప్రదేశాల్లోని ప్లాంటర్ బాక్సుల నిర్వహణను మెరుగుపరచాలని కమిషనర్ సూచించారు. ఎస్‌ఎఫ్‌ఏల సహకారంతో ఈ బాక్సులలో మొక్కలు పంపిణి చేసి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మొక్కలు నాటకుండా ఖాళీగా పడి ఉన్న ప్లాంటర్ బాక్సులను గుర్తించి, టౌన్ ప్లానింగ్ విభాగం సహకారంతో వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. అలాగే, నివాస సముదాయాల లోపల ఉండే టాట్లాట్ ప్రాంతాల్లో కనీసం 10 శాతం హరిత విస్తీర్ణం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే నాటిన మొక్కల సంరక్షణకు సంబంధించి ఎండిపోయిన మొక్కల స్థానంలో మొదటి ఏడాది 20 శాతం వరకు కొత్త మొక్కలను అంచనాల పరిధిలోనే భర్తీ చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అర్బన్ బయోడైవర్సిటీ డైరెక్టర్ సునంద, డిప్యూటీ డైరెక్టర్లు అన్నపూర్ణ, శ్రీధర్, సర్కిల్ మేనేజర్లు, సూపరింటెండెంట్ రామాంజనేయులు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు**

రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో అక్రమంగా నిర్మాణ వ్యర్థాలను (సి అండ్ డి వేస్ట్) వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి హెచ్చరించారు. బేగంపేట, ప్రకాశ్ నగర్ ప్రాంతాల్లో గురువారం ఆయన క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఫుట్‌పాత్‌లు, ఆక్రమణలు, చెత్త లేకుండా నిర్వహించాలని, వాణిజ్య సంస్థలు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. హోటళ్ల ఆహార వ్యర్థాలను అధీకృత సంస్థకే అప్పగించాలని సూచించారు. అక్రమంగా సి అండ్ డి వ్యర్థాలు పారబోసిన ఘటనలో సంబంధిత వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశి స్తూ, మౌలాలి– అమ్ముగూడలో సిసి కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూ చించారు. నిబంధనలు ఉల్లంఘించే భారీ జరిమానాలు, వాహనాల స్వాధీనం తప్పదని హెచ్చరించారు.

## ఘనంగా తొలి 'తెలంగాణ స్కిల్స్ డే' వేడుకలు

**రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 1,775 మంది విద్యార్థులకు ఉద్యోగాలు**

**ఆఫర్ లెటర్లు పంపిణీ చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి**







ప్రజాపక్షం/హైదరాబాద్: నైపుణ్యమే యువత జీవితాలను మార్చే అసలైన శక్తి అని, ప్రతి యువకుడికి నాణ్యమైన శిక్షణతో పాటు ఉద్యోగం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శక్తి రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (డిఇటి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కొమరం భీం ఆదివాసీ భవన్‌లో గురువారం నిర్వహించిన తొలి 'తెలంగాణ స్కిల్స్ డే' కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఉద్యోగాలు సాధించిన శిక్షణార్థులను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఎటిసి) విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. అలాగే విదేశీ ఉపాధి అవకాశాల కోసం ఎంపికైన 19 మంది ఫిజియోథెరపిస్టులకు ఆఫర్ లెటర్లను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 65 ప్రభుత్వ ఐటిఐల్లో 35 ట్రేడ్‌లలో 15,860 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ చర్యల ఫలితంగా హైదరాబాద్, ఉట్నూర్, వరంగల్, నిజామాబాద్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఏడు జాబ్‌మేళాల్లో 116 పరిశ్రమలు పాల్గొనగా, 2,572 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరై 1,775 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. విదేశీ ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం జర్మన్, జపనీస్‌తో పాటు ఇతర విదేశీ భాషల్లో శిక్షణ అందించేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని మంత్రి తెలిపారు.

**భవిష్యత్తులో ఇరాన్ అభివృద్ధిలో తెలంగాణ యువత కీలక పాత్ర**

రాష్ట్రంలో అత్యాధునిక నైపుణ్య శిక్షణ పొందిన యువత భవిష్యత్తులో ఇరాన్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ మోడల్‌పై ఇరాన్ ప్రతినిధి బృందం ప్రశంసలు కురిపించింది. సచివాలయంలో ఇరాన్ కార్మిక, సహకార, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అహ్మద్ మైదారి నేతృత్వంలోని బృందంతో గురువారం మంత్రి వివేక్ సమావేశమయ్యారు. తెలంగాణలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఎటిసిలు), టామ్‌కామ్ ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ అంతర్జాతీయ ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని వివరించారు. తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ విధానం, విదేశీ ఉపాధి అవకాశాలు, కార్మిక సంక్షేమ కార్యక్రమాలపై ఇరాన్ బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, శిక్షణ రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపింది. సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాసరి హరిచందన, ఇరాన్ రాయబారి తదితరులు పాల్గొన్నారు.

## సేఫ్ సిటీతో నగర భద్రత మరింత బలోపేతం

**మహిళల భద్రత, రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం: డిజిపి**





ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత సురక్షిత మహానగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సేఫ్ సిటీ ప్రాజెక్టు అమలును వేగవంతం చేయాలని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, పాదచారులు సహా ప్రతి పౌరుడికి భద్రత కల్పించే దిశగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. డిజిపి కార్యాలయం లో గురువారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సేఫ్ సిటీ ప్రాజె క్టు అమలుపై పోలీసు శాఖ, జిహెచ్‌ఎంసి, వివిధ ప్రభుత్వ శాఖల సీనియర్ అధికారులతో కలిసి డిజిపి సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు హైడెఫినిష న్ సిసి కెమెరాలు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటిఎంఎస్), ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్‌లు, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాలని ఆదేశించారు. సేఫ్ సిటీ ప్రాజెక్టు తొలి దశలో హైదరాబాద్ కమిషనరేట్‌లో 974, సైబరాబాద్‌లో 574, మల్కాజిగిరిలో 758 చొప్పున మొత్తం 2,306 సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పనిచేస్తున్నాయని అధికారులు వివరించారు. రెండో దశలో హైదరాబాద్‌లో 452, సైబరాబాద్‌లో 297, మల్కాజిగిరిలో 113 చొప్పున మొత్తం 862 అదనపు సిసి కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని తెలిపారు. రోడ్డు భద్రతపై సమీక్షలో భాగంగా నగరవ్యాప్తంగా 77 ప్రాంతాల్లో పాదచారుల ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సేఫ్ సిటీ కార్యక్రమాలు, మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నగరంలోని మొబైల్ ప్రచార వాహనాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

## యుకెకు ఎగుమతులు పెంచుతాం:మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: భారత్‌యునైటెడ్ కింగ్డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సిఇటిఎ)తో తెలంగాణకు గరి ష్ఠ ప్రయోజనం చేకూరేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సచివాలయంలో యుకె డిప్యూటీ ట్రేడ్ కమిషనర్ (దక్షిణాసియా) చంద్రు కె.అయ్యర్ నేతృత్వంలో ని ప్రతినిధి బృందంతో గురువారం సమావేశమైన మంత్రి, ఈ ఒప్పందం తో భారత్ నుంచి యుకెకు వెళ్లే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై సుం కాలు తొలగించబడటంతో ఎగుమతులకు భారీ ఊతం లభిస్తుందని చెప్పా రు. ప్రస్తుతం తెలంగాణ నుంచి యుకెకు రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు జరుగుతున్నాయని, సిఇటిఎ అమలుతో వాటిని గణనీయంగా పెంచే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏవియేషన్, డిఫెన్స్, ఐటీ, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అనుకూలమైన పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. దేశ ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం తెలంగాణ నుంచే జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. అలాగే ఎయిర్‌బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, ప్రాట్ అండ్ విట్నీ, డసో వంటి అంతర్జాతీయ ఏవియేషన్ సంస్థలకు సంబంధించిన విడిభాగాల తయారీ, నిర్వహణ కేంద్రాలు రాష్ట్రంలో ఉన్నాయని గుర్తుచేశారు. యుకెకు ఎగుమతి చేయగల ఉత్పత్తులపై స్థానిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించే సమావేశాలు నిర్వహించాలని పరిశ్రమల శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే యుకె మేయర్ల బృందం హైదరాబాద్‌ను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని యుకె ప్రతినిధులను కోరారు.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో సహకార రంగానిదే కీలక పాత్ర

**ఇరాన్ ప్రతినిధి బృందంతో మంత్రి తుమ్మల సమావేశం**



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతంలో సహకార రంగానిదే కీలక పాత్ర అని రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని మంత్రి ఇరాన్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందానికి మంత్రి వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,వివేక్ వెంకటస్వామిలు గురువారం సచివాలయంలో ఇరాన్ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరాన్ సహకార, కార్మిక, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెయిదారి, సహకార శాఖ ఉపమంత్రి డాక్టర్ సర్ఫీ, భారతదేశంలోని ఇరాన్ రాయబారి డాక్టర్ మహ్మద్ ఫత్ అలీ, హైదరాబాద్ ఇరాన్ కాన్సుల్ జనరల్ హమీద్ అహ్మదియెహ్, వైస్ కాన్సుల్ మొహ్సిన్ మొఘద్దామి, ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి హషెమీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) పనితీరు, సభ్యత్వ విస్తరణ, రైతులకు అందిస్తున్న సేవలు, సహకార రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతిని ఇరాన్ ప్రతినిధుల బృందానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. తెలంగాణలో అమలవుతున్న సహకార విధానాలు, సంస్థాగత సంస్కరణలు, సభ్యులకు అందిస్తున్న సేవలపై ఇరాన్ ప్రతినిధి బృందం ఆసక్తిగా విన్నారు. భవిష్యత్తులో సహకార రంగంలో పరస్పర అనుభవాల మార్పిడి, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలపై ఈ సందర్భంగా చర్చించుకున్నారు. సమావేశం అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి ఇరాన్ ప్రతినిధి బృంద సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## గురుకులాల్లో మెరుగైన వసతి, నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అడ్లూరి



ప్రజాపక్షం/హైదరాబాద్ : గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. గురువారం చైతన్యపురి మహిళా న్యాయ కళాశాల, ఇబ్రహీంపట్నం రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, సరూర్‌నగర్ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మూడు విద్యాసంస్థలు ఒకే ప్రాంగణంలో ఉండటంతో తాగునీటి సమస్య ఉందని విద్యార్థినులు చెప్పడంతో, వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన మంత్రి మిషన్ భగీరథ ద్వారా శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని, అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.హాస్టళ్లు, వంటశాల, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించిన మంత్రి, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించి గురుకులాలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు.ఈ తనిఖీల్లో టిజిఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి కంభంపాటి శారద, స్టేట్ ఆఫీసర్ నిర్మల, సరూర్‌నగర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రభ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆస్పత్రి ఔషధాల కొనుగోళ్లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : గాంధీ ఆస్పత్రిలో ఔషధాల కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో న్యాయ విచారణ జరిపించి, బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. గాంధీ ఆస్పత్రిలో రూ.7 కోట్ల విలువైన ఔషధాలకు రూ.13 కోట్ల బిల్లులు పెట్టినట్లు వస్తున్న ఆరోపణలు అత్యంత ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. ఈ ఆరోపణలు నిజమైతే అది ప్రజాధనాన్ని దోచుకోవడమే కాకుండా పేదల ప్రాణాలతో చెలగాటం ఆడినట్టేనని విమర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాల కొనుగోళ్లు తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎంఎస్ఐడిసి) ద్వారా పారదర్శక ఈటెండర్ విధానంలో జరగాల్సి ఉండగా, నిబంధనలను ఉల్లంఘించి అక్రమాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో గత ఐదేళ్లుగా జరిగిన ఔషధాల కొనుగోళ్లు, స్థానిక కొనుగోళ్లు, స్టాక్ నిర్వహణపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి నివేదికను బహిరంగంగా విడుదల చేయాలని కోరారు.ఈ వ్యవహారంలో ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర హెచ్చరించారు.

## ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బిఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు




కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు సూచించారు. గురువారం కలెక్టర్ శామీర్‌పేటలో అదనపు కలెక్టర్ బోయినపల్లి, ఫతేనగర్ ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు ఎన్యుమరేషన్ పత్రాలు ఓటర్లచే పూరించి తిరిగి వాటిని తీసుకొన్న వెంటవెంటనే డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఓటర్లకు ఫారాలు పూరించటంలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయటం ద్వారా వారికి పూర్తిగా సహకరించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయని అడిగి తెలుసుకొన్నారు.




## 250 మంది రక్తదానం..అనురాగ్ విశ్వవిద్యాలయం సేవా స్ఫూర్తి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** అనురాగ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్లు 2,3,4,6 ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జూబ్లీ హిల్స్ వైటల్ సహకారంతో గురువారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో చేపట్టిన భారీ రక్తదాన శిబిరంలో 250 మందికి పైగా విద్యార్థులు, వాలంటీర్లు , అధ్యాపకులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శిబిరాన్ని ఇంజినీరింగ్ పాఠశాల డీన్ డాక్టర్ వి.విజయ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ సి.మల్లేష్, చిన్న శ్రీనివాస్, పురుషోత్తం, సంతోష్ కుమార్, బాలకృష్ణ,జాతీయ కేడెట్ దళం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రక్తదానం ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని వక్తలు పేర్కొంటూ ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.సేకరించిన రక్తం అత్యవసర వైద్య సేవలు, అవసరమైన రోగులకు ఉపయోగపడనుండగా కార్యక్రమ నిర్వహణను లయన్స్ క్లబ్ వైద్య బృందం అభినందించింది.



## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కాంగ్రెస్ నేతల చేయూత : కర్రె రాజేష్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం 8వ డివిజన్ కొర్రెముల మక్తలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కాంగ్రెస్ నాయకులు కర్రె రాజేష్ ముందుకొచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో రంగుల పూత, బెంచీల ఏర్పాటుకు స్వచ్ఛందంగా సహకారం అందిస్తామని ప్రకటించారు. పోచారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ తన సొంత నిధులతో పాఠశాలకు ఎంత ఖర్చైనా రంగులపూత వేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే బాలజీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ్లగూడ నాగేష్ గౌడ్ విద్యార్థులు కూర్చోవడానికి అవసరమైనన్ని బెంచీలు సమకూరుస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కర్రె రాజేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న నేపథ్యంలో తామూ అదే స్ఫూర్తితో ముందుకొచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు కేశపావుల వినోద్ కుమార్, చౌదరిగూడ మాజీ వార్డు సభ్యురాలు బండ్లగూడ వాణి, ప్రధానోపాధ్యాయురాలు కానుగుల అఖిల, ఉపాధ్యాయురాలు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు షూస్ పంపిణీ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని పొన్నాల్ కౌన్సిలర్ మౌనిక శివవీర ప్రసాద్ విద్యార్థులకు ఉచితంగా షూస్ పంపిణి చేశా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యసభ్యసిం చే విద్యార్థులకు కావాల్సిన మౌళిక వసతులను కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి దేవేందర్‌రావు, 11వ వార్డు కౌన్సిలర్ రాజు, పాఠశాల చైర్మన్ అజయలక్ష్మి , నాయకులు రమేష్, రత్నం, భూపాల్, పాప్యయ్య, తదితరులు పాల్గొన్నారు.



## బిర్యానీ బాగాలేదని ప్రశ్నించిన యువకులపై దాడి!

**ప్రజాపక్షం/నవాబుపేట :** బిర్యానీ నాణ్యత బాగాలేదని ప్రశ్నించిన యువకుడిపై దాబా రెస్టారెంట్ నిర్వాహకులు దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నవాబుపేట మండలంలోని మైతాఫ్ ఖాన్ గూడ గ్రామంలో ఉన్న కనకదుర్గ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో బిర్యానీ నాణ్యతపై ప్రశ్నించిన ఇద్దరు యువకులపై దాడి జరిగిందని మండల ఎంఆర్ పీ ఎస్ సంఘం అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎల్లకొండ గ్రామానికి చెందిన పర్వేద కుమార్, అదే గ్రామానికి చెందిన గుల్లగూడ సుధాకర్ అనే యువకులు బుధవారం రాత్రి



మైతఫ్ ఖాన్ గూడ గ్రామంలో కనక దుర్గ ఫ్యామిలీ రెస్టారెంట్ దాబాలో తినడానికి వెళ్లి బిర్యానీ చల్లగా వుంది వేడిగా చేసి తీసుకుని రావాలని కోరారు. దీనితో ఇద్దరిమధ్య మాటమాట పెరగడంతో దాబా నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డిలు దాబాలో పనిచేస్తున్న తోటివారితో కలిసి యువకులపై దాడిచేశారని బాధితులు పర్వేద కుమార్, సుదర్శన్‌లు ఆరోపించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన ఎంఆర్పీఎస్ మండల నాయకులు, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సహా సంబంధిత చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయంకోసం పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ పక్కాగా సాగాలి

### ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)2026 ప్రక్రియ ను జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నియోజకవర్గంలోని చూడీ బజార్ దర్గా వద్ద గల పోలింగ్ కేంద్రాలు, జన్సీ చౌరస్తాలోని సమగ్ర భవన్ పోలింగ్ కేంద్రంలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్ల వద్దకు వెళ్లి నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్, ఓటర్ల మ్యాపింగ్, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కల్పిస్తున్న వసతులను కమిషనర్ క్షుణ్ణంగా సమీక్షించారు.

అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర ఎన్నికల సిబ్బందితో ఆయన స్వయంగా మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న తీరును, వేగాన్ని అడిగి తెలుసుకున్న ఆయన.. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పనులన్ని సక్రమంగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నమోదు ఫారాల ప్రాసెసింగ్ ప్రక్రియ ఎక్కడా తప్పులు లేకుండా, అత్యంత ఖచ్చితత్వంతో నిర్ణీత గడువులోగా పూర్తి కావాలన్నా రు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఓటర్ల నుంచి వచ్చే విజ్ఞప్తులు, సందేహాలను వెంటనే పరిష్కరించాలని, ఎస్ఐఆర్ 2026 పనులలో ఎలాంటి అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎన్నికల అధికారులను కమిషనర్ ఆదేశించారు.




## బస్టాండ్ ఏర్పాటు చేయాలని సిపిఐ ధర్నా

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్టలో శాశ్వత బస్టాండ్ ఏర్పాటు చేయాలని గురువారం డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. స్థానికంగా బస్టాండ్ లేకపోవడంతో ప్రతిరోజు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇతర ప్రాంతాల నుండి వచ్చే ఆర్టీసీ బస్సుల డ్రైవర్లకు హాల్ట్ సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి, భోజనం చేసేందుకు కనీస సౌకర్యాలు కూడా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రయాణికులకు సరైన బస్టాప్ లేకపోవడంతో ఎక్కడం, దిగడం సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పైప్‌లైన్ రోడ్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, అక్కడ ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించడంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏసురత్నం, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్, మహిళా సమాఖ్య నాయకులు హైమావతి, దీపిక, జగద్గిరిగుట్ట శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, నరసయ్య, ఇమాం భాయ్, రాజు, యునాయకుడు కీర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాంకీ డంపింగ్ యార్డును వెంటనే తరలించాలి

### సిపిఐ, ప్రజా సంఘాలు డిమాండ్

### కార్మికనగర్‌లో పాదయాత్ర

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డును ఇక్కడి నుండి వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ కార్మికనగర్ కాలనీలో గురువారం భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.వి. చలపతిరావు మాట్లాడుతూ, నిత్యం ప్రజా సంక్షేమం గురించి మాట్లాడే కాంగ్రెస్ ప్రభుత్వం, జవహర్ నగర్ బాధితులను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. కార్పొరేట్ శక్తుల ఆర్థిక ప్రయోజనాల కోసం వేలాది మంది ప్రజల ప్రాణాలను బలిపెట్టడం అత్యంత సిగ్గుచేటన్నారు. స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న రాంకీ యాజమాన్యం బెదిరింపులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



**ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యం: పోరాట కమిటీ**

ఈ సందర్భంగా డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్త వల్ల ఇక్కడి భూమి, నీరు, గాలి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ పద్ధతిలో వీటిని శుద్ధి చేసి, స్థానికులకు తగిన ఆరోగ్య భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ న్యాయమైన పోరాటంలో జవహర్ నగర్ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అలాగే, సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకుజూలై 26న నిర్వహించబోయే 'మేధావుల సదస్సు'ను పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆకట్టుకున్న ఉద్యమ గీతాలు: ఐఎఫ్టీయూ నేత పి. శివబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు ఆలపించిన విప్లవ, ఉద్యమ గీతాలు స్థానికులను ఎంతగానో ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు కారింగుల శంకర్ గౌడ్, ఆర్. నర్సింహ్మా గౌడ్, ప్రవీణ్, నరహరి తదితరులు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారు.



**రమణమూర్తిపై దాడి దుర్మార్గం : కాశపు రెడ్డిపై చర్యలకు డిమాండ్**

బిఆర్కేఎస్ న్యూస్ ఛానల్ లైవ్ డిబేట్‌లో పాల్గొన్న రమణమూర్తిపై ఆర్ఎస్ఎస్ నాయకుడు కాశపు రెడ్డి చేసిన దాడిని సిపిఐ, వివిధ ప్రజాసంఘాల నాయకులు తీవ్రస్థాయిలో ఖండించారు. ఈ దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ప్రగతి నగర్‌లోని నీలం రామచంద్రయ్య భవన్ వద్ద సిపిఐ మరియు వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఒక నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకు లు మాట్లాడుతూ, ఛానల్ లైవ్ ప్రసారంలో ఉండగానే భౌతిక దాడికి తెగబడటం కాశపు రెడ్డి అహంకారానికి, ఉన్మాదానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. బాధ్యుడిపై తక్షణమే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన ఖండన కార్యక్రమంలో పలు పార్టీల, కార్మిక, మహిళా సంఘాల ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తోటపల్లి శంకర్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ షావలి ఐఎఫ్టీయూ జాతీయ నాయకులు శివ బాబు, ఎఐఎఫ్‌టుయు చంద్రమౌళి, పిడిఎమ్, సదానందం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ప్రవీణ్ ఐఎఫ్టీయూ, నరసింహ గౌడ్ మాజీ ఉపసర్పంచ్, జయక్క చైతన్య మహిళా సమాఖ్య, మేక లలిత యాదవ్ మాజీ కార్పొరేటర్, లక్ష్మీబాయి పిఒ డబ్లు స్వరూప న్యూ డెమోక్రసీ వీరితో పాటు తదితర ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొ ని రమణమూర్తికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## సమాజ సేవకు కొత్త కార్యవర్గం బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్‌లో లయన్స్ క్లబ్ రెండో సంస్థాపన వేడుక నారాయణ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 2026–27 సంవత్సరానికి నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది.మాజీ జిల్లా గవర్నర్ కె.గోవిందరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొనగా రమేష్ లక్ష్మ ణ్ సంస్థాపన అధికారిగా, డాక్టర్ జైన రమేష్ ప్రమాణ స్వీకార అధికారిగా వ్యవహరించారు. రేసు లక్ష్మారెడ్డి అధ్యక్షుడుగా, బచ్చు నాగేష్ గుప్తా కార్యదర్శిగా, డాక్టర్ వేల్పుల రవి కుమార్ యాదవ్ కోశాధికారిగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సింగిరెడ్డి రామ్‌రెడ్డి, మాజీ బ్యాంక్ అధ్యక్షుడు సార శ్రీనివాస్ గౌడ్,బండారి శ్రీనివాస్ గౌడ్,మారం లక్ష్మారెడ్డి, డాక్టర్ మొలుగురం జంగయ్య,అల్లు కమలాకర్, బజాజ్, వేముల నాదం గౌడ్, సారా మురళి గౌడ్, అంబ సత్యనారాయణ యాదవ్, చందుపట్ల మహేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి,శారద,ప్రమోదు గుప్త, రాఘవేందర్, రామ్మోహన్, హిమబిందు, లక్మి, మాధవి,రవి, మమతాశర్మ,రాజ్ కుమార్,సంతోష్.బాల్ రాజ్,తదితరులు పాల్గొన్నారు.



## సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి : ఎస్‌పి స్నేహామెహ్రా

**ప్రజాపక్షం/వికారాబాద్ :** కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతం గా వినియోగించాలని జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు దిశానిర్దేశం చేసిన వికారాబాద్ జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, పోలీస్ కార్యాలయంలో జిల్లా స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు సిడిఆర్, ఐపిడిఆర్ ఐపిఐఆర్ టవర్ డంప్ అనాలిసిస్, ఇన్‌స్టాగ్రామ్ ఫేస్‌బుక్ ట్విట్టర్ వంటివాటిపై ఒక రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తు, సాంకేతిక ఆధారాలను వినియోగించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ప్రతి కేసులో డిజిటల్ సాక్ష్యాలను శాస్త్రీయపద్ధతిలో సేకరించి కోర్టులో బలమైన అభియోగపత్రాలు దాఖలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్, సిసిఎస్ సిఐబల్వంత్ రాయ్, ఐటిసెల్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## రామరాజ్ కాటన్ షాపింగ్ మాల్ ప్రారంభం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ పట్టణంలో నూతనంగా ఏర్పా టు చేసిన రామరాజ్ కాటన్ షాపింగ్ మాల్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ గురువారం ప్రారంభించా రు. ప్రభుత్వం చేపడుతున్న రహదార్ల విస్తరణతో మేడ్చల్ పట్టణం వ్యాపార కేంద్రంగా మారుతోందన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ్యాపారం నిర్వహించటం ద్వారానే వ్యాపారాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు వెంకటేష్, రంజిత్, రాఘవేందర్ గౌడ్, శివకుమార్, బాల్‌రెడ్డి, సత్యనారాయణ, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ యువతకు స్వయం ఉపాధి ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలో ఎస్టీ యువతీయువకులు స్వయం ఉపాధితో ఆర్థికంగా స్థిరపడేందుకు దోహదపడే విధంగా ట్రైకార్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో వివిధ రంగాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖాధికారి పద్మజ పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి నుండి డిగ్రీ వరకు ఏదైనా చదువు పూర్తయి 18 ఏళ్ల నుండి 35 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న ఆసక్తి గల యువతీ యువకులు తమ ఆధార్, కులం, విద్యార్హత ధృవీకరణ పత్రాలు, ఫొటోల తో దరఖాస్తు చేసుకోవాలని, ఏదైనా సందేహాలుంటే తమను 995915 9629 మొబైల్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. 82 రంగాల్లో ఈ శిక్షణ లభిస్తుందన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకు బిఎల్‌ఒ ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్/ధరూర్ :** వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ, మహిళా సంఘం సమావేశం, ఇందిరమ్మ మహిళాశక్తి కేంద్రం, తరిగోపులలో ప్రాథమిక పాఠశాలలను, ఆయిల్ ఫామ్ సాగు, వ్యయసాయ పంట పొలాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఎస్ఐఆర్‌లో భాగంగా ఇంటింటికి ఇచ్చిన ఎన్యూమురేషన్ ఫారాలను తప్పనిసరిగా తిరిగి తీసుకునే విధంగా బిఎల్ఒలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్యూమురేషన్ ఫారాలను పూరించడంలో ప్రజలకు సహకరించాలని అదేవిధంగా తండాలలోని ప్రజానీకాని కి సైతం ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించి పూర్తిస్థాయి లో ఎన్యూమరేషన్ ఫారాలను వెనక్కి తీసుకుని డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ అన్నారు. గ్రామాల్లో లేనివారు ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమురేషన్ ఫారాల ను సమర్పించాలి అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కలెక్టర్ తెలిపారు.

మహిళా సంఘం ఏర్పాటు చేసుకున్న సమావేశానికి కలెక్టర్ హాజరై మహిళలు బ్యాంకు రుణాలను సద్వియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. జాతీయకుటుంబ ప్రయోజన పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునే విధంగా డ్వాక్రా మహిళలు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకు ఏకరూప దుస్తులను సిద్ధం చేస్తున్న ఇందిర మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పంపిణీకి సిద్ధంగాఉన్న దుస్తులను పాఠశాలకు అందజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సకాలంలో వర్షాలు కురియని పక్షంలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు తెలిపారు. రైతు నేస్తం సమావేశాలు నిర్వహించి యూరియా డిఏపి లభ్యతపై ఎఇఒల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం తరిగోపుల ప్రాథమిక పాఠశాలను సందర్శించి గుణితాలు, గణితంలో విద్యార్థుల నైపుణ్యతను గుర్తించి కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. నాణ్యమైన విద్యా ప్రమాణాలతో బోధించడంతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయిల్‌ఫామ్ సాగు ను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.



ఆయిల్ ఫామ్ సాగుకు ఆసక్తి చూపే రైతులను గుర్తించి, ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ డిఆర్ఒ స్వర్ణలత డిహెచ్ఎస్ఒ సత్తర్, వ్యవసాయ అధికారి కవిత, తహసీల్దార్ సాజిదబేగం, ఎంపిడిఒ నరసింహులు, ఎంఇఒ, తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల మేరకుచేపట్టాలి:** గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని మండలాల తహసీల్దార్,మున్సిపల్ కమిషనర్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ఆగస్టు 3వరకు ఎన్నికల కమిషన్ పొడిగించినందున, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా కచ్చితత్వంతో నిర్వహించాలని కలెక్టర్ మండల తహసీల్దార్‌లను ఆదేశించా రు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయడం, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించడం మార్పులు చేర్పులు, సవరణలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. మండలాల వారీగా పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటచారి, స్వర్ణలత, ఆర్‌డిఒ వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**కంది, పెసర, చిరుధాన్యాలనుసాగుచేయండి**

**ధారూర్ :** వరి పంటకు బదులుగ కంది ,పెసర, చిరుధాన్యాలను సాగుచేయలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పేర్కొన్నారు. గురువారం ధారూర్ మండలంలో ఎలినో ప్రభావంతో వర్షాలు లేక ఎండుతున్న పంటలను జిల్లా వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. నీటిని తక్కువగా తీసుకునే పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. వర్షాభావంతో దెబ్బతింటున్న పంటలపై 2 శాతం యూరి యా, 1శాతం పోటాష్ నీటిలో కరిగే ఎరువులను పిచికారి చేయాలని సూచించారు.ప్రతి 3.6 మీటర్లకు ఒక డెడ్ ఫరో ఎర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సరిత, వికారాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశం, సందీప్ ఏఓ సూర్యప్రకాష్, ఎఇఒలు సంజురాథోడ్, విపుల్ తదితరులు పాల్గొన్నారు.

## సిసిటివి ఫుటేజిలతో దొంగల అరెస్ట్

**ప్రజాపక్షం/ఉప్పల్ :** సిసిటివి ఫుటేజిల ఆధారంగా చోరీ జరిగిన 24 గంటల వ్యవధిలోనే నాచారం పోలీసులు దొంగలను అరెస్టు చేయగలిగారు. నిందితులైన మౌలాలి లో నివసించే వాహనాలు వాషింగ్ చేస్తూ జీవనాలు గడిపే మౌలాలి నివాసి అరవింద్ (26), చిలుకానగర్ నివాసి పృథ్విరాజ్ (25)లు మంగళవారం అర్ధరాత్రి దాటే వరకు పీకల దాకా మద్యం సేవించి సుభాష్‌నగర్‌లోని రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఒక ఇంట్లో రూ. 30 వేల నగదు, మరో ఇంట్లో రెండు మొబైల్ ఫోన్లను చోరీ చేసారు. బాధితులందించిన ఫిర్యాదులతో డిఐ మాన్‌సింగ్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, రాహుల్, అశోక్‌లు సిసిటివి ఫుటేజిలను పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుండి రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

ప్రజాపక్షం
Telugu National Daily

మహబూబ్‌నగర్
శుక్రవారం
17-07-2026
www.prajapaksham.in

"రెబెల్ స్టార్ ప్రభాస్ మోస్ట్ ఎవెటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఫౌజీ'తో వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు."

రీల్



హీరోయిన్ ఐశ్వర్య రాజేష్

## 'ఓ. సుకుమారి'అందరికీ నచ్చుతుంది


హీరో తిరువీర్, హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ఓ సుకుమారి'తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. జూలై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత 'ఓ.! సుకుమారి' తో ప్రేక్షకుల ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. 17న సినిమా విడుదల అవుతోంది.ఒక చిన్న సినిమాను పెద్ద సినిమాలా తీర్చిదిద్దడానికి ప్రతీ ప్రయత్నం చేశారు. ఈ సినిమా ఆయనకు చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అందరం కలిసి సక్సెస్ పార్టీ చేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. దర్శన్‌కు ఆల్ ది బెస్ట్. తిరువీర్ తో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. మా సినిమాటోగ్రాఫర్ ఎంతో అందంగా చూపించారు. నేను అమెరికాలో ఉన్నప్పుడు ఒక కారులో ప్రయాణిస్తుండగా ఈ సినిమా పాటలు వరుసగా దాదాపు పది సార్లు వినిపించాయి. అందరూ చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను. ప్రీ రిలీజ్ ఈవెంట్లో హీరో తిరువీర్ మాట్లాడుతూ 'మసూద' ' సినిమాను ఎస్‌విసి రిలీజ్ చేసింది. ఈ సినిమాను కూడా ఎస్‌విసినే విడుదల చేస్తోంది. అందులో నా జోడీగా నటించిన అమ్మాయి పేరు మినీ. ఇందులో నా జోడీగా నటించిన అమ్మాయి పేరు దామిని. మహేశ్వర్ రెడ్డి ప్రతి విషయాన్ని జాగ్రత్తగా చూసుకుంటారు.దర్శకుడు భరత్ దర్శన్, నిర్మాత మహేశ్వర్ రెడ్డి, నటుడు మురళీధర్ గౌడ్, డిఒపి కుషేందర్ , సంగీత దర్శకుడు భరత్ ఎడిటర్ శ్రీ ప్రసాద్ .పాల్గొన్నారు.

## 'హుషార్ పిట్టలులో' 'టోంగా..టోంగా' పాట విడుదల




అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బివిజి స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి 'టోంగా టోంగా' అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది. ఈ సందర్భంగా చరణ్ అర్జున్ మట్లాడుతూ ''తొలిసారిగా నేను మ్యూజిక్ అందించిన చిత్రంలో ఓ సాంగ్‌కు ఈవెంట్ పెట్టడం సంతోషంగా ఉంది. ఈ పాటను ఎంతో సందడిగా, హుషారుగా చేశాం. ఈ సినిమాలో అన్ని తరహా పాటలు ఉంటాయి. ఈ చిత్ర దర్శకుడు ఎంతో రూటెడ్.. ఈ సినిమా టీజర్ విడుదలైన తరువాత ఎంతో హాట్ టాపిక్‌గా మారింది. ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఎదరుచూస్తున్నారు. ప్రేక్షకులకు కూడా అదే ఫీల్ కలుగుతుందని నమ్ముతున్నాను' అన్నారు.నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ టీజర్ విడుదలైనప్పుడు వైరల్ అయ్యింది. కొంత మంది తెలియక బ్యాడ్ కామెంట్లు పెట్టారు. కానీ సినిమా విడుదల తరువాత ఆ సినిమాలో ఉన్న అసలు కథ అందరికి తెలుస్తుంది. అందరి హృదయాలకు హత్తుకునే సినిమా ఇది. ఈ సినిమాలో అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ కథ చెప్పినప్పుడు 'చిట్టి పిల్ల', 'మాసినెపల్లి రవి' పాత్రలు అందరినీ అలరిస్తాయి. కథకు తగ్గ ఆర్టిస్టులను తీసుకున్నాం. అందరూ వారి పాత్రలకు న్యాయం చేశారు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య ఈ సినిమాను నిర్మించాను. ఎంతో ప్రొఫెషనల్‌గా తీసిన సినిమా ఇది. ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు ఈ సినిమాను విడుదల చేయడం అంటేనే ఈ సినిమా ఎలాంటి సినిమానో అర్థం చేసుకొవచ్చు. ఈ సినిమా విడుదల తరువాత అందరూ ఓ మంచి సినిమా తీశామన్న అనుభూతికి లోనవుతారు. ఈ సినిమా ను విడుదల చేయడానికి బెక్కం వేణుగోపాల్ సహకారం మరువలేనిది. ఇది ఓ మంచి సినిమా కాబట్టే అందరూ సపోర్ట్ చేశారు. ఈ సినిమాను విడుదల చేస్తున్న సురేష్ ప్రొడక్షన్స్ అధినేత సురేష్ బాబుకి నా కృతజ్ఞతలు అన్నారు.దర్శకుడు భిక్షు మాట్లాడుతూ ' ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదేదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది అన్నారు. నిర్మాత బెక్కం వేణుగోపాల్, హీరో అన్ను, హీరోయిన్ వాసవి గణేషన్ పాల్గొన్నారు.

## 24న 'ఆమెన్' విడుదల




నిర్మాత ఎస్‌కె. బషీద్ నుండి మరో విభిన్నమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎస్‌బికె ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై, రేగుల నీరజారాణి సమర్పణలో, ఆర్ఎన్ఆర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో రూపొందిన అత్యంత ప్రతిష్ఠాత్మక హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆమెన్' జూలై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా గురించి ఎస్‌కె.బషీద్ మాట్లాడుతూ ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాల ట్రెండ్స్ పూర్తిగా మార్చేలా 'ఆమెన్' రూపొందించాం. సరికొత్త సస్పెన్స్, భయానక ఎలిమెంట్స్ ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నాం. కొత్త నటీనటులతో టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌గా సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ఎంత భయపెడుతుందో చెప్పలేం. గుండె జబ్బులు ఉన్నవాళ్లు థియేటర్‌కు రావద్దు. ఒంటరిగా కూర్చుని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు. ఇది కుటుంబ సమేతంగా థియేటర్లలో ఆస్వాదించాల్సిన ఒక భయానక అనుభవం. ఔట్‌పుట్‌పై మాకు పూర్తి నమ్మకం ఉంది. అందుకే ఈ చిత్రాన్ని మేమే స్వయంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం అన్నారు. ఇటీవల విడుదలైన 'ఆమెన్' పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హెచ్చరిక: . అనే క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. క్రూసేడర్ థీమ్, నీటిలో నుంచి వెలువడుతున్న భయానక హస్తాలు, మిస్టరీతో నిండిన విజువల్స్ హారర్ ప్రేమికులను ఉత్కంఠకు గురి చేస్తున్నాయి అన్నారు.

## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ఆపరేషన్ అరుణారెడ్డి'




ప్రముఖ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ఆపరేషన్ అరుణారెడ్డి'. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్ బాధ్యతలు కూడా పోసాని కృష్ణమురళి వహిస్తుండటం విశేషం. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా ఖాన్, బీజేపీ నేత రఘునందన్ రావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 17న 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమా థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు, దర్శక, నిర్మాత పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ మా సినిమా ఇంత త్వరగా షూటింగ్ చేసుకుని రిలీజ్ కు వస్తోందంటే కారణం నా మిత్రుడు శ్రీనివాస్. ఆయన అందించిన సహకారం వల్లే అనుకున్న టైమ్ కు సినిమాను రిలీజ్ చేస్తున్నా. నేను చేసిన అన్ని చిత్రాలో. ఈ సినిమాలో ఒక్క బూతు గానీ, ఒక్క అసభ్యమైన సన్నివేశం గానీ ఉండదు. ఎంతో సిన్సియర్ గా ఈ సినిమాను రూపొందించాను. 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమా ప్రేక్షకులందరికీ బాగా నచ్చుతుందని నమ్ముతున్నా అన్నారు. హీరోయిన్ హిందోళ చక్రవర్తి మాట్లాడుతూ నవ్విస్తుంది. ఆలోచింపజేస్తుంది. మన సొసైటీని రిఫ్లెక్ట్ చేసేలా ఉంటుంది. ఈ నెల 17న థియేటర్స్ కు వెళ్లి మా సినిమా చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా. మ్యూజిక్ డైరెక్టర్ మహదేవ్ ఏలేందర్, డిఒపి సుధాకర్, సెకండ్ లీడ్ రోల్ కాజల్ శర్మ , ప్రొడ్యూసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెబెల్ స్టార్ ప్రభాస్ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఫౌజీ'తో వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. హను రాఘవపుడి దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో, టీసిరీస్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అద్భుతమైన టైటిల్ పోస్టర్‌తో అంచనాలు పెంచింది. రిలీజ్ డేట్ తో పాటు విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో 'ఫౌజీ' ప్రపంచాన్ని, సినిమా భారీ స్థాయిని అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రభాస్ ఇప్పటివరకూఎప్పుడూ కనిపించని రఫ్ ఎమోషనల్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. యుద్ధంలో తీవ్రంగా గాయపడిన ఓ యోధుడిలా, రక్తంతో తడిసిన దుస్తులు, శరీరమంతా గాయాలతో, చుట్టూ నేలకూలిన సైనికుల మధ్య తుపాకీని పట్టుకుని నిశ్శబ్దంగా కూర్చున్న ప్రభాస్ లుక్ అదిరిపోయింది. ఆయన లుక్ ఓ యోధుడి త్యాగం, బాధ, ధైర్యం, పట్టుదలను ప్రజెంట్ చేస్తోంది. పొడవాటి జుట్టు, గడ్డం, యుద్ధం వల్ల అలసిపోయిన శరీరం, రక్తపు మరకలతో ఉన్న తెల్లటి ధోతీలో ప్రభాస్ చేసిన మేకోవర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది. తన హావభావాలతోనే బాధ, ధైర్యం, సంకల్పం, ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచే విధంగా పోస్టర్ రూపొందించారు. పోస్టర్‌లో కనిపిస్తున్న యుద్ధభూమి కూడా కథలోని ఇంటెన్సిటీని తెలియజేస్తోంది. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.ప్రభాస్, ఇమాన్వి, ఈ చిత్రానికి డిఒపి : సుదీప్ ఛటర్జీ,సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైనర్: అనిల్ విలాస్ జాదవ్, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వర రావు,సాహిత్యం: కృష్ణకాంత్, కొరియోగ్రాఫర్: ప్రేమ్ రక్షిత్, కాస్ట్యూమ్ డిజైనర్లు: శీతల్ ఇక్బాల్ శర్మ, టి విజయ్ భాస్కర్.

## డిసెంబర్ 3న 'ఫౌజీ' రిలీజ్





## లండన్ లో 'ఎపిక్' పాటల ఆవిష్కరణ

'బేబి' సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ తో క్రేజీ జంటగా మారారు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య. ప్రస్తుతం వీరు కలిసి 'ఎపిక్' అనే మూవీలో నటిస్తున్నారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో తమ సినిమాను లండన్ లో ప్రమోట్ చేసుకుంటున్నారు ఆనంద్, వైష్ణవి. లండన్ లో జరిగిన ప్రతిష్ఠాత్మక తెలుగు పీజెంట్ లో సెలబ్రిటీ గెస్ట్ లుగా ఆనంద్, వైష్ణవి పాల్గొన్నారు. ఎపిక్ చిత్రంలోని పాటలకు కార్యక్రమంలో పాల్గొన్న తెలుగువారితో కలిసిఆనంద్, వైష్ణవి కలిసి స్టెప్స్ వేశారు.లండన్‌వాసి, తెలుగు నటుడు నిర్మాత యష్ రంగినేని, యుకె పార్లమెంట్‌లో లార్డ్ ఉదయ్ నాగరాజు ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా హాజరయ్యారు.

# ఎర్ర సముద్రం మూసివేతకు సిద్ధంగా ఉండండి

- హౌతీ సైన్యాలకు ఇరాన్ పాలకుల ప్రామాణిక ఆదేశం
- వినాశకర దాడులు చేస్తాం జాగ్రత: ఐఆర్‌జిసి కల్నల్ హెచ్చరిక
- అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ స్థావరాన్ని ధ్వంసం చేసిన ఇరాన్
- ఎనిమిది ఇరాన్ డ్రోన్లు కూల్చేసిన జోర్డాన్
- ఖర్గ్ ద్వీపం స్వాధీనం సహా భారీదాడికి ట్రంప్ ప్రణాళిక



**దుబాయ్/వాషింగ్టన్:** పశ్చిమాసియాలో శాశ్వత శాంతి సాధనకు కుదిరిన ఎంఓయు నుండి వైదొలగినట్లు ప్రకటించిన ఇరాన్ అమెరికాపై భీకర దాడులు చేసింది. ఇరాన్ మర్యాదగా ప్రవర్తించాలని,చర్చలకు రావాలని లేకపోతే వచ్చేవారం కథ ముగిస్తామని ట్రంప్ హెచ్చరించగా, ఎర్ర సముద్రంలో నౌకల రాకపోకలను నిలిపివేసేందుకు సిద్ధంగా ఉండాలని హౌతీ సైన్యాలకు ఇరాన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థకు ఒక సరికొత్త ముప్పు మొదలైనట్లవుతుంది. అమెరికా—ఇరాన్ యుద్ధం వచ్చేవారంలో ఉగ్రరూపం దాల్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తమ దేశ మౌలిక సదుపాయాలపై తీవ్ర దాడులు చేస్తే తాము కూడా అదేస్థాయిలో ఈ ప్రాంతంలో ఇంకా మిగిలి ఉన్న మౌలిక సదుపాయాలను శిథిలావస్థకు చేర్చి పూర్తిగా తుడిచిపెడతామని ఐఆర్‌జిసి ఖతమ్ అల్—అన్బియా కేంద్ర కార్యాలయ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జోల్ఫఘారీ అమెరికాకు హెచ్చరిక చేశారు.హోర్ముజ్ జలసంధిలో అమెరికా జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని, వారి దురాక్రమణ అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.హోర్ముజ్ జలసంధిని ఇరాన్‌కు ఉన్న ''అభేద్యమైన రెడ్‌లైన్''గా అభివర్ణించారు. ఈసారి తాము చేసే దాడులు గతంకంటే విస్తృతంగా,వినాశకరంగా ఉంటాయన్నారు.

ఇరాన్‌పై అమెరికా యుద్ధం ప్రారంభించగానే హౌతీలు కూడా యుద్ధంలో చేరుతున్నట్లు తొలుత ప్రకటించారు. కానీ వారిని ఒక రిజర్వు సైన్యంగా భావించిన ఇరాన్ యుద్ధరంగంలోకి రాకుండా ఆపేయడంతో హౌతీలు యుద్ధంలో చేరలేదు. వార్ రూమ్ సమావేశంలో నిర్ణయాల మేరకు ట్రంప్ యుద్ధాన్ని ఉధృతం చేస్తే హౌతీ ఉద్యమ సైన్యాలు రంగ ప్రవేశం చేస్తాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వం లోతుగా చర్చించే ఈ నిర్ణయం తీసుకుని సమాచారాన్ని హౌతీలకు చేరవేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయని రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకటించింది. ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపంసహా అబూముసా, ఇతర ద్వీపాలను కూడా స్వాధీనం చేసుకోవడానికి, ఇరాన్‌లో విద్యుత్ ప్లాంటులు,వంతెనల ధ్వంసానికి జులై 20 నుండి భారీ దాడుల ప్రణాళికను ట్రంప్ సిద్ధం చేసుకుంటున్న తరుణంలో హౌతీ సైన్యాలకు ఇరాన్ పై ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ అమెరికా గనుక ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంటులు,వంతెనలు ధ్వంసంచేసి ద్వీపాలను స్వాధీనం చేసుకునే తీవ్ర దాడులకు దిగితే తక్షణం ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకల రాకపోకలను హౌతీలు స్తంభింపజేస్తారు. ఇదిలా ఉండగా, చమురు వాణిజ్య నౌకల బహ్రైన్‌లో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ స్థావరాన్ని ధ్వంసం చేసినట్లు ఐఆర్‌జిసి (ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్) ఉన్నతస్థాయి కమాండ్ సెంటర్ ప్రకటించింది.

ఇరాన్‌లో నిర్దేశిత లక్ష్యాలపై వరుసగా ఐదోరోజు గురువారం దాడులను పూర్తిచేసినట్లు అమెరికా సెంట్‌కామ్ సైనిక వర్గాలు ప్రకటించాయి. బందర్ అబ్బాస్ ఓడరేవు సహా పలు ప్రాంతాలలో లక్ష్యాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. గ్రేటర్ తుంబ్ ద్వీపంలో తీరప్రాంత రక్షణ,క్రూయిజ్ క్షిపణి స్థావరాలపై 90 నిమిషాలసేపు దాడులు చేసినట్లు తెలిపింది. ఇరాన్ ఓడరేవులపై ట్రంప్‌గడచిన మంగళవారం (జులై 14) విధించిన దిగ్బంధనాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని, తమ హెచ్చరికలు ఉల్లంఘించి ఖర్గ్ ద్వీపంలోని ఇరాన్ చమురు ఎగుమతి టెర్మినల్ వైపు వెళుతున్న ''బెల్మా'' అనే ట్యాంకర్‌పై క్షిపణి దాడులు చేసినట్లు సెంట్‌కామ్ తెలియజేసింది. కాగా బహ్రైన్‌లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ స్థావరాన్ని ధ్వంసం చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. గల్ఫ్‌లో అమెరికాకు స్థావరాలిచ్చిన మిత్రదేశాలపై దాడులు కొనసాగించినట్లు పేర్కొంది. అదే సమయంలో జోర్డాన్ సైన్యం ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ ప్రయోగించిన ఎనిమిది క్షిపణులను కూల్చివేసినట్లు పేర్కొంది. యుద్ధం హోరాహోరీగా సాగుతూ ఉండటంతో జలసంధిలో నౌకల రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. కేవలం ఏడు నౌకలు మాత్రమే ప్రయాణం చేశాయి.

**ఇరాన్ రాజీ పరిష్కారం కోరుతోంది:ట్రంప్ వాళ్ళు మర్యాదగా ప్రవర్తించాలి**

యుద్ధ దాడుల నుండి బయట పడేందుకు ఇరాన్ రాజీ పరిష్కారాన్ని కోరుకుంటోందని డోనాల్డ్ ట్రంప్ గురువారం చెప్పారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించాలా?వద్దా? అనే విషయంపై తాము తర్వాత ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రక్షణ,ఆవిష్కరణల సదస్సులో పాల్గొనేందుకు పెన్సిల్వేనియాకు వెళ్ళిన ట్రంప్ పాత్రికేయుతో మాట్లాడుతూ, ఇరాన్‌కు పదే పదే గడువులు విధించడం, ఆంక్షలు పెట్టడం తనకు ఇష్టం లేదని, వారు మర్యాదగా ప్రవర్తించాలని హెచ్చరించారు. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రస్తుతం ఎంత మాత్రం సంతోషంగా లేదని, వారు రాజీపడాలని చాలా తీవ్రంగా కోరుకుంటున్నారని, ఈ విషయంలో తాము కూడా రాజీపడతామా?లేదా వారి కథను ముగించేస్తామా? అనేది తేలుతుందని అనాన్నరు. ఇరాన్ రేవులకు చమురు ట్యాంకర్లు వెళ్ళకుండా దిగ్బంధనాన్ని 14వ తేదీ నుండి ట్రంప్ తిరిగి అమలు చేస్తున్నారు. అంతకుముందు ఏప్రిల్ 13 నుండి జూన్ 18 వరకూ ఇరాన్ ఓడరేవులపై సెంట్‌కామ్ దిగ్బంధనాన్ని అమలు చేసింది. ఈ సమయంలో 140కిపైగా నౌ కలను అమెరికా దారిమళ్ళించింది. మరో తొమ్మిది నౌకలను దాడులతో నిలిపివేసింది. ఇదిలా ఉం డగా అమెరికా—ఇరాన్‌లను ఎంఓయుకు అనుగుణంగా శాంతి చర్చలకు ప్రోత్సహిస్తామని పాకిస్థాన్ ప్రకటించింది. కాగా సౌదీఅరేబియా,కువైట్‌లకు అత్యాధునిక ఆయుధాల సరఫరా ఒప్పందం చేసుకున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

## ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా పని చేస్తాం: మంత్రి తుమ్మల

- రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలతో రాష్ట్రస్థాయి కంటింజెన్సీ ప్లాన్ విడుదల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా సమర్థవంతంగా పని చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించేందుకు రూపొందించిన రాష్ట్రస్థాయి ఎల్‌నినో కంటింజెన్సీ ప్లాన్—2026 (వానాకాలం)ను మంత్రి గురువారం సచివాలయంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇక్రిశాట్ , భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, ఐఐఓఆర్ , సిఆర్‌ఐడిఎ, భారత వాతావరణ విభాగం, వ్యవసాయ, ఉద్యాన శాఖల శాస్త్రవేత్తలు, నిపుణులు కలిసి అత్యంత సమగ్రంగా ఈ కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి ఇందులో పొందుపరిచినట్లు చెప్పారు.ఈ ప్రణాళికను జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని, గ్రామ స్థాయి వరకు విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.రాష్ట్రాన్ని భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, నేలల స్వభావం ఆధారంగా మూడు వ్యవసాయ ప్రాంతాలుగా విభజించి, ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఈ కంటింజెన్సీ ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. 18 ప్రధాన పంటలకు సంబంధించి విత్తే సమయం, ప్రత్యామ్నాయ పంటలు, భూమి స్వభావానికి అనుగుణమైన సాగు విధానాలు, పంటల నిర్వహణ, విత్తనాల లభ్యత వంటి అంశాలపై శాస్త్రీయ మార్గదర్శకాలను ఈ ప్రణాళికలో పొందుపరిచినట్లు మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాలో భూగర్భ జలాల లభ్యత, ప్రధాన, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, సాగుకు అందుబాటులో ఉన్న నీటి పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని కూడా ఈ ప్రణాళికలో చేర్చినట్లు మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, సహకార శాఖ కమిషనర్ రాహుల్ రాజ్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, తెలంగాణ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండి లక్ష్మి , హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి, అలాగే ఇక్రిశాట్, ఐఐఒఆర్, ఐఐఎంఆర్, సిఆర్‌ఐడిఎ ఐఎండి ప్రతినిధులు పాల్గొన్నారు.

## తొలి హైడ్రోజన్ రైలు..

(మొదటి పేజీ తరువాయి)

అసాధారణ పరిస్థితులు తలెత్తితే హైడ్రోజన్ సరఫరా స్వయంచాలకంగా నిలిచిపోయే విధానం కూడా ఉంది. నిరంతర గాలి ప్రసరణ వ్యవస్థ వల్ల హైడ్రోజన్ లీకైనా అది ఒకేచోట పేరుకుపోకుండా వెంటనే గాలిలో కలిసిపోతుంది. లోకో పైలట్ క్యాబిన్‌ను కూడా అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా ఉండేలా ప్రత్యేకంగా రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. జర్మనీ ఈ సాంకేతికతను వాణిజ్యపరంగా అమలు చేసిన తొలి దేశం. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు కూడా ప్రయోగాత్మకంగా ఈ రైళ్లను నడుపుతున్నాయి. అయితే అవి సాధారణంగా రెండు నుంచి నాలుగు బోగీలతో ఉంటాయి. భారత్ రూపొందించిన ఈ రైలు 10 బోగీలతో, సుమారు 2,600 మంది ప్రయాణికులను తీసుకెళ్లగల సామర్థ్యంతో ఉండటం విశేషం. భవిష్యత్తులో కల్కా—షిమ్లా వంటి వారసత్వ రైల్వే మార్గాల్లో కూడా హైడ్రోజన్ సాంకేతికతను వినియోగించే అవకాశాలను భారతీయ రైల్వేలు పరిశీలిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు దేశంలో స్వచ్ఛ ఇంధన ఆధారిత రైల్వే వ్యవస్థకు కొత్త దిశను చూపనుందని అధికారులు భావిస్తున్నారు.

### నేడు ప్రారంభించనున్న ప్రధాని

**చండీగఢ్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం హర్యానాలో పర్యటించి రూ.24,000 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. జింద్‌లో భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించడంతో పాటు, ఢిల్లీ—అమృత్‌సర్—కత్రా ఎక్స్‌ప్రెస్‌వే, అంబాలా—కాలా అంబ్ రహదారి, జింద్—గోహానా గ్రీన్‌ఫీల్డ్ హైవే వంటి జాతీయ రహదారి ప్రాజెక్టులను దేశానికి అంకితం చేయనున్నారు. అనంతరం కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, భివానీ, నార్నౌల్ ప్రాంతాల్లో వైద్య కళాశాలలు, ఆసుపత్రులను ప్రారంభిస్తారు. సిక్కు మ్యూజియానికి శంకుస్థాపన కూడా చేయనున్నారు. హర్యానా పర్యటన అనంతరం చండీగఢ్, పంజాబ్‌లోని జలంధర్‌లో కూడా వేల కోట్ల రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు.

## ప్రపంచ ఎఐ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

కీలక ప్రసంగం చేయబోతున్నారు. దీంతో ఈ సదస్సుకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ప్రపంచ అభివృద్ధి, మానవ శ్రేయస్సుకు ఎఐ చేయబోయే సేవలను ఈ సదస్సు ప్రధానంగా ప్రపంచందృష్టికి తీసుకువస్తుంది. ఈ సదస్సులో జరిగే ప్రనపంచ ఉన్నత స్థాయీ ఎఐ పాలనా నిర్వహణ సమావేశం ఒక మైలురాయి కాబోతున్నది. ఎఐ వినియోగం—భవితవ్యాలపై అనే ప్రశ్నలు,సందేహాలు, భయాలు, ఆశాభావాలు వ్యక్తమవుతున్న వాతావరణం మధ్య జిన్‌పింగ్ చైనా విధానాలు,దార్శనికత,భవిష్యత్ ప్రతిపాదనలను వివరిస్తారని జిన్హువా పత్రిక తెలియజేసింది. మానవజాతి చరిత్రలో ఇప్పటివరకూ జరిగిన ఆవిష్కరణలకు భిన్నంగా ఎఐ అనేది ఒక కొత్త దశ. మానవాళి ఉత్పత్తి విధానాన్ని, మానవాళి జీవనశైలిని సమూలంగా ఎఐ మార్చేస్తోంది. ఇది సంక్లిష్టమైన సవాళ్ళు కూడా విసురుతోంది. అందువల్ల ''ఇక చాలు ఎ.ఐ పరిశోధనలు,దాని స్థాయి ఉన్నతీకరణ ఆపేద్దాం'' అని ఒకవైపు, ''మానవాళి అభ్యున్నతికి దానిని పతాకస్థాయికి తీసువెళ్ళాలి'' అనే వాదన మరోవైపు వినిపిస్తూ ఉద్ధృత చర్చలు జరుగుతున్న ఒక సంధి దశలో ఈ వార్షిక సదస్సుకు అత్యధిక ప్రాధాన్యత వచ్చింది. నాలుగురోజులపాటు ఈ సదస్సు జరుగుతుంది.

## న్యూజిలాండ్‌లో భూకంపం: సునామీ హెచ్చరిక

- 4,829కి పెరిగిన వెనిజులా మృతులు • జపాన్‌లో వడగాలులు:100 మందికి అస్వస్థత

**వెల్లింగ్టన్:** ఓసియానా ప్రాంతదేశం న్యూజిలాండ్‌లో గురువారం తీవ్ర భూకంపం సంభవించింది. రిచ్‌టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 6.3 గా నమోదైంది. దీంతో అధికారులు సునామీ హెచ్చరిక జారీ చేశారు.న్యూజిలాండ్ జాతీయ అత్యవసర నిర్వహణాసంస్థ సమాచారం ప్రకారం, దక్షిణద్వీపంలోని టెఅనౌ పట్టణ సమీపంలో ఈ భూకంపం సంభవించింది. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫియోర్డ్‌ల్యాండ్‌కు ముఖద్వారంగా ఉండే ఈ పట్టణానికి 40 కి.మీ దూరంలో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు సంబంధిత అధికారులు చెప్పారు.కాగా అమెరికాకు చెందిన భూగర్భ పరిశోధనాసంస్థ, జర్మన్ రీసెర్చ్ సంస్థలు ఈ భూకంప తీవ్రతను 5.9 గా నమోదు చేశాయి. భూగర్భంలో 50 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు వారు గుర్తించారు.ఇదిలా ఉండగా జూన్ 24వతేదీన వెనిజులాలో సంభవించిన భయంకరమైన జంట భూకంపాల కారణంగా మరణించిన వారి సంఖ్య గురువారంనాటికి 4,829కి పెరిగింది. దాదాపు 50,000 మందిపైగా శిథిలాల్లోనే ఉండిపోయి ఉంటారని అమెరికా భూగర్భసర్వే విభాగం ఇంతకుముందే అంచనావేసింది. గాయపడి చికిత్సపొందుతున్నవారిసంఖ్య 16,740కు చేరుకుంది. 58,000 భవంతులు,ఇళ్ళు నేలమట్టం కావడంలో వేలాది కుటుంబాలు వీధినపడ్డాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com